www.andhrajyothy.com
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 9-3-2025 | పేజీలు: 12 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 323

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: దశమి ఉ.7.46 తదుపరి ఏకాదశి, నక్షత్రం: పునర్వసు రా.11.55 తదుపరి పుష్యమి, వర్జ్యం: ఉ.11.41-1.19, అమృతఘడియలు: రా.9.28-11.06, దుర్ముహూర్తం: సా.4.45-5.32, రాహుకాలం సా. 4.30-6.00, సూర్యోదయం: 6.31, సూర్యాస్తమయం: 6.20

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



శనివారం ప్రకాశం జిల్లా మార్కాపురంలో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలతో ముఖాముఖిలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

మహిళా శక్తికి వందనం

ఏడాదిలో లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలే లక్ష్యం: బాబు

- ఇంటికో ఎంటర్‌ప్రెన్యూర్, ఏఐ ఉండాలి
- వెలిగొండకు కృష్ణా, గోదావరి జలాలు
- ఆడబిడ్డలు స్వేచ్ఛగా తిరిగేలా భరోసా
- వారి రక్షణ కోసం శక్తి టీమ్ యాప్
- మహిళలకు పెట్టుబడుల్లో 45% రాయితీ
- ఎన్ని కాన్పులకైనా ప్రసూతి సెలవులు
- ఎందరు పిల్లలున్నా తల్లికి వందనం
- మార్కాపురంలో మహిళా దినోత్సవ సభ

ఒంగోలు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఇంటికొక పారిశ్రామికవేత్త ఉండాలన్నది తన లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అందులో భాగంగానే రానున్న ఏడాది కాలంలో లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేసే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రకాశం జిల్లా మార్కాపురంలో రాష్ట్రప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డ్వాక్రా సంఘాల ఉత్పత్తులపై

మిగతా 2వ పేజీలో...

చంద్రబాబు టాస్క్‌మాస్టర్

తనలాగే అందరూ వేగంగా పనిచేయాలనుకుంటారు: లోకేశ్

- మా రాష్ట్రానికి ఆయనే అడ్వాంటేజ్
- జగన్‌కు ప్రతిపక్ష హోదా ఇవ్వలేం
- సీఎం కొడుకును కావడం వల్ల మరింత కష్టపడాల్సి వస్తోంది
- మహిళా దినోత్సవం రోజూ జరపాలి
- 'ఇండియా టుడే' కాంక్లేవ్‌లో మంత్రి

3



మహిళల భద్రతకు పెద్దపీట

- అతివలకు బీఎన్ఎస్ రక్షణ ఛత్రం
- వారిపై జరిగే ఘోరాల కట్టడికి కఠిన చట్టాలు రూపొందించాం
- పడతులపై నేరాలకు పాల్పడితే ఉరే
- కోట్ల మంది మహిళామణుల ఆశీస్సులు నా సొంతం.. అవే నా సంపద, బలం
- మహిళా దినోత్సవ సభలో ప్రధాని మోదీ

12

కూటమికి 'పట్టం'.. ఐక్యత 'భద్రం'!



..ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి ఘన విజయం సాధించాయి. ఇదే ప్రయోగాన్ని తెలంగాణలో కూడా అమలు చేస్తే... అన్న చర్చ ఇప్పుడు ఆ మూడు పార్టీలలో నడుస్తోంది.

..కేసీఆర్ ఇటీవల మాట్లాడుతూ, "తెలంగాణలో చంద్రబాబు రాజకీయం చేయాలనుకుంటే సహించేది లేదు" అని వ్యాఖ్యానించారు. ఆయన చంద్రబాబును కేవలం సెంటిమెంటు కోసమే వ్యతిరేకించడం లేదు. ఎన్డీయే కూటమి ఏర్పడితే తెలుగుదేశం, బీజేపీలలో చేరడానికి బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

..ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో అధికార ఎన్డీయే కూటమికి వెయ్యి ఏనుగుల బలం చేకూరింది. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎనిమిది నెలలకు జరిగిన ఎన్నికల్లో పట్టభద్రుల నియోజకవర్గాలు రెండింటిలోనూ తెలుగుదేశం పార్టీ పోటీకి పెట్టిన అభ్యర్థులకు 65 శాతం ఓట్లు రావడం విశేషం.

..క్షేత్ర స్థాయి పరిస్థితులను సమీక్షించుకొని దిద్దుబాటు చర్యలు తీసుకోవడానికి రాజకీయ పార్టీలు ఎన్నికల ఫలితాలను దిక్సూచిగా భావిస్తాయి. కానీ, వైసీపీ రూటే సెపరేటు!

..జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందు, వచ్చిన తర్వాత, ఇప్పుడు ఓడిపోయిన తర్వాత కూడా సీపీఎం పార్టీ ఆయనతో పరోక్షంగా చేతులు కలుపుతూనే ఉంది. జగన్ రెడ్డి వంటి వారితో చేతులు కలపడం వల్ల గతంలో ఆ పార్టీకి ఉండిన విశ్వసనీయతను ఇప్పుడు పూర్తిగా కోల్పోయింది.

..ప్రతిపక్ష హోదా ఇస్తే తప్ప శాసనసభలో అడుగుపెట్టనని జగన్ మంకుపట్టు పట్టారు. 1994లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా లభించకపోయినా ఆ పార్టీ శాసనసభాపక్షం నాయకుడుగా పి.జనార్దన్ రెడ్డి అలుపెరుగని పోరాటం చేశారు.

కొత్త పలుకు - ఆర్కే విశ్లేషణ 4లో..



9

ఎవరు చాంపియన్స్?

- భారత్-న్యూజిలాండ్ ఫైనల్ నేడే
- కోహ్లీ, రోహిత్‌పైనే అందరి దృష్టి
- దుబాయ్‌లో 'సీటీ' తుది సమరం

రంగన్న మృతదేహానికి రీపోస్టుమార్టం

3

- గాయాలున్నాయా అనే కోణంలోనూ
- 3-4 గంటల పాటు వైద్యుల పరిశీలన
- సేకరించిన అవయవాలు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు
- మృతుడి ఇంటి వద్ద క్లూస్ టీం తనిఖీలు
- వివేకా హత్య కేసు సాక్షి రంగన్న మరణంపై అనుమానాల నేపథ్యంలో సిట్ ఏర్పాటు

ఎమ్మెల్సీగా ఎవరెవరో!

నామినేషన్ల దాఖలుకు రేపే గడువు

- టీడీపీ ఆశావహుల్లో ఉత్కంఠ
- 4 సీట్లకు 25 మందికి పైగా రేసులో
- ఎంపికపై అధిష్ఠానం భారీ కసరత్తు
- సీనియర్లు, బీసీ, ఎస్సీలకే ప్రాధాన్యం
- నేడు అభ్యర్థులను ప్రకటించే చాన్స్
- 2027 నాటికి అందుబాటులోకి రానున్న మరో 23 స్థానాలు
- అప్పుడు న్యాయం చేస్తామని నేతలకు నచ్చచెబుతున్న పార్టీ అధిష్ఠానం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీలో ఎమ్మెల్సీ పదవుల కోసం ఆశావహుల జాబితా చాలా పెద్దగానే ఉంది. 4 స్థానాలకు ఏకంగా సుమారు 25 మందికి పైగా రేసులో ఉన్నారు. దీంతో అభ్యర్థులను ఖరారు చేసేందుకు టీడీపీలో భారీ కసరత్తే నడుస్తోంది. ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్లు వేసేందుకు సోమవారం ఆఖరి రోజు. గడువు దగ్గర పడటంతో ఆశావహుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఆదివారం అభ్యర్థులను ఖరారు చేసే అవకాశముంది. ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న

మిగతా 2వ పేజీలో...

అమరావతి, శ్రీకాకుళంలో అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టులు!

2

- రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- ప్రపంచ స్థాయి పారిశ్రామిక సంస్థలు నేరుగా రాజధానికి వచ్చేలా సదుపాయం
- సాధ్యాసాధ్యాలపై నివేదిక కోసం నోటిఫికేషన్

పోసానికి రిమాండ్‌లో రిమాండ్

3

- 20 వరకు విధించిన బెజవాడ కోర్టు
- పీటీ వారెంట్‌పై హాజరుపరిచిన పోలీసులు
- అనంతరం కర్నూలు జైలుకు తరలింపు
- పేట పోలీసులూ పీటీ వారెంట్‌తో రాక
- బెజవాడలోనే ఉంచాలని పోసాని విజ్ఞప్తి



మనం తగ్గొద్దు!

ట్రంప్ బెదిరింపులకు లొంగొద్దు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

"అమెరికా బెదిరింపులకు తలొగ్గితే మనం నష్టపోతాం. నాణ్యమైన జనరిక్ మందులను అత్యంత చౌకగా మనలా మరే దేశమూ వారికి సరఫరా చేయలేదు. ఇప్పుడు అమెరికా ఒత్తిళ్లకు లొంగితే రేపు మరో దేశం కూడా ఇలాగే బెదిరించవచ్చు!"

- రావి ఉదయ్ భాస్కర్, ఫార్మా నిపుణుడు

అమెరికా 'ఆరోగ్యం' మన చేతుల్లో

- 30% జనరిక్ మందులు భారత్‌వే
- చౌక ధరకే నాణ్యమైన ఔషధాలు
- మనల్ని కాదని ఉత్పత్తి చేయలేదు
- పట్టున్న రంగంలో గట్టిగా ఉండాలి
- ఫార్మెక్సిల్ మాజీ డీజీ ఉదయ్ భాస్కర్
- 'ఆంధ్రజ్యోతి'తో ముఖాముఖి

(సెంట్రల్ డెస్క్)

అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధానికి తెరలేపారు. 'ప్రతీకార సుంకాలు' అంటూ చెలరేగుతున్నారు. 'భారత్‌నూ వదిలేది లేదు' అని హెచ్చరిస్తున్నారు. ఇది ఫార్మారంగంపై కీలక ప్రభావం చూపించే అవకాశం కనిపిస్తోంది. అయితే... ట్రంప్ బెదిరింపులకు లొంగిపోవాల్సిన అవసరం లేదని ఫార్మా రంగ నిపుణుడు రావి ఉదయ్ భాస్కర్ పేర్కొన్నారు. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే ఫార్మా, వైద్య సంబంధిత ఉపకరణాలపై మనం సుంకాలు తగ్గించాల్సిన అవసరంలేదని అభిప్రాయపడ్డారు. నాలుగు దశాబ్దాలకు పైగా ఫార్మా రంగంతో అనుబంధం ఉన్న ఆయన... ఫార్మాసూటికల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రొమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెక్సిల్) డైరెక్టర్ జనరల్‌గా పనిచేశారు. ప్రస్తుతం

మిగతా 12వ పేజీలో...

మహిళా శక్తికి వందనం



నా భార్యను చూసి గర్వపడుతున్నా..

ఇంటి పనులు కూడా తెలియని నా భార్యను వ్యాపారంవైపు ప్రోత్సహించా. అయిష్టంగానే ఆ రంగంలో అడుగుపెట్టిన ఆమె హెరిటేజ్ సంస్థను అత్యున్నత స్థానంలో నిలిపింది. నేడు ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా సేవలు విస్తరిస్తున్న ఆమెను చూసి గర్వపడుతున్నా.

24 సంస్థలతో ఒప్పందాలు..

డ్వాక్రా సంఘాలకు శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, వారి ఉత్పత్తుల అమ్మకాలు, స్వయం ఉపాధికి సంబంధించి 24 సంస్థలతో సీఎం సమక్షంలో సెర్ప్ అధికారులు ఎంవోయూలు చేసుకున్నారు. మహిళ రక్షణ కోసం ఉద్దేశించిన శక్తి యాప్, పీఎంజీపీ పథకాలను చంద్రబాబు ప్రారంభించారు. వివిధ రంగాల్లో రాణించిన 10 మంది ఎస్‌హెచ్‌జీ మహిళల విజయగాథలతో రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్రంలోని 14,705 సంఘాలకు రూ.1,826.43 కోట్లు, స్త్రీనిధి కింద రూ.వెయ్యి కోట్ల రుణాలను పంపిణీ చేశారు. పలువురు డ్వాక్రా మహిళలను సన్మానించారు.

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటుచేసిన స్టాళ్లను పరిశీలించారు. వివిధ సంస్థలతో ఒప్పందాలు, లబ్ధిదారులకు యూనిట్ల పంపిణీ అనంతరం మహిళలతో ఆయన చర్చావేదిక నిర్వహించారు. వివిధ అంశాలపై వారడిగిన ప్రశ్నలకు జవాబిచ్చారు. ఆయా రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, తీసుకుంటున్న చర్యలనూ వివరించారు. 'డ్వాక్రా సంఘాల ఏర్పాటు అనంతరం పేదల జీవితాల్లో అనేక మార్పులొచ్చాయి. ప్రతి కుటుంబ ఆర్థికాభివృద్ధిలో మహిళలు కీలకమయ్యారు. డ్వాక్రా ఉత్పత్తుల విక్రయాలు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న నేపథ్యంలో వారిని మరింతగా ప్రోత్సహించి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే ఆలోచన చేశాం. అవసరమైన శిక్షణ, నైపుణ్యాభివృద్ధితోపాటు పెద్దఎత్తున రాయితీలు, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల్లో పురుషులకు 20% రాయితీ ఇస్తుండగా.. మహిళలకు 45% ఇవ్వబోతున్నాం. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండింటిలోనూ శిక్షణ ఇస్తాం. మహిళలు ఆన్‌లైన్ కోర్సులు చేయాలి' అని సూచించారు. ప్రస్తుతం రాష్ట్ర తలసరి ఆదాయం రూ.2.68 లక్షలని, 2047 నాటికి 58 లక్షలు చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఇంకా ఏమన్నారంటే..

వేధిస్తే అదే చివరిరోజు..

ఆడబిడ్డల రక్షణకు ప్రభుత్వం పూర్తి భరోసా ఇస్తుంది. వారిని వేధించేవారికి. అత్యాచారాలు చేసేవారికి అదే ఆఖరి రోజు అవుతుంది. వారి వెన్నులో వణుకు పుట్టేలా ప్రభుత్వం వ్యవహరిస్తుంది. వారి ప్రవర్తనకు కారణమైన గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నాం. మహిళల రక్షణ కోసం ఈ రోజే శక్తి టీమ్ యాప్ ప్రారంభించాం. ఆపదలో ఉన్న వారు ఆ సేవలను వాడుకోవాలి.

ఎక్కువ మందిని కనండి..

ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ వద్దని గతంలో ప్రచారం చేసిన నేను.. ఇప్పుడు ఎక్కువ మందిని కనాలని చెబుతున్నాను. మారిన పరిస్థితులకు అనుగుణంగా అందరూ జనాభావృద్ధిపై దృష్టి పెట్టాలి. ఎక్కువ మంది పిల్లలుంటే చదువులకు అధిక ఖర్చు అవుతుందని భావిస్తారు. అందుకే ఎంతమంది పిల్లలుంటే.. అంతమందికీ ఏటా రూ.15 వేలు తల్లికి వందనం పేరుతో ఇవ్వనున్నాం. గతంలో మహిళా ఉద్యోగులకు రెండు కాన్పుల వరకే ప్రసూతి సెలవులు ఉండేవి. ఇక నుంచి ఎన్ని కాన్పులకైనా ప్రసూతి సెలవులు ఇస్తాం. కట్టెల పొయ్యిపై వంట చేసే సమయంలో ఆ పొగ వల్ల నా తల్లి కంట్లో కన్నీరు చూశాను. అలా ఏ అమ్మా ఇబ్బందిపడకూడదనే గ్యాస్ కనెక్షన్లు అందించాం. ప్రస్తుతం ధరలు పెరగడంతో మళ్లీ కొందరు కట్టెల పొయ్యి వైపు చూడడం గుర్తించి ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం.

పూర్తిచేయకుండానే ప్రారంభించాడు..

వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేయకుండానే ఎన్నికల్లో లబ్ధి కోసం గత సీఎం దానిని ప్రారంభించాడు. నిజానికి ఆ ప్రాజెక్టుకు నేనే శంకుస్థాపన చేశా. నేనే ప్రారంభిస్తా. కృష్ణా జలాలతోపాటు అవసరమైతే పోలవరం-బనకచర్ల పథకం ద్వారా గోదావరి నీటిని కూడా తరలించి ఈ ప్రాంత సాగు, తాగునీటి ఇక్కట్లు తీరుస్తాం. మార్కాపురం జిల్లా ఏర్పాటు చేసి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం.

ఉత్తమ సేవలకు సన్మానం..

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన 12 మంది మహిళలను చంద్రబాబు సత్కరించారు. వారిలో డి.సుమతి రామ్మోహన్‌రావు (మృదంగం), శారదా రామకృష్ణ (కూచిపూడి), బాలాత్రిపుర ప్రసూన (రిపోర్టర్), పి.విజయలక్ష్మి (కల్చరల్), ఎస్.భారతి (హరికథ), నడిపల్లి రత్నకుమారి (విద్యారంగం, కెనడీ స్కూల్స్), ఎం.స్వర్ణలతాదేవి (సోషల్ సర్వీసు), టి.వసంతలక్ష్మి (సేవలు), శిరీష (యోగా), ఎన్.ఫణిరత్న (హోంగార్డు), కృష్ణకుమారి (రచయిత్రి), మంజుల (గాత్ర సంగీతం) ఉన్నారు. కార్యక్రమంలో మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, ఆనం రామనారాయణరెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, ప్రకాశం జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



మార్కాపురంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకలలో సీఎం చంద్రబాబు, మంత్రి సంధ్యారాణిల గ్రూప్ ఫొటో

పార్టీ పదవుల్లో సగం మహిళలకు

వైసీపీ వారితో లాలూచీ రాజకీయాలు సహించను

నేతలందరూ పద్ధతి మార్చుకోవాల్సిందే

కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు స్పష్టీకరణ

'మహిళలకు రాజకీయ రిజర్వేషన్లు పెరుగుతున్నాయి. తదనుగుణంగా పార్టీలోనూ నాయకురాళ్లు పెరగాలి. అందుకే ఇక పార్టీ పదవుల్లో వారికి సగం ఇవ్వబోతున్నాను' అని చంద్రబాబు ప్రకటించారు. డబ్బు, కుల పిచ్చి కోసం వైసీపీ వారితో లాలూచీ పడేవారిని సహించనని టీడీపీ నేతలను హెచ్చరించారు. పనిచేయని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలను వదలనని స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం మార్కాపురంలో నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంతమంది కార్యకర్తల్లో ఒకే ఒక్క మహిళా కార్యకర్త ఉండడాన్ని వేలెత్తిచూపారు. 'భవిష్యత్‌లో శాసనసభ స్థానాల్లో కూడా 33 శాతం మహిళలకు రిజర్వు కాబోతున్నాయి. స్థానిక సంస్థల్లో 50 శాతం వారికి రాబోతున్నాయి. అందుకనుగుణంగా పార్టీలో మహిళా నాయకులను తయారుచేయాలి. ఇందుకోసం పార్టీ నిర్మాణంలో మార్పులు చేయబోతున్నాం. బూత్, యూనిట్, క్లస్టర్, జిల్లా, రాష్ట్ర పార్టీ పదవుల్లో మహిళలకు ప్రాధాన్యమిస్తాం. అవసరమైతే ఆ పదవులను రెండు విభజించి అందులో ఒకటి మహిళలకు కేటాయిస్తాం. లేదంటే నాయకులే తమ ఇళ్లలోని మహిళలకు పదవులు ఇచ్చుకుంటారు' అని చమత్కరించారు. 60 వేల మంది బూత్ స్థాయి నాయకులతో రానున్న మూడు నెలల్లో వాట్సాప్ ద్వారా టచ్‌లోకి వస్తానన్నారు. ఒకసారి గెలిచి, ఇంకోసారి ఓడితే ఫర్వాలేదనే విధానానికి స్వస్తి పలకాలని, ప్రతిసారీ గెలుపే ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పిలుపిచ్చారు. మంత్రులు కొందరు వారికప్పగించిన జిల్లాల్లో సమీక్షా సమావేశాలు నిర్వహించడం లేదని, అలాగే ఎమ్మెల్యేలు కార్యకర్తల సమావేశాలు పెట్టడం లేదన్నారు. వీరు పద్ధతి మార్చుకుని పనితీరు మెరుగుపరచుకోవాలని సూచించారు. కూటమి పార్టీలతో సఖ్యతగా ఉండాలని, మూడు పార్టీల కలయిక శాశ్వతం కావాలన్నారు.

బాబు చెప్పిన ఉంగరం రహస్యం

తన వేలి ఉంగరం రహస్యాన్ని చంద్రబాబు వెల్లడించారు. పూజల కోసం పెట్టుకున్నది కాదని, ఆరోగ్య సూత్రాల్లో భాగమని చెప్పారు. ఈ వయసులో కూడా మీరు చాలా యాక్టివ్‌గా ఉంటున్నారు.. మీ ఆరోగ్య రహస్యం చెప్పండని ఓ మహిళ అడిగారు. సీఎం స్పందిస్తూ.. 'నేను ఎప్పుడు పడుకున్నా రెండు నిమిషాల్లో నిద్రపోతా, అలారం మోగగానే నిద్ర లేస్తా, పగలంతా కష్టపడతాను కాబట్టి అలా నిద్ర వస్తుంది. (వేలి ఉంగరాన్ని చూపుతూ) ఇందులో రహస్యం ఉంది. ఈ ఉంగరం తెల్లవారుజామున సిగ్నల్స్ ఇస్తుంది. సరిపడా నిద్ర పోయానా లేదా.. అది కూడా మగతగా పోయానా సంతృప్తిగా పోయానా.. ఇంకాసేపు పడుకోవలసిన అవసరం ఉందా అనే అంశాలపై సూచనలు చేస్తుంది. తదనుగుణంగా నిద్ర విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటాను' అని తెలిపారు.

అంతో ఇంతో బేరం చేయాలి కదా..!

ఆయా శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సీఎం సందర్శించారు. చేనేత వస్త్రాల స్టాల్ వద్ద మహిళలను అడిగి పలు రకాల చీరల నేతల గురించి తెలుసుకున్నారు. ఐదారింటిని పరిశీలించి తన సతీమణి భువనేశ్వరి కోసం రూ.25 వేల ఖరీదైన చీర కొన్నారు. అంతో ఇంతో బేరం చేయాలి కదా అంటూ వారు చెప్పిన ధరలో వంద తగ్గించి చెక్కు ఇవ్వండని తన సిబ్బందితో సరదాగా అన్నారు.




చేనేత వస్త్రాల స్టాల్ వద్ద తన సతీమణి భువనేశ్వరికి చీర కొన్న సీఎం చంద్రబాబు



శక్తి టీమ్‌లను ప్రారంభిస్తున్న సీఎం, పక్కన డీజీపీ హరీశ్‌గుప్తా, ఎమ్మెల్యే కందుల

లోకం తీరు



ఎమ్మెల్యే పనితీరు మెరుగుపడాలి

రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేల పనితీరుపై ఎప్పటికప్పుడు సమీక్ష చేసి ఒక అంచనాకు వస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. ఉదాహరణకు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పనితీరు మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. 'ఈ నియోజకవర్గంలో 7.32 శాతం మెజారిటీతో గెలుపొందాం., కానీ అది 15 శాతానికి పెరిగితే శాశ్వతంగా గెలుస్తాం. అందుకనుగుణంగా ఇక్కడి ఎమ్మెల్యే, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలి. పార్టీ సభ్యత్వ నమోదులో మార్కాపురం 104 స్థానంలో ఉంది. పేదల సేవా కార్యక్రమాలు ఎనిమిది అమలుచేస్తుండగా అందులో మూడింటిలో ఎమ్మెల్యే బాగా పాల్గొంటున్నారు. పనితీరు ఇంకా మెరుగుపరచుకోవాలి. ప్రభుత్వం గురించి, చేసే మంచి పనుల గురించి ప్రజలకు వివరించడంలో ఆయన వెనుకబడ్డారు. ఎమ్మెల్యే ఏ స్థాయిలో ఉన్నారో ఇప్పుడు చెప్పను. అవసరమైనప్పుడు చిట్టా విప్పుతా' అని చెప్పారు. కాగా కార్యకర్తల సమావేశానికి సీఎం రాగానే ఏదో చెప్పేందుకు ఒక కార్యకర్త లేచాడు. 'ఇక్కడ మీకేం పని! ప్రతి చోటా నా మీటింగ్‌కు వచ్చి అనవసర రాద్ధాంతం చేస్తున్నారు.. మీ నియోజకవర్గం కాకుండా మరో చోటకు రాకూడదు' అని చంద్రబాబు సుతిమెత్తగా మందలించి బయటకు పంపారు.



మండిన రాయలసీమ

కర్నూలులో 39.4 డిగ్రీలు నమోదు

విశాఖపట్నం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): రాయలసీమలో శనివారం తీవ్రమైన వేడి వాతావరణం కొనసాగింది. పలుచోట్ల వడగాడ్పులు వీచాయి. గాలిలో తేమ శాతం 30 కంటే తక్కువకు పడిపోయింది. అత్యధికంగా కర్నూలులో 39.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అయితే కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదు కావడంతో రాత్రిపూట చలి పెరిగింది. రానున్న రెండు రోజుల్లో కోస్తా, రాయలసీమల్లో ఎండ తీవ్రత కొనసాగి పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతాయని వాతావరణ శాఖ తెలిపింది.

ఎమ్మెల్సీగా ఎవరెవరో!

(మొదటి పేజీ తరువాయి)

ఐదు స్థానాల్లో ఒకదాన్ని జనసేన నాయకుడు నాగబాబుకు కేటాయించడం, ఆయన నామినేషన్ దాఖలు చేయడం కూడా జరిగిపోయింది. మిగిలిన నాలుగు స్థానాలను టీడీపీ అభ్యర్థులకే కేటాయించనున్నారు. ప్రస్తుతం ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానాల్లో నలుగురు బీసీ, ఒక కాపు సామాజిక వర్గం నేతలు ఉన్నారు. ఒక స్థానాన్ని జనసేన కోటాలో కాపు సామాజికవర్గం ద్వారా భర్తీ చేస్తున్నారు. మిగిలిన నాలుగు స్థానాల్లో ఈసారి బీసీ, ఎస్సీలకు ప్రాధాన్యం ఇవ్వాలని టీడీపీ అధిష్ఠానం భావిస్తోంది. ఎమ్మెల్సీ సీట్ల ఖరారులో సీనియర్లకు ప్రాధాన్యం ఇస్తారా లేక జూనియర్లను ప్రోత్సహిస్తారా అన్న చర్చ టీడీపీలో జరుగుతోంది. మంత్రివర్గ కూర్పులో అధికశాతం జూనియర్లకు అవకాశం కల్పించారు. మండలిలో 2027 వరకు వైసీపీ ఆధిపత్యం కొనసాగనున్న నేపథ్యంలో సీనియర్లకు, బలంగా గళం వినిపించే వారికి అవకాశం ఇవ్వాలని పార్టీ పెద్దలు యోచిస్తున్నారు. వీరిలోనూ ప్రాంతాలు, సామాజికవర్గాల వారీగా కసరత్తు చేసి అభ్యర్థులను ఖరారు చేయనున్నారు.

ఎందరో ఆశావహులు...

అభ్యర్థుల ఎంపికలో సీనియర్లకు అవకాశం ఇస్తే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ నిర్ణయం మేరకు తమ సీట్లను త్యాగం చేసిన వారికి తొలి ప్రాధాన్యం ఉంటుందని భావిస్తున్నారు. అలాంటి వారిలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ ముందుంటారు. పిఠాపురంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ కోసం వర్మ తన సీటును త్యాగం చేశారు. ప్రస్తుతం పవన్ సోదరుడు నాగబాబు కూడా ఎమ్మెల్సీగా వెళుతున్న నేపథ్యంలో వర్మకు ఇవ్వకుంటే అది కేడర్‌కు తప్పుడు సంకేతాలను పంపుతుందన్న ప్రచారం ఉంది. దీంతో వర్మకు దాదాపు ఖాయమన్న ప్రచారం ఉంది. వర్మతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లు దక్కనివారిలో దేవినేని ఉమ, కొమ్మాలపాటి శ్రీధర్, ప్రభాకర్ చౌదరి వంటి వారు ఉన్నారు. ఇక బీసీ కోటాలో బుద్దా వెంకన్న, బీదా రవిచంద్ర, జంగా కృష్ణమూర్తి వంటి వారు రేసులో ఉన్నారు. వీరిలో జంగా కృష్ణమూర్తి ప్రస్తుతం టీటీడీ బోర్డు సభ్యుడిగా ఉన్నారు. బీసీల్లో గవర సామాజికవర్గానికి చెందిన వెంకన్న తనకు ఎమ్మెల్సీ ఇస్తే దాని ప్రభావం తమ సామాజికవర్గం ఎక్కువగా ఉన్న ఉత్తరాంధ్రతో పాటు రాజధాని ప్రాంతంలోని ఉమ్మడి కృష్ణా జిల్లాలోనూ ఉంటుందని పార్టీ పెద్దలకు చెబుతున్నారు. బీదా, జంగా యాదవ సామాజిక వర్గం కోటాలో పోటీ పడుతున్నారు. ప్రస్తుతం కేబినెట్‌లో ఈ సామాజికవర్గం నుంచి(టీడీపీ) పార్థసారథి ఉండగా, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావు ఉన్నారు. ఎస్సీ కోటాలో మాదిగ సామాజికవర్గం నుంచి కేఎస్ జవహర్, మాల సామాజికవర్గం నుంచి పరసా రత్నం, పీతల సుజాత రేసులో ఉన్నారు. పీతల సుజాతకు రాష్ట్ర వినియోగదారుల రక్షణ మండలి చైర్‌పర్సన్ పదవిని కట్టబెట్టారు. అయితే ఇలాంటి పోస్టు ఏదీ లేకపోవడంతో ప్రస్తుతం ఆమెకు ఏ పదవీ లేనట్టే. వీరితో పాటు లోకేశ్ టీమ్‌గా ప్రచారంలో ఉన్న మంతెన సత్యనారాయణ రాజు, కావలి గ్రీష్మ, మద్దిపట్ల సూర్యప్రకాశ్, బీవీ వెంకటరాముడు ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తున్నారు. అయితే ప్రస్తుతానికి వీరికి అవకాశం ఉండకపోవచ్చని సమాచారం. ఇక గొట్టిపాటి రామకృష్ణప్రసాద్, రెడ్డి సుబ్రమణ్యం, నాగుల్ మీరా వంటి వారు రేసులో ఉన్నారు. మైనారిటీ కోటాలో విశాఖకు చెందిన ఎండీ నజీర్ తన పేరు పరిశీలించాలని కోరుతున్నారు.

ఉన్నవి నాలుగే... 2027 వరకు ఆగండి

ఎమ్మెల్సీ ఆశావహులు భారీగా ఉన్నా ప్రస్తుతానికి కేవలం 4 స్థానాలే ఉన్నాయి. దీంతో అందరికీ న్యాయం చేయడం సాధ్యం కాదని, 2027 వరకు వేచి ఉండాలని పార్టీ అధిష్ఠానం నచ్చచెబుతోంది. 2027 నాటికి 23 ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతాయి. వీటిలో ఎమ్మెల్యే కోటాలో 7, స్థానిక సంస్థ కోటాలో 11 ఉండగా.. గవర్నర్ కోటాలో 5 స్థానాలు ఖాళీ కానున్నాయి. ఇందులో ఒకటి టీడీపీ, మరొకటి జనసేనది కాగా మిగిలిన సీట్లు వైసీపీవి. గవర్నర్ కోటాలో మొత్తం 8 ఎమ్మెల్సీ స్థానాలు ఉండగా ఇవన్నీ వైసీపీ ఖాతాలో ఉన్నాయి. వీరిలో కత్తి పద్మశ్రీ ఇప్పటికే రాజీనామా చేశారు. ఈ స్థానానికి 2029 వరకు గడువు ఉంది. 2026 జూలై నాటికి రెండు, 2027 జూన్‌లో మరో మూడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ సీట్లు ఖాళీ అవుతాయి. 2027 నాటికి ఎక్కువ సంఖ్యలో ఎమ్మెల్సీ సీట్లు అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో వీలైనంత ఎక్కువ మందికి న్యాయం చేసే అవకాశం ఉందని పార్టీ అధిష్ఠానం చెబుతోంది. ప్రస్తుతానికి సీనియర్లయిన బీసీ, ఎస్సీలకు ప్రాధాన్యం ఇచ్చి, 2027 నాటికి లోకేశ్ టీమ్‌కి అవకాశం ఇవ్వాలని పార్టీ పెద్దల యోచనగా ఉంది. ఏదేమైనా సోమవారంతో నామినేషన్లకు గడువు ముగియనుండటంతో ఎమ్మెల్సీ ఆశావహుల ఉత్కంఠకు ఆదివారం నాటితో తెర పడే అవకాశం ఉంది.



అమరావతి, శ్రీకాకుళంలో అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టులు!

నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం

అమరావతి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి, రాష్ట్ర సరిహద్దు జిల్లా శ్రీకాకుళంలో అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టులను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మిస్తే ప్రపంచస్థాయి సంస్థలు నేరుగా ఇక్కడికి చేరుకుని, పెట్టుబడులకు అనువైన ప్రాంతాలను ఎంపిక చేసుకునే వీలుంటుందని భావిస్తోంది. అమరావతిలోని సెక్రటేరియేట్‌లో సీఎంతో సమావేశమై పెట్టుబడుల ప్రతిపాదనలకు తక్షణం గ్రీన్‌సిగ్నల్ పొందేందుకూ అనువుగా ఉంటుందని యోచిస్తోంది. అలాగే భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి సమీపంలోనే శ్రీకాకుళం జిల్లాలో మరో ఎయిర్‌పోర్టు నిర్మించాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఆలోచనను కార్యరూపంలోకి తెచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ విమానాశ్రయ అభివృద్ధి సంస్థ (ఏపీఏడీసీఎల్) సాంకేతిక, ఆర్థిక అంశాల సాధ్యాసాధ్యాలపై నివేదిక (టీఈఎఫ్ఆర్)ను సమర్పించేందుకు నోటిఫికేషన్ జారీచేసింది. ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాల నిర్మాణానికి సంబంధించిన టీఈఎఫ్ఆర్‌ను వేసేందుకుగాను బిడ్లను పిలిచింది. బిడ్ల దాఖలుకు 32 వారాల గడువు ఇచ్చింది. విమానాశ్రయాల నిర్మాణానికి అనువైన ప్రదేశంతో పాటు ఆర్థికంగా వ్యాపారాభివృద్ధి అవకాశాలను గుర్తించాలని ఏపీఏడీసీఎల్ కోరింది. ఈ విమానాశ్రయాల సదుపాయాలను వినియోగించుకునే వారి సంఖ్య సమీప భవిష్యత్తులో ఏ మేరకు పెరుగుతుంది... వాణిజ్యం, సరుకు రవాణాకు అవకాశాలు ఎలా ఉంటాయో కూడా అంచనా వేయాలని కోరింది. రాష్ట్రంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంలో భాగంగా విమానాశ్రయ నిర్మాణాలను చేపట్టాలని సీఎం చంద్రబాబు యోచిస్తున్నారు. ఏప్రిల్ నుంచి రాజధాని నిర్మాణ పనుల్లో కీలకమైన అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం వంటి వాటిని నిర్మించడంతో పాటు దేశీయ, అంతర్జాతీయ విద్యా, వైద్య సంస్థలను స్థాపించేందుకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

'హైదరాబాద్' అనుభవంతో... గతంలో హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం జరగక ముందు ప్రపంచస్థాయి సంస్థలకు ఉమ్మడి రాష్ట్ర రాజధానిపై పెద్దగా అవగాహన ఉండేది కాదు. అందరూ చెన్నై విమానాశ్రయానికి వెళ్లేవారు. అక్కడి నుంచి రోడ్డు లేదా రైలు మార్గంలో హైదరాబాద్‌కు వచ్చేందుకు అంతగా ఆసక్తి చూపేవారు కాదు. హైదరాబాద్‌లో విమానాశ్రయ నిర్మాణం తర్వాత ప్రపంచ స్థాయి సంస్థలు వర్తక, వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించేందుకు అక్కడికి రావడం ప్రారంభించాయి. అమరావతికి సమీపంలోనే గన్నవరంలో విమానాశ్రయం ఉన్నా ఏపీ రాజధానికి దగ్గరలోనే ఉందని ప్రపంచానికి తెలియడం లేదు. ఈ అనుభవాల దృష్ట్యా అమరావతిలో అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మించాలని చంద్రబాబు భావిస్తున్నారు. అదేవిధంగా శ్రీకాకుళంలోనూ విమానాశ్రయ నిర్మాణం చేపట్టడం వల్ల కలిగే ప్రయోజనాలను అధ్యయనం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో సాంకేతిక, ఆర్థిక అంశాల సాధ్యాసాధ్యాలపై నివేదికను కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేసింది.

బెదురు లేకుండా మళ్లీ బొంకులు

- రౌడీ షీటర్ బోరుగడ్డ వీడియో విడుదల
- తెలంగాణలో ఉన్నట్టు పోలీసుల అనుమానం
- వైసీపీ నేతలు ఆశ్రయం ఇచ్చినట్టు సమాచారం

గుంటూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో అరాచకాలకు పాల్పడిన రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్... పోలీసులు తనకోసం గాలిస్తున్న విషయం తెలుసుకుని తాజాగా ఓ వీడియో విడుదల చేశాడు. గతంలో దందాలు, దౌర్జన్యాలు చేయడంతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌ను ఇష్టమొచ్చినట్టు దూషించిన కేసుల్లో అరెస్టయి ప్రస్తుతం మధ్యంతర బెయిల్‌పై అజ్ఞాతంలో ఉన్న సంగతి తెలిసిందే. హైకోర్టు నుంచి బెయిల్ పొడిగింపు కోసం ఫోర్జరీ మెడికల్ సర్టిఫికెట్ సమర్పించిన విషయాన్ని దాచి ఆ వీడియోలో మొసలి కన్నీరు కార్చాడు. తన తల్లి కోసమే బెయిల్‌పై వచ్చినట్లు చెప్పుకొచ్చాడు. రాజ్యాంగబద్ధంగానే తనకు బెయిల్ వచ్చిందన్నాడు. తనకు న్యాయవ్యవస్థపై గౌరవం ఉందని, ఈ విషయంలో ఎటువంటి తీర్పు ఇచ్చినా స్వాగతిస్తానని చెప్పుకొచ్చాడు. హైకోర్టుకు ఫోర్జరీ లెటర్ సమర్పించిన విషయాన్ని ప్రస్తావించకుండా ప్రజలను, మీడియాను, కోర్టులు, పోలీసులను సైతం తప్పుదారి పట్టించేలా వీడియో విడుదల చేశాడు. తన నైజాన్ని మరోసారి ప్రదర్శించి, కూటమి ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశాడు. తన హత్యకు కుట్ర జరుగుతోందంటూ ఆందోళన చెందుతున్నట్లు మాట్లాడాడు. తనకు గానీ, తన కుటుంబానికి గానీ హాని జరిగితే సీఎం, డిప్యూటీ సీఎం, లోకేశ్ బాధ్యత వహించాలన్నాడు. ఈ మొత్తం వ్యవహారాన్ని గమనిస్తున్న పోలీసులు బోరుగడ్డ వెనుక బలమైన శక్తులు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. జైలు నుంచి విడుదలయినప్పటి నుంచి బోరుగడ్డ ఎవరెవరిని కలిశాడు? అనే దానిపై ఆరా తీస్తున్నారు. సోషల్ మీడియాలో వైరల్ చేసిన వీడియోను ఎక్కడి నుంచి విడుదల చేశాడు? అనేదానిపై ఆధారాలు సేకరిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో టెక్నికల్ బృందం పూర్తిస్థాయిలో వివరాలు సేకరిస్తోంది. తాను తల్లితో చెన్నైలోనే ఉన్నట్లు బోరుగడ్డ చెప్పినప్పటికీ ఆయన తెలంగాణలో ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆయనకు వైసీపీ నాయకులు ఆశ్రయం ఇచ్చినట్లు కూడా పోలీసుల దృష్టికివచ్చింది. అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు బోరుగడ్డ అనిల్ బెయిల్ రద్దు పిటిషన్‌ను సోమవారం హైకోర్టులో దాఖలు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అనిల్ ఫోర్జరీ సర్టిఫికెట్ సృష్టించిన అంశానికి సంబంధించి గుంటూరు పోలీసులు పూర్తి ఆధారాలతో నివేదిక రూపొందించి అనంతపురం పోలీసులకు అందజేశారు.

సమాజ నిర్మాణ వాస్తుశిల్పి స్త్రీమూర్తి

డిప్యూటీ సీఎం పవన్, మంత్రుల మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

సమాజ నిర్మాణానికి నిజమైన వాస్తుశిల్పి స్త్రీమూర్తి అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కొనియాడారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శక్తిస్వరూపిణి అయిన ప్రతి స్త్రీమూర్తికి మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి 11.5 లక్షల మందికి దాదాపు రూ.4వేల కోట్ల ప్రయోజనాలు కలిగించే దిశగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. కాగా, మహిళా దినోత్సవం సందర్భంగా మంత్రి సత్యకుమార్ నారీశక్తికి శుభాకాంక్షలు తెలిపారు. విజయనగరం, బాపట్ల జిల్లాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రులు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కాగా, మహిళలకు మరింత విస్తృతంగా సూక్ష్మరుణాలు మంజూరు చేసి, వారి అభివృద్ధికి బాటలు వేయనున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. త్వరలో మహిళల కోసం కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రారంభించే ఆలోచనలో ఉన్నామన్నారు. కాగా, ప్రస్తుత కాలంలో సాంకేతికతకు అత్యధిక ప్రాధాన్యం ఉందని, ఇప్పుడు నడుస్తున్నదంతా వేగవంతమైన ఆవిష్కరణలు, మేథో సంపత్తి శకమని హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో శనివారం భారతదేశ ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తల సంఘం(ఎలీప్) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భువనేశ్వరిని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఘనంగా సత్కరించారు.



విజయవాడలో జరిగిన మహిళా పారిశ్రామికవేత్తల సదస్సులో నారా భువనేశ్వరిని సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి టీవీ యాజమాన్యం, జగనన్న కనెక్ట్స్ ఎక్స్ ఖాతాపై కేసు

- 'రంగన్న' మృతిపై తప్పుడు స్క్రోలింగ్

కడప క్రైం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి ప్రధాన సాక్షి వాచ్‌మన్ రంగన్న మూడు రోజుల క్రితం కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తన భర్త మృతిపై అనుమానం ఉందంటూ రంగన్న భార్య సుశీల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ పోలీసులు కొట్టడం వల్లనే రంగన్న చనిపోయాడంటూ పలుమార్లు సాక్షి చానెల్‌లో స్క్రోలింగ్ వేశారు. పోలీసు ప్రతిష్ఠ దిగజారేలా ఆ చానెల్ అసత్య ప్రచారం చేసిందంటూ కొంతమంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు సాక్షి చానెల్ యాజమాన్యంపై కేసు నమోదు చేసినట్లు చిన్నచౌకు పోలీసులు తెలిపారు. అలాగే 'జగనన్న కనెక్ట్స్' అనే ఎక్స్ ఖాతాపైనా పోలీసులు కేసు నమోదు చేశారు. రంగన్న చనిపోయిన రోజు 'వైఎస్ వివేకా హత్య కేసులో సాక్షిగా ఉన్న వాచ్‌మన్ రంగయ్య మృతికి పోలీసులే కారణం.. వైఎస్ వివేకా వాచ్‌మన్ రంగయ్య భార్య సంచలన వ్యాఖ్యలు' అంటూ సాక్షిలో వచ్చిన క్లిప్పింగ్‌ను ట్యాగ్ చేయడంతో పాటు 'వైఎస్ వివేకా హత్య కేసులో సాక్షిగా ఉన్న వాచ్‌మాన్ రంగయ్య మృతికి పోలీసులే కారణం. పోలీసులు రంగయ్య కీళ్లు విరగ్గొట్టారు. పోలీసుల వేధింపుల తోనే నా భర్త చనిపోయాడు- రంగయ్య భార్య సుశీలమ్మ' అంటూ జగనన్న కనెక్ట్స్ ఖాతా ద్వారా ఎక్స్‌లో పోస్టు చేశారు. దీనిపైనా చిన్నచౌకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పోసానికి రిమాండ్‌లో రిమాండ్

- 20 వరకు విధించిన బెజవాడ కోర్టు
- పీటీ వారెంట్‌పై హాజరుపరిచిన పోలీసులు
- అనంతరం కర్నూలు జైలుకు తరలింపు
- నరసరావుపేట పోలీసులూ పీటీ వారెంట్‌తో రాక
- బెజవాడలోనే ఉంచాలని కోర్టులో పోసాని విజ్ఞప్తి



పోసానిని కోర్టుకు తీసుకొస్తున్న పోలీసులు

విజయవాడ, నరసరావుపేట లీగల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉండగా టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేశ్, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లపై ఇష్టానుసారంగా నోరు పారేసుకున్న సినీ నటుడు పోసాని కృష్ణమురళికి.. రిమాండ్‌లో ఉండగానే మరో రిమాండ్ పడింది. జనసేన నేత బాడిత శంకర్ ఫిర్యాదు మేరకు విజయవాడలోని భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో పోసానిపై కేసు నమోదు చేశారు. ఇప్పటికే ఆయన అరెస్టయి కర్నూలు జిల్లా జైలులో ఉన్నందున భవానీపురం పోలీసులు పీటీ వారెంట్‌పై కర్నూలు జైలు నుంచి శనివారం విజయవాడకు తీసుకొచ్చారు. విజయవాడ చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో ఆయనను హాజరుపరచగా న్యాయాధికారి ఎస్.రాజశేఖర్ ఈ నెల 20వ తేదీ వరకు రిమాండ్ విధించారు. అనంతరం పోసానిని విజయవాడ నుంచి కర్నూలు జైలుకు తరలించారు.

నాకేమీ తెలియదు: పోసాని

రిమాండ్ విధించడానికి ముందు పోసానికి న్యాయాధికారి పలు ప్రశ్నలు వేశారు. 'మీపై నమోదైన కేసు గురించి తెలుసా' అని ప్రశ్నించగా, తనకేమీ తెలియదని, పోలీసులు ఎటువంటి కాగితాలూ ఇవ్వలేదని పోసాని తెలిపారు. తనకు గొంతు పక్షవాతం ఉందని, గుండెకు శస్త్రచికిత్స చేశారని చెప్పారు. తనకు శిక్ష విధించినా, విధించకపోయినా విజయవాడలోనే ఉంచాలని విజ్ఞప్తి చేశారు. తనపై పోలీసులు అన్యాయంగా కేసులు నమోదు చేశారని, ఎక్కడెక్కడో తిప్పుతున్నారని ఫిర్యాదు చేశారు. అయితే, పీటీ వారెంట్‌పై హాజరుపరిచినందున తానేమీ చేయలేనని న్యాయాధికారి పేర్కొన్నారు. ఏమైనా సమస్యలుంటే రెగ్యులర్ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు ఉంటే జైలులో వైద్యాధికారులకు చూపించుకోవాలన్నారు.

నరసరావుపేటలో పోలీస్ కస్టడీ వాయిదా..

పోసానిని నరసరావుపేట రెండో పట్టణ పోలీసులకు రెండు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ నరసరావుపేట మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ పోసాని అందుబాటులో లేకపోవడంతో పోలీస్ కస్టడీ తాత్కాలికంగా వాయిదా పడింది. నరసరావుపేట పోలీసులు శనివారం కర్నూలు జిల్లా జైలులో పీటీ వారెంట్ పత్రాలు సమర్పించగా, అప్పటికే విజయవాడ భవానీపురం పోలీసులు పోసానిని తీసుకెళ్లడంతో నరసరావుపేట పోలీసులు వెనుతిరిగారు. తిరిగి సోమవారం నరసరావుపేట పోలీసులు పోసానిని కస్టడీకి తెచ్చుకునేందుకు వెళ్లే అవకాశం ఉంది.

వైసీపీ 'సోషల్' కార్యకర్త అరెస్టు

- చిలకలూరిపేట పోలీసుల అదుపులోకి

చిలకలూరిపేట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గానికి చెందిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త దొడ్డా రాకేశ్ గాంధీని పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం చిలకలూరిపేట అర్బన్ పోలీసులు గుంటూరు వికాస్ నగర్‌లో అతడిని అదుపులోకి తీసుకుని తీసుకువచ్చారు. టీడీపీపైన, చిలకలూరిపేట టీడీపీ నాయకులపైన గతంలో సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టింగ్‌లు పెట్టినట్లు సమాచారం.



చంద్రబాబు టాస్క్‌మాస్టర్

తనలాగే అందరూ వేగంగా పనిచేయాలనుకుంటారు: లోకేశ్

- మా రాష్ట్రానికి ఆయనే అడ్వాంటేజ్
- జగన్‌కు ప్రతిపక్ష హోదా ఇవ్వలేం
- 'ఇండియా టుడే' కాంక్లేవ్‌లో మంత్రి లోకేశ్

న్యూఢిల్లీ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కర్ణాటకకు బెంగళూరు, తమిళనాడుకు చెన్నై, తెలంగాణకు హైదరాబాద్ అడ్వాంటేజ్‌గా ఉంటే.. ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు ఉన్నారని మంత్రి లోకేశ్ అన్నారు. ముఖ్యమంత్రిని తమకు టాస్క్‌మాస్టర్‌గా అభివర్ణించారు. అందరూ తనలాగే వేగంతో పనిచేయాలని ఆశిస్తుంటారని తెలిపారు. అసెంబ్లీ నిబంధనలను కాదని వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు ప్రతిపక్ష హోదా ఇవ్వలేమని తేల్చిచెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఢిల్లీలో శనివారం ఇండియా టుడే నిర్వహించిన కాంక్లేవ్‌లో ఆయన పాల్గొన్నారు. సీనియర్ జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దేశాయ్ అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. 'జగన్ వైసీపీ నాయకుడు. శాసనసభలో ప్రతిపక్ష హోదా ఉండాలంటే మొత్తం సభ సంఖ్యాబలంలో పదిశాతం ఉండాలని నిబంధనలు చెబుతున్నాయి. వాటిని కాదని ఆయనకు ప్రతిపక్ష హోదా ఇవ్వలేం' అని స్పష్టంచేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తనపైనే అక్రమంగా 23 కేసులు నమోదు చేశారని.. ఎస్సీఎస్టీ అట్రాసిటీతోపాటు హత్యాయత్నం కేసులు సైతం పెట్టారని తెలిపారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు రాష్ట్రంలో ఎవరికీ నిరసన తెలిపేందుకు అవకాశం లేదని, తమ ఇంటికే తాళ్లు కట్టారని చెప్పారు. ఇప్పుడు జగన్ ఎక్కడికైనా స్వేచ్ఛగా వెళ్తున్నారని అన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కంటే ఆయనకే అధిక భద్రత ఉందని చెప్పారు. 'వైసీపీ పాలనలో పెద్ద ఎత్తున మద్యం అక్రమాలు, విచ్చలవిడిగా ఇసుక అక్రమ తవ్వకాలు జరిగాయి. ఇసుక అక్రమ తవ్వకాలపై సుప్రీంకోర్టులో కేసునడుస్తోంది' అని గుర్తుచేశారు. తమిళనాట భాషా యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో.. కేంద్రం ఏ భాషనూ రాష్ట్రాలపై రుద్దదని స్పష్టం చేశారు. 'వాస్తవానికి నేను కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసినప్పుడు.. తెలుగుకు ప్రాధాన్యమివ్వాలని నొక్కిచెప్పారు. మూడు భాషలే కాదు.. మన పిల్లలు జర్మన్, జపనీస్ కూడా నేర్చుకోవాలి. భవిష్యత్‌లో మన వాళ్లకు అటువైపే ఉద్యోగాలు రానున్నాయి. భారత్ వ్యూహాత్మక పాత్ర పోషిస్తున్నందున.. బహుళ భాషలు నేర్వాలి. ఏ భాష నేర్చుకోవాలనుకుంటున్నారో ఎంచుకునే అవకాశాన్ని పిల్లలకే ఇవ్వాలి' అని తేల్చిచెప్పారు. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాదికి అన్యాయం జరుగుతుందన్న ఆందోళనతో తాను ఏకీభవిస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. జనాభాను నియంత్రించడం దక్షిణ రాష్ట్రాలకు ప్రతికూలం కాకూడదన్నారు. అయితే ప్రస్తుత నిష్పత్తులు కొనసాగుతాయని కేంద్రం తేల్చిచెప్పిందని గుర్తుచేశారు. కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికలు ఉన్నందున దీనిని ప్రచారాస్త్రం చేశారని.. అందుచేత ఇందులోకి ఆంధ్రప్రదేశ్ చొరబడాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు.

నైపుణ్యగణన సవాల్..

నైపుణ్య గణన కంటే కుల గణన చాలా సులభమని లోకేశ్ అన్నారు. రాష్ట్రంలో నైపుణ్య గణనను సవాల్‌గా తీసుకుని పనిచేస్తున్నామని చెప్పారు. విశాఖలోనే డేటా సెంటర్ ఏర్పాటు చేస్తామని, ఆ విషయంలో మరో ఆలోచనే లేదన్నారు. వై2కే విప్లవంలో హైదరాబాద్, దేశం లబ్ధి పొందితే.. ఇప్పుడు ఏపీ వంతని చెప్పారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఉన్నాయని.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో ముందుకు వెళుతున్నామని తెలిపారు. యువగళం పాదయాత్ర ద్వారా చాలా నేర్చుకున్నానని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, కష్టాలను స్వయంగా తెలుసుకుని పరిపూర్ణత సాధించానని తెలిపారు. ఎంబీఏ చదవడం బిజినెస్‌కు మంచిదని, రాజకీయాలకు మాత్రం పాదయాత్ర ముఖ్యమని, అది రాజకీయాల్లో ఎంబీయే వంటిదన్నారు. 'ప్రజలతో మమేకం కావడం, సమస్యలను దగ్గరగా చూడడం, లోతుగా అర్థం చేసుకోవడం వంటివన్నీ దానిద్వారానే నేర్చుకున్నాను. వాట్సాప్ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయాలనే ఆలోచన పాదయాత్రలోనే వచ్చింది. ఈ నెలాఖరు నాటికి 350 సేవలను మనమిత్ర ద్వారా అందిస్తాం. ఇది ప్రారంభం మాత్రమే. భవిష్యత్‌లో మరిన్ని సేవలు అందుబాటులోకి తెస్తాం. ఆంధ్రప్రదేశ్ ఐటీ నుంచి ఏఐకి మారుతోంది' అని తెలిపారు.

సామాన్య కార్యకర్తనే..

తనను తాను మూడో తరం రాజకీయ నాయకుడిగా ఎప్పుడూ భావించలేదని లోకేశ్ చెప్పారు. తానొక టీడీపీ కార్యకర్తగానే భావిస్తానన్నారు. సీఎం చంద్రబాబుకు కొడుకును కావడం వల్ల పదిరెట్లు ఎక్కువ కష్టపడాల్సి వస్తోందని.. ఆయన ప్రతిరోజూ తనను గమనిస్తూనే ఉంటారని తెలిపారు. 1985 నుంచి టీడీపీ గెలవని మంగళగిరి నుంచి పోటీచేసి 2019 ఎన్నికల్లో ఓటమి చవిచూశానని తెలిపారు. 2024 ఎన్నికల్లో పోరాడి 91వేల భారీ మెజారిటీతో గెలిచానని చెప్పారు. కష్టమైన మానవ వనరుల అభివృద్ధి శాఖను ఎంచుకున్నానన్నారు. తన భార్య బ్రాహ్మణి తన క్రెడిట్ కార్డు బిల్లు కడుతుందని చెప్పారు. మహిళా దినోత్సవం ఈ ఒక్క రోజు మాత్రమే కాదని, ప్రతిరోజూ జరుపుకోవాలని లోకేశ్ ఆకాంక్షించారు.

జూన్‌లో మునిసిపల్ ఎన్నికలు

- మేలోపు కోర్టు లిటిగేషన్లు పరిష్కరిస్తాం
- మూడేళ్లలో ప్రపంచ స్థాయి రాజధాని నిర్మిస్తాం
- టీడీఆర్ బాండ్ పెద్ద స్కామ్: మంత్రి పి.నారాయణ



కాకినాడలో మహిళా ర్యాపిడో రైడర్లతో కలిసి ఎలక్ట్రిక్ బైక్ నడుపుతున్న మంత్రి నారాయణ

రాజమహేంద్రవరం, కాకినాడ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మునిసిపాలిటీల పరిధిలో ఉన్న కోర్టు లిటిగేషన్లను పరిష్కరించి జూన్‌లో ఎన్నికలకు వెళతామని మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. రాష్ట్రంలోని 21 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగాల్సి ఉందన్నారు. కోర్టు కేసులు పరిష్కారమయ్యాక స్థానిక ఎమ్మెల్యేలు, అధికారులు, రాజకీయ నాయకులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం కాకినాడలో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల ద్వారా 26 మంది మహిళలకు మంత్రి ఎలక్ట్రిక్ స్కూటర్లను అందజేశారు. ఆ స్కూటర్‌లను రాపిడోకు అనుసంధానం చేశారు. ఈ సందర్భంగా ర్యాపిడో రైడర్లతో కలిసి మంత్రి స్కూటీ నడిపారు. అనంతరం కాకినాడలోనూ, రాజమహేంద్రవరంలోనూ ఆయన విలేకరులతో మాట్లాడారు. అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.64వేల కోట్లతో టెండర్లు పిలిచామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వల్ల పనులు ఆలస్యమయ్యాయని, కోడ్ ముగిసినందున ఈ నెల 12, 15 తేదీల మధ్య పనులు వేగవంతం చేస్తామన్నారు. మూడేళ్లలో ప్రపంచంలోనే టాప్ రాజధానిగా అమరావతిని నిర్మిస్తామని చెప్పారు. ఏప్రిల్ 1నుంచి మునిసిపాలిటీల్లో వసూలుచేసే పన్నుల సొమ్మును ఆయా మునిసిపాలిటీల్లో అవసరాలకే వినియోగించుకోవచ్చన్నారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత రాజమహేంద్రవరం ప్రజాప్రతినిధులతో సమీక్షించి గోదావరి పుష్కరాలకు ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. వైసీపీ అరాచకాలతో ఇబ్బంది పడిన టిడ్కో లబ్ధిదారులు వడ్డీ రద్దుచేయాలని కోరుతున్నారని, సీఎం దృష్టికి తీసుకెళ్లి రెండువారాల్లో నిర్ణయం తీసుకుంటామన్నారు. వైసీపీ హయాంలో రూ.85లక్షల టన్నుల చెత్త పోగుచేసి పోయారని, తొలగింపునకు టెండర్లు పిలిచామని చెప్పారు. అమరావతిలో 6,500 ఎకరాల భూమిని మినహాయించినట్టు జగన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అందులో 2వేల ఎకరాలు కేంద్ర సంస్థల నిర్మాణం కోసం, మిగతా వాటిలో రోడ్లు, డ్రెయిన్లు, సీవరేజి ప్లాంట్లు, ఇతర మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తామన్నారు. స్వచ్ఛ ఏపీలో భాగంగా మునిసిపల్ చెత్త నుంచి విద్యుత్ తయారుచేసే ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

టీడీఆర్ బాండ్.. వెయ్యి కోట్ల స్కామ్

టీడీఆర్ బాండ్ పెద్ద స్కామ్ అని మంత్రి పి.నారాయణ అన్నారు. ఇది గత ప్రభుత్వం చేసిన భారీ స్కామ్ అని, దాదాపు వెయ్యి కోట్లపైనే ఈ స్కామ్ జరిగిందని చెప్పారు. దానిపై విజిలెన్స్, ఏసీబీ విచారణ జరుగుతోందని, రిపోర్టు వచ్చాక ఏ విధంగా ముందుకు వెళ్లాలని నిర్ణయం తీసుకుంటామన్నారు. నగరాలు, పట్టణాల్లో చెత్త పేరుకుపోవడానికి గత వైసీపీ ప్రభుత్వమే కారణమని విమర్శించారు. డబ్బులు చెల్లించకపోవడంతో చెత్త వాహనాలను నిలిపివేశారని, దీంతో రాష్ట్రవ్యాప్తంగా 85 లక్షల టన్నుల చెత్త పేరుకుపోయిందని తెలిపారు. వారికి ప్రత్యామ్నాయంగా కాంపెక్టర్స్ కొనుగోలు చేయనున్నామని మంత్రి తెలిపారు. మరో మూడు నెలల్లో చెత్త సమస్యకు పూర్తి పరిష్కారం లభించనుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో విశాఖపట్నం, గుంటూరుల్లో మునిసిపల్ చెత్త నుంచి విద్యుత్ తయారు ప్లాంట్లు ఏర్పాటు చేశామని, తర్వాత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మిగతా జిల్లాల్లో ప్రాజెక్టులు నిలిచిపోయాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం మళ్లీ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుకు శ్రీకారం చుడుతోందన్నారు. నెల్లూరు, కాకినాడ-రాజమండ్రి మధ్య స్థల పరిశీలన కూడా పూర్తయ్యిందని, రాయలసీమలోనూ 2 ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

రంగన్న మృతదేహానికి రీపోస్టుమార్టం

- అనుమానాల నేపథ్యంలో సిట్ ఏర్పాటు

కడప/పులివెందుల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ప్రత్యక్ష సాక్షి రంగన్న మృతదేహానికి శనివారం రీపోస్టుమార్టం నిర్వహించారు. ఉదయం పులివెందులలోని భాకరాపురం శ్మశాన వాటికలో మృతదేహాన్ని వెలికితీసి తిరుపతి నుంచి వచ్చిన ఫోరెన్సిక్ నిపుణులు, కడప రిమ్స్ మెడికల్ కళాశాల వైద్య నిపుణుల ఆధ్వర్యంలో 3-4 గంటల పాటు శవపరీక్ష చేశారు. శరీరంపై ఎక్కడైనా గాయాలున్నాయా అనే అంశాన్ని పరిశీలించారు మృతదేహం నుంచి తలవెంట్రుకలు, కాలి, చేతి గోళ్లు, మరికొన్ని అవయవాలను సేకరించి, ప్రత్యేక బాక్స్‌లో ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. రీపోస్టుమార్టం సమయంలో రంగన్న భార్య సుశీల, కుమారుడిని అక్కడకు తీసుకెళ్లారు. వారి అనుమతితోనే శవపరీక్ష నిర్వహించారు. రంగన్న కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందిన విషయం తెలిసిందే. రంగన్న భార్య సుశీల ఫిర్యాదు మేరకు పులివెందుల అర్బన్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసుగా నమోదు చేశారు.

మృతిపై దర్యాప్తునకు సిట్ ... వివేకా హత్య కేసులో సాక్షులు, అనుమానితులు ఒక్కొక్కరు చనిపోతుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాచ్‌మన్ రంగన్న మృతిపై విచారణకు కడప ఎస్పీ అశోక్‌కుమార్ ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. పులివెందుల డీఎస్పీ మురళీనాయక్, జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆర్కే వ్యాలీ సీఐ ఉలసయ్య, పులివెందుల అర్బన్ సీఐ నరసింహులు, కడప సైబర్ క్రైం సీఐ మధుమల్లేశ్వర్‌రెడ్డి, మరో ముగ్గురు ఎస్ఐలతో సిట్ ఏర్పాటైంది. ఇదిలా ఉండగా ఉదయం 8 గంటల ప్రాంతంలో కడప నుంచి ఐదుగురితో కూడిన ప్రత్యేక క్లూస్ టీం రంగన్న ఇంటికి చేరుకుంది. గంటకు పైగా ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించింది. మంచం, మందులు, ఆసుపత్రి రిపోర్టులు, పరుపును పరిశీలించి.. పలు వస్తువులను స్వాధీనం చేసుకుంది.

వివేకా హత్య కేసు సాక్షుల మృతిపై అనుమానాలు

- ఆరుగురి మరణంపై దర్యాప్తు చేయాలి: మంత్రి నాదెండ్ల

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 8(ఆంధ్రజ్యోతి): వివేకా హత్య కేసులో వరుసగా జరుగుతున్న సాక్షుల మరణాలపై చాలా అనుమానాలు ఉన్నాయని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. పిఠాపురం మండలం చిత్రాడలో జరగనున్న జనసేన ఆవిర్భావ దినోత్సవ సభ ఏర్పాట్ల పరిశీలన నిమిత్తం ఆయన శనివారం కాకినాడ వచ్చారు. అక్కడ మీడియాతో మాట్లాడుతూ వివేకా హత్య కేసులో మూడేళ్ల వ్యవధిలో ఆరుగురు సాక్షులు ఎలా మృతిచెందారని ప్రశ్నించారు. దీనిపై లోతుగా దర్యాప్తు చేసి, ఈ మరణాల వెనుక ఎవరు ఉన్నారో కనిపెట్టాలని వ్యాఖ్యానించారు.



రంగన్న మృతదేహం నుంచి సేకరించిన అవయవాలు భద్రపరిచిన బాక్సును తీసుకెళుతున్న పోలీసు

వరుస మరణాలు

- వివేకా హత్య కేసులో అనుమానితుడైన సింహాద్రిపురం మండలం కసూమూరుకు చెందిన శ్రీనివాసులరెడ్డి 2019 సెప్టెంబరు 29న ఆత్మహత్య చేసుకున్నాడు.
- జగన్ మామ ఈసీ గంగిరెడ్డి 2020 అక్టోబరు 3న అనారోగ్యంతో చనిపోయారు.
- ఈ కేసులో మరో కీలకసాక్షి గంగాధర్‌రెడ్డి 2022 జూన్ 9న తన ఇంట్లో నిద్రలోనే మృతిచెందారు.
- ఇక వైఎస్ అభిషేక్‌రెడ్డి ఈ ఏడాది జనవరి 10న మృతిచెందారు. వివేకాది హత్యే అని ఈయన సీబీఐకి వాంగ్మూలం ఇచ్చారు.
- జగన్ డ్రైవర్ నారాయణయాదవ్ 2019 డిసెంబరు 6న అనారోగ్యంతో మృతిచెందారు. వివేకా హత్యకు గురైనప్పుడు జగన్ దంపతులు రోడ్డుమార్గాన హైదరాబాదు నుంచి పులివెందులకు కారులో వచ్చారు. అప్పుడు ఈయనే డ్రైవరు. జగన్ సీఎం అయిన ఆర్నెల్లకే ఇతను చనిపోవడం గమనార్హం.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

• ఆర్కే RK



కొత్తపలుకు

కూటమికి 'పట్టం'.. ఐక్యత 'భద్రం'!

అధ్యాపకులు, పట్టభద్రుల నియోజకవర్గాలకు ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన ఎన్నికల్లో ఓటర్లు అధికార, ప్రతిపక్షాలకు తమదైన రీతిలో సంకేతాలు ఇచ్చారు. తెలంగాణలో ఓటర్ల తీర్పు ప్రతిపక్షానికి బలం చేకూర్చగా... ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ప్రతిపక్షం తన పద్ధతులు మార్చుకోని పక్షంలో మనుగడే కష్టమన్న హెచ్చరికలు జారీ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో ఏపీలో అధికార ఎన్డీయే కూటమికి వెయ్యి ఏనుగుల బలం చేకూరింది. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎనిమిది నెలలకు జరిగిన ఎన్నికల్లో పట్టభద్రుల నియోజకవర్గాలు రెండింటిలోనూ తెలుగుదేశం పార్టీ పోటీకి పెట్టిన అభ్యర్థులకు 65 శాతం ఓట్లు రావడం విశేషం. ఈ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ పోటీ చేయకపోయినా, సీపీఎంతో సంబంధాలున్న అభ్యర్థులను పరోక్షంగా బలపరిచింది. వైసీపీ స్వయంగా పోటీ చేసినా ఫలితాల్లో తేడా ఉండేది కాదు. మహా అయితే కూటమికి లభించిన ఓట్ల శాతం కొంత తగ్గేదేమో! అయితే, రాష్ట్ర ప్రజల మూడ్‌ను గమనించి అందుకు అనుగుణంగా

> ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై జగన్‌రెడ్డి అనవసరంగా నోరు పారేసుకుంటున్నారు. తాజాగా విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ, పవన్ కల్యాణ్ కార్పొరేటర్‌కు ఎక్కువ–ఎమ్మెల్యేకు తక్కువ అని కించపరిచారు. ఇప్పుడు ఆయనను అవమానించడం అవసరమా? అంటే జగన్‌కు ఎవరు చెప్పాలి? ఒక్కోసారి మన కళ్లే మనల్ని మోసం చేస్తాయని అంటారు. జగన్‌రెడ్డి కూడా తన చుట్టూ ఉన్న వాళ్లు తనకు నిజం చెబుతున్నారా? లేదా? తాను కళ్లు చెవులుగా భావించే రోత మీడియా తనను సరైన మార్గంలో నడిపిస్తున్నదా? లేక తప్పుదారి పట్టిస్తున్నదా? అన్నది స్థిమితంగా ఆలోచించుకోవడం మంచిది. పవన్ కల్యాణ్‌ను అవమానించడం అంటే కూటమి ఐక్యతను పటిష్ఠం చేయడమే అన్న చిన్న లాజిక్‌ను కూడా జగన్‌రెడ్డి విస్మరిస్తే ఎలా? నేను ఇంద్రుడిని, చంద్రుడిని అని జగన్‌రెడ్డి భావిస్తారు. ఆయన చుట్టూ ఉండేవాళ్లు కూడా, 'అన్నా నువ్వు పులివి, సింహానివి' అని రెచ్చగొడతారు. అలాంటి వారికి నిజాలు కనిపించవు. మంచి మాటలు చెవికెక్కవు. ప్రస్తుతానికి జగన్‌రెడ్డి పరిస్థితి గాల్లో దీపంలా ఉంది. ఆ దీపం ఎంత కాలం వెలుగుతుందో?

తమను తాము సంస్కరించుకొనే బదులు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆత్మవంచన చేసుకుంటూ ఆనందం పొందడం ఆశ్చర్యంగా ఉంది. ఎన్నికల ఫలితాలు వెల్లడవుతున్న సమయంలో వైసీపీ నాయకులు చేసిన ప్రకటనలు, జగన్ రోత మీడియాలో చేసిన ప్రచారమే ఇందుకు నిదర్శనం. ఉత్తరాంధ్రలో అధ్యాపకుల నియోజకవర్గంలో పోటీలో ఉన్న ఇద్దరు అభ్యర్థులలో ఎవరికి మద్దతు ప్రకటించాలో తేల్చుకోలేక పోయిన కూటమి, ఆ ఇద్దరిలో ఎవరో ఒకరికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి రెండో అభ్యర్థికి ద్వితీయ ప్రాధాన్య ఓటు వేయాలని సూచించింది. సీపీఎంకు అనుబంధంగా ఉండే యూటీఎఫ్ తరఫున పోటీచేసిన మరో అభ్యర్థిని వైసీపీ పరోక్షంగా బలపరిచింది. ఈ నేపథ్యంలో కూటమి మద్దతు పొందిన గాదె శ్రీనివాసులు నాయుడు, వర్మ మధ్యనే పోటీ జరిగింది. శ్రీనివాసులు నాయుడు విజేతగా నిలవగా, వర్మ ద్వితీయ స్థానంలో నిలిచారు. అయినప్పటికీ, 'కూటమికి ఓటమి' అని రోత మీడియా ప్రచారం చేయడం ద్వారా ఆత్మవంచన చేసుకుంది. మరోవైపు ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని రెండు పట్టభద్రుల నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ తరఫున అధికారికంగా పోటీచేసిన అభ్యర్థులు ఇరువురూ భారీ మెజారిటీతో గెలిచినా రోత మీడియా విస్మరించింది. తెలుగుదేశం అభ్యర్థులు విజయం సాధించారని చెప్పడం ఇష్టం లేక ఫలానా వారు గెలిచారని వారి పేర్లు మాత్రమే ప్రసారం చేశారు. ఇంతకంటే ఆత్మవంచన ఇంకొకటి ఉంటుందా? మీడియా దాచినంత మాత్రాన ఫలితాలు తారుమారవుతాయా? ప్రజల తీర్పు మారిపోతుందా? అల్పబుద్ధులు బయటపడతాయి అంతే! క్షేత్ర స్థాయి పరిస్థితులను సమీక్షించుకొని దిద్దుబాటు చర్యలు తీసుకోవడానికి రాజకీయ పార్టీలు ఎన్నికల ఫలితాలను దిక్సూచిగా భావిస్తాయి. కానీ, వైసీపీ రూటే సెపరేటు! మాకు చూపు ఎలాగూ లేదు– అవతలి వాడికి కూడా ఒక కన్ను పోయింది అని ఆనందించినట్టుగా ఉత్తరాంధ్ర ఫలితాన్ని వక్రీకరించి ఆనందం పొందింది. సీన్ కట్ చేస్తే ఉత్తరాంధ్ర నుంచి నెగ్గిన గాదె శ్రీనివాసులు నాయుడు తన గెలుపు ప్రకటన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబును కలుసుకొని తాను కూటమి అభ్యర్థినేనని చెప్పుకొన్నారు. ఈ సన్నివేశం చూసిన తర్వాత వైసీపీ నాయకులుగానీ, జగన్ రోత మీడియాగానీ ముఖం ఎక్కడ పెట్టుకుందో తెలియదు. సొంత మీడియా ఏర్పాటు చేసుకున్నంత మాత్రాన, కూలి మీడియాను పెంచి పోషించినంత మాత్రాన ప్రజాభిప్రాయం మారదు అని మరోమారు రుజువైంది.

కామ్రేడ్ల కష్టాలు!

ఈ సందర్భంగా సీపీఎం గురించి కూడా చర్చించుకోవలసి ఉంది. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాకముందు, వచ్చిన తర్వాత, ఇప్పుడు ఓడిపోయిన తర్వాత కూడా సీపీఎం ఆయనతో పరోక్షంగా చేతులు కలుపుతూనే ఉంది. జగన్‌రెడ్డి వంటి వారితో చేతులు కలపడం వల్ల గతంలో ఆ పార్టీకి ఉండిన విశ్వసనీయతను ఇప్పుడు పూర్తిగా కోల్పోయింది. ఉభయ కమ్యూనిస్టు పార్టీలలో సీపీఎం అంటే అంతో ఇంతో నిక్కచ్చిగా, నిజాయితీగా ఉంటుందన్న అభిప్రాయం ఒకప్పుడు ఉండేది. ఇప్పుడు జగన్‌రెడ్డితో చేతులు కలపడానికి సీపీఐ ససేమిరా అంటూ ఉండగా, సీపీఎం మాత్రం ఎప్పటికప్పుడు ఉత్సాహం ప్రదర్శిస్తూ వచ్చింది. సీపీఐ కలిసి రానందున, వైసీపీతో నేరుగా పొత్తు పెట్టుకోలేక పోయినందున సీపీఎం రహస్య అవగాహనతో నడిచింది. జగన్ అధికారంలో ఉన్నంత కాలం ఎన్ని అరాచకాలు జరిగినా సీపీఎం పెదవి విప్పలేదు. అటు ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా ఇటు తెలంగాణలో కూడా ఆ పార్టీ పోకడలను ప్రజలు హర్షించలేదు. దీంతో తెలుగునాట సీపీఎం తన ఉనికిని కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. దీని ప్రభావం తాజాగా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్పష్టమైంది. గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గాల నుంచి పోటీ చేసి ఓడిపోయిన లక్ష్మణరావుకు ప్రజల్లో కొంత విశ్వసనీయత ఉన్నప్పటికీ ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న సీపీఎం విశ్వసనీయత కోల్పోయినందున భారీ తేడాతో ఓడిపోయారు. ఆయనకు వైసీపీ పరోక్షంగా మద్దతు ఇవ్వడం శాపంగా మారిందన్న అభిప్రాయమూ ఉంది. రాష్ట్ర స్థాయిలోనే కాదు, జాతీయ స్థాయిలో కూడా సీపీఎం నాయకత్వం తీసుకుంటున్న అసంబద్ధ నిర్ణయాల వల్ల ఆ పార్టీ ఇప్పుడు కేరళకు మాత్రమే పరిమితమై ఒక ప్రాంతీయ పార్టీగా కుదించుకుపోయింది. కేరళలో కూడా ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ లేకపోతే ఆ పార్టీ పరిస్థితి ఏమిటో కూడా తెలియదు. తెలుగునాట సీపీఎంకు ఒకప్పుడు బలమైన నాయకులు ఉండేవారు. ప్రజల్లో వారికి విశ్వసనీయత ఉండేది. కానీ, ప్రస్తుత దుస్థితికి ప్రస్తుత నాయకులే ప్రధాన కారణం. నీవు ఎలాంటి వాడివో నీ చుట్టూ ఉండే స్నేహితులను బట్టి చెప్పవచ్చునని అంటారు. ఇప్పుడు జగన్‌రెడ్డితో రహస్య ప్రేమాయణం సాగిస్తున్నందున ఆ ప్రభావం సీపీఎం పైన పడింది. ఉత్తరాంధ్రలో ఉపాధ్యాయుల నియోజకవర్గం నుంచి పోటీ చేసిన యూటీఎఫ్ అభ్యర్థి గట్టి పోటీ కూడా ఇవ్వలేకపోయారంటేనే ఆ పార్టీ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో లక్ష్మణరావు వంటి వ్యక్తి కూడా పరాభవాన్ని మూటగట్టుకోవాల్సి వచ్చింది.



జగన్ ఇప్పుడేమంటారో..

సీపీఎం సంగతి అలా ఉంచి, జగన్మోహన్‌రెడ్డి విషయానికి వద్దాం! ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల తర్వాత కూడా వాస్తవాలను గుర్తించడానికి ఆయన సిద్ధంగా లేరని స్పష్టమవుతోంది. నిన్నటి దాకా ఈవీఎంల ద్వారా మోసం చేశారని అన్నారు. ఇప్పుడు బ్యాలెట్ ద్వారా జరిగిన ఎన్నికల్లో కూటమి తన మెజారిటీని పెంచుకుంది. ఇప్పుడేమి చెబుతారు? ఈ ఎన్నికల ఫలితాలతో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి బలంగా ఉందని రుజువైంది. కొన్ని విషయాల్లో తెలుగు తమ్ముళ్లు ఆవేశపడుతున్నప్పటికీ దాని ప్రభావం ప్రజల్లో లేదని ఈ ఎన్నికలతో స్పష్టమైంది. పట్టభద్రుల స్థానాలకు జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థులకు ఓటు ఎందుకు వేయాలి? అని కొంత మంది తెలుగు తమ్ముళ్లు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా ఓటర్లు పట్టించుకోలేదు. తెలుగుదేశం పార్టీకి 65 శాతం ఓట్లు లభించడమే ఇందుకు నిదర్శనం. ఈ నేపథ్యంలో జగన్‌రెడ్డి క్షేత్ర స్థాయిలో పరిస్థితిని సమీక్షించుకొని తదనుగుణంగా వ్యూహాలు రూపొందించుకోకుండా ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా తానే ముఖ్యమంత్రిని అవుతానని తన చుట్టూ ఉన్నవాళ్లు చెబుతున్న మాటలను నమ్ముతూ ఊహాలోకాల్లో విహరిస్తున్నారు. ప్రతిపక్ష హోదా ఇస్తే తప్ప శాసనసభలో అడుగుపెట్టనని మంకుపట్టు పట్టారు. 1994లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా లభించకపోయినా ఆ పార్టీ శాసనసభా పక్షం నాయకుడుగా పి.జనార్దన్‌రెడ్డి అలుపెరుగని పోరాటం చేశారు. నాటి ఆయన పోరాట ఫలితం కూడా 2004లో రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అవడానికి ఉపయోగపడింది. ఉమ్మడి రాష్ట్రంలో శాసనసభలో మంచి వక్తలుగా రాణించిన వెంకయ్యనాయుడు, జైపాల్‌రెడ్డి, ఓంకార్, గౌతు లచ్చన్న వంటి వారు ప్రధాన ప్రతిపక్ష నాయకులుగా హోదా పొందినవారు కారు. అంతెందుకు, అవమానాలు తప్పవని తెలిసినా 2019 తర్వాత చంద్రబాబు నాయుడు శాసనసభలో పోరాటం చేయలేదా? తనను తాను వీరుడుగా శూరుడుగా చెప్పుకొనే జగన్‌రెడ్డి శాసనసభను ఎదుర్కోవడానికి ఎందుకు వెనుకాడుతున్నారో తెలియదు. సింగడు అద్దంకి వెళ్లనూ వెళ్లాడు, రానూ వచ్చాడు అన్నట్టుగా గవర్నర్ ప్రసంగం రోజు మాత్రం కొద్ది నిమిషాల పాటు సభకు హాజరై ఆ తర్వాత ముఖం చాటేశారు. తెలంగాణలో తనకు గురుతుల్యుడైన కేసీఆర్ కూడా ఇప్పుడు శాసనసభకు హాజరు కావాలని నిర్ణయించుకున్నారు. ప్రభుత్వాలను నిలదీయడానికి ప్రతిపక్షంలో ఉన్న వారికి శాసనసభను మించిన వేదిక మరొకటి ఉండదు. తానెవరికీ తల వొంచనని చెప్పుకోవాలనే దుగ్ధ జగన్మోహన్‌రెడ్డిలో అధికంగా ఉంది. అందుకే శాసనసభకు వెళ్లి చంద్రబాబు ముఖం చూడ్డం ఆయన నామోషీగా భావిస్తున్నారేమో తెలియదు. నాయకులు ఎవరైనా తమ ఓటమికి కారణాలను గుర్తించి తనను తాను సంస్కరించుకున్నానని ప్రజలకు నమ్మకం కలిగించగలిగినప్పుడే భవిష్యత్తు ఉంటుంది. చంద్రబాబు కూడా 2019లో ఓడిపోయాక తాను మారతానని ప్రకటించి కార్యకర్తల్లో భరోసా నింపే ప్రయత్నం చేశారు. అసలు తాను ఓడిపోయానని కూడా అంగీకరించడానికి సిద్ధంగా లేని జగన్‌రెడ్డి తనను తాను సంస్కరించుకొనే ప్రయత్నం చేస్తారని ఆశించడం కూడా అత్యాశే అవుతుంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై ఆయన అనవసరంగా నోరు పారేసుకుంటున్నారు. తాజాగా విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ, పవన్ కల్యాణ్ కార్పొరేటర్‌కు ఎక్కువ–ఎమ్మెల్యేకు తక్కువ అని కించపరిచారు. ఇప్పుడు ఆయనను అవమానించడం అవసరమా? అంటే జగన్‌కు ఎవరు చెప్పాలి? ఒక్కోసారి మన కళ్లే మనల్ని మోసం చేస్తాయని అంటారు. జగన్‌రెడ్డి కూడా తన చుట్టూ ఉన్న వాళ్లు తనకు నిజం చెబుతున్నారా? లేదా? తాను కళ్లు చెవులుగా భావించే రోత మీడియా తనను సరైన మార్గంలో నడిపిస్తున్నదా? లేక తప్పుదారి పట్టిస్తున్నదా? అన్నది స్థిమితంగా ఆలోచించుకోవడం మంచిది. పవన్ కల్యాణ్‌ను అవమానించడం అంటే కూటమి ఐక్యతను పటిష్ఠం చేయడమే అన్న చిన్న లాజిక్‌ను కూడా జగన్‌రెడ్డి విస్మరిస్తే ఎలా? నేను ఇంద్రుడిని, చంద్రుడిని అని జగన్‌రెడ్డి భావిస్తారు. ఆయన చుట్టూ ఉండే వాళ్లు కూడా, 'అన్నా నువ్వు పులివి, సింహానివి' అని రెచ్చగొడతారు. అలాంటి వారికి నిజాలు కనిపించవు. మంచి మాటలు చెవికెక్కవు. ప్రస్తుతానికి జగన్‌రెడ్డి పరిస్థితి గాల్లో దీపంలా ఉంది. ఆ దీపం ఎంత కాలం వెలుగుతుందో వేచి చూద్దాం!

ఎమ్మెల్సీ ఎన్నికలు పంపిన సంకేతాలు!

తెలంగాణ విషయానికి వస్తే, రాష్ట్రంలో అధ్యాపకులు, పట్టభద్రుల నియోజకవర్గాలు రెండింటినీ భారతీయ జనతా పార్టీ గెలుచుకోవడం ద్వారా మూడు ప్రధాన రాజకీయ పార్టీలలో

> అధ్యాపకులు, పట్టభద్రుల నియోజకవర్గాలకు ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరిగిన ఎన్నికల్లో ఓటర్లు అధికార, ప్రతిపక్షాలకు తమదైన రీతిలో సంకేతాలు ఇచ్చారు. తెలంగాణలో ఓటర్ల తీర్పు ప్రతిపక్షానికి బలం చేకూర్చగా... ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ప్రతిపక్షం తన పద్ధతులు మార్చుకోని పక్షంలో మనుగడే కష్టమన్న హెచ్చరికలు జారీ చేశారు.

తనదే పైచేయి అని రుజువు చేసుకుంది. ప్రధాన ప్రతిపక్షమైన భారత రాష్ట్ర సమితి ఈ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండటంతో ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్యనే జరిగింది. అధికార కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల నియోజకవర్గంలోనే అధికారికంగా పోటీచేసింది. గత ఎన్నికల్లో గెలుచుకున్న ఈ స్థానాన్ని ఇప్పుడు కోల్పోవడం ఆ పార్టీకి దెబ్బ అనే చెప్పుకోవచ్చు. ఒకప్పుడు ఉత్తర తెలంగాణ భారత రాష్ట్ర సమితికి ఆయువుపట్టుగా ఉండేది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ పరాభవాన్ని మూటగట్టుకోగా బీజేపీ బలపడింది. ఇప్పుడు ఈ ఎన్నికల్లో ఆ పార్టీ తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది. తెలంగాణ ఉద్యమానికి అండగా ఉండిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అధ్యాపకుల నియోజకవర్గంలో కూడా బీజేపీ పాగా వేసింది. భారత రాష్ట్ర సమితి ఎన్నికలకు దూరంగా ఉండటం బీజేపీకి కలిసొచ్చింది. ముక్కోణపు పోటీ జరిగి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో చెప్పలేంగానీ, బీజేపీ తెలంగాణలో విస్తరిస్తోందన్న అభిప్రాయం ఈ ఎన్నికల ఫలితాలతో ధ్రువపడింది. అదే సమయంలో కాంగ్రెస్ బలహీనపడుతోందన్న అభిప్రాయానికి బలం చేకూరుతోంది. ఇదే ధోరణి కొనసాగితే వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి కాంగ్రెస్ పరిస్థితి ఏమిటన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఎన్నికలు ఎప్పుడు జరిగినా ప్రజలు తనకు బ్రహ్మరథం పట్టడానికి సిద్ధంగా ఉన్నారని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం నాడు చెప్పుకొన్నారు. అదే నిజమైతే పట్టభద్రుల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ మద్దతు పొందిన బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ ఓడిపోకూడదు. ఆయన మూడో స్థానానికే పరిమితమయ్యారు. దీంతో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న భారత రాష్ట్ర సమితి స్థానాన్ని భారతీయ జనతా పార్టీ ఆక్రమించబోతున్నదా? అన్న సందేహం సహజంగానే ఏర్పడుతుంది. ఆంధ్రప్రదేశ్‌తో పోల్చితే తెలంగాణలో బీజేపీ మొదటి నుంచి కొంత బలంగానే ఉంది. ఇటీవలి కాలంలో ఆ పార్టీ శాసనసభలో కూడా బలం పెంచుకుంది. దీంతో వచ్చే ఎన్నికల నాటికి రాజకీయ సమీకరణాలు ఎలా ఉండబోతున్నాయనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

తెలంగాణలోనూ 'కూటమి'!?

జాతీయ స్థాయిలో ఎన్డీయేను పటిష్ఠం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ భావిస్తున్నందున వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణలో కూడా ఎన్డీయే ప్రయోగం అమలు చేస్తారా? అన్న ప్రశ్న కొన్ని రోజులుగా వినిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి ఘన విజయం సాధించాయి. తెలుగుదేశం పార్టీకి సొంతంగా మెజారిటీ సమకూరినప్పటికీ ఎన్డీయే కూటమిగానే ముందుకెళుతున్నాయి. ఇదే ప్రయోగాన్ని తెలంగాణలో కూడా అమలు చేస్తే... అన్న చర్చ ఇప్పుడు ఆ మూడు పార్టీలలో నడుస్తోంది. తెలంగాణలో బీజేపీ సంస్థాగతంగా బలంగా ఉండగా, తెలుగుదేశం పార్టీ ఓట్ల పరంగా అంతో ఇంతో బలంగా ఉంది. జనసేనకు కూడా తెలంగాణలో కొన్ని ఓట్లు ఉన్నాయి. గత శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఎన్నికలకు దూరంగా ఉండటంతో అది కాంగ్రెస్ పార్టీకి కలిసొచ్చింది. తెలుగుదేశం పార్టీ సొంతంగా పోటీ చేస్తే ఒక్క సీటు కూడా గెలుచుకోకపోవచ్చునుగానీ, ప్రధాన పార్టీతో జతకట్టి పోటీ చేస్తే ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయగలదు. ఈ నేపథ్యంలో తెలంగాణలో మాత్రం ఎన్డీయే కూటమి ఎందుకు ఏర్పడకూడదు? అన్న ప్రశ్న ఇటీవలి కాలంలో వినపడుతోంది. గతంలో కలిసి పోటీ చేద్దామని తెలుగుదేశం అధినేత చంద్రబాబు ప్రతిపాదించగా బీజేపీ రాష్ట్ర నాయకుల సూచన మేరకు ఆ పార్టీ అగ్రనేతలు తిరస్కరించారు. దీంతో బీజేపీ ఒంటరిగానే పోటీ చేసింది. గత ఎన్నికల్లో జనసేనతో కలసి పోటీ చేసినా పెద్దగా ఉపయోగపడలేదు. దీంతో తెలుగుదేశం పార్టీకి ఉన్న ఓటర్ల ప్రాధాన్యతను బీజేపీ నాయకులు కూడా గుర్తించారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణలో కూడా పోటీ చేస్తామన్న అభిప్రాయాన్ని చంద్రబాబు ఈ మధ్య వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో ఎన్డీయే కూటమి రూపుదిద్దుకోబోతున్నదని పసిగట్టడం వల్లనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల మాట్లాడుతూ, "తెలంగాణలో చంద్రబాబు రాజకీయం చేయాలనుకుంటే సహించేది లేదు" అని వ్యాఖ్యానించారు. ఆయన చంద్రబాబును కేవలం సెంటిమెంటు కోసమే వ్యతిరేకించడం లేదు. ఎన్డీయే కూటమి ఏర్పడితే తెలుగుదేశం, బీజేపీలలో చేరడానికి బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందులో ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. వచ్చే ఎన్నికల నాటికి ఎన్డీయే కూటమి ఏర్పడుతుందని, ఆ కారణంగానే తాను తెలుగుదేశం పార్టీలో చేరే ఆలోచన చేస్తున్నానని కొంతకాలం క్రితం బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యే ఒకరు నాతో చెప్పారు. అప్పట్లో ఆయన చెప్పిన మాటలు టూ ఎర్లీగా అనిపించాయిగానీ, ఇప్పుడు పరిస్థితులు వేగంగానే మారుతున్నాయి. బీజేపీ అగ్ర నాయకత్వం ఆలోచనలు కూడా మారాయంటున్నారు. తెలంగాణలో ఎన్డీయే కూటమి ఏర్పడితే ప్రధానంగా నష్టపోయేది కేసీఆర్ మాత్రమే. అందుకే ఆయన చంద్రబాబుకు తెలంగాణలో ఏం పని అని మళ్లీ ప్రశ్నించడం మొదలు పెట్టారు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పుకోవాలి! బీజేపీతో కలసి వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని బీఆర్ఎస్ నుంచి సంకేతాలు వెళ్లినా... బీజేపీ అగ్ర నాయకత్వం పట్టించుకోలేదు. తెలంగాణలో కేసీఆర్ శకం ముగిసిపోవాలని ఆ పార్టీ కోరుకుంటోంది. తెలుగుదేశం, జనసేనను కలుపుకొన్నా తామే పెద్దన్న పాత్రను పోషించవచ్చునని బీజేపీ నాయకులు కూడా భావిస్తున్నారు. ఈ పరిణామాలను గమనిస్తున్న కేసీఆర్ 'ఇక లాభం లేదు – జనంలోకి వెళ్లాలి' అని నిర్ణయించుకున్నారు. ఇక మీదట శాసనసభకు కూడా హాజరవుతానని ఆయన తాజాగా ప్రకటించారు. తెలంగాణలో ఎన్నికలకు ఇంకా మూడున్నరేళ్ల వ్యవధి ఉంది. ఈ మూడున్నరేళ్లలో ఏదైనా జరగవచ్చు.

> తెలంగాణలో బీజేపీ సంస్థాగతంగా బలంగా ఉండగా, తెలుగుదేశం పార్టీ ఓట్ల పరంగా అంతో ఇంతో బలంగా ఉంది. జనసేనకు కూడా తెలంగాణలో కొన్ని ఓట్లు ఉన్నాయి. గత శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఎన్నికలకు దూరంగా ఉండటంతో అది కాంగ్రెస్ పార్టీకి కలిసొచ్చింది. ఈ నేపథ్యంలో తెలంగాణలో మాత్రం ఎన్డీయే కూటమి ఎందుకు ఏర్పడకూడదు? అన్న ప్రశ్న ఇటీవలి కాలంలో వినపడుతోంది. తెలంగాణలో ఎన్డీయే కూటమి ఏర్పడితే ప్రధానంగా నష్టపోయేది కేసీఆర్ మాత్రమే. అందుకే ఆయన చంద్రబాబుకు తెలంగాణలో ఏం పని అని మళ్లీ ప్రశ్నించడం మొదలు పెట్టారు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పుకోవాలి! బీజేపీతో కలసి వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని బీఆర్ఎస్ నుంచి సంకేతాలు వెళ్లినా... బీజేపీ అగ్ర నాయకత్వం పట్టించుకోలేదు. తెలంగాణలో కేసీఆర్ శకం ముగిసిపోవాలని ఆ పార్టీ కోరుకుంటోంది. తెలుగుదేశం, జనసేనను కలుపుకొన్నా తామే పెద్దన్న పాత్రను పోషించవచ్చునని బీజేపీ నాయకులు కూడా భావిస్తున్నారు.

రేవంత్‌కూ హెచ్చరిక...

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో బీజేపీ ప్రస్తుతానికి మంచి ఊపు మీద ఉంది. ఇప్పుడు తెలంగాణలో కూడా ఎన్డీయేకు పురుడు పోయాలన్న ఆలోచన ఊపందుకుంటున్నందున

> జగన్ అధికారంలో ఉన్నంత కాలం ఎన్ని అరాచకాలు జరిగినా సీపీఎం పెదవి విప్పలేదు. అటు ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా ఇటు తెలంగాణలో కూడా ఆ పార్టీ పోకడలను ప్రజలు హర్షించలేదు. దీంతో తెలుగునాట సీపీఎం తన ఉనికిని కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. దీని ప్రభావం తాజాగా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్పష్టమైంది. గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గాల నుంచి పోటీ చేసి ఓడిపోయిన లక్ష్మణరావుకు ప్రజల్లో కొంత విశ్వసనీయత ఉన్నప్పటికీ ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న సీపీఎం విశ్వసనీయత కోల్పోయినందున భారీ తేడాతో ఓడిపోయారు. ఆయనకు వైసీపీ పరోక్షంగా మద్దతు ఇవ్వడం శాపంగా మారిందన్న అభిప్రాయమూ ఉంది. రాష్ట్ర స్థాయిలోనే కాదు, జాతీయ స్థాయిలో కూడా సీపీఎం నాయకత్వం తీసుకుంటున్న అసంబద్ధ నిర్ణయాల వల్ల ఆ పార్టీ ఇప్పుడు కేరళకు మాత్రమే పరిమితమై ఒక ప్రాంతీయ పార్టీగా కుదించుకుపోయింది.

కేసీఆర్ మాత్రమే కాదు– ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా మేల్కొనాల్సిన అవసరం ఉంది. కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వపరమైన, విధానపరమైన విషయాలను కూడా ముఖ్యమంత్రికంటే ముందుగా మంత్రులు, ఇతరులు ప్రకటిస్తున్నారు. దీంతో ప్రభుత్వ రథసారథి ఎవరన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతోంది. ఈ కారణంగా కాంగ్రెస్ పార్టీ బలహీనపడుతోందన్న అభిప్రాయం బలపడుతోంది. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఇప్పటికైనా మేల్కొని, రాష్ట్ర నాయకత్వాన్ని పటిష్ఠం చేసే దిశగా చర్యలు తీసుకోని పక్షంలో పరిస్థితి చేయి దాటిపోయే ప్రమాదం లేకపోలేదు. స్థానిక సంస్థల ఎన్నికలకు గడువు ముగిసినప్పటికీ ఎన్నికలు జరిపించడానికి కాంగ్రెస్ పార్టీ సాహసించలేక పోతున్నదన్నది వాస్తవం. ఈ నేపథ్యంలో తెలంగాణలో ఎన్డీయే కూటమి రూపుదిద్దుకుంటే రాజకీయ సమీకరణాలు వేగంగా మారే అవకాశం ఉంది. ఇప్పుడు తనతో ఉన్న ఎమ్మెల్యేలు కూటమి వైపు చూడకుండా రేవంత్‌రెడ్డి ఎంతవరకు కట్టడి చేస్తారో తెలియదు. మరోవైపు గత ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలలో కొందరు పునరాలోచనలో పడ్డారు. ఈ పరిణామం కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందికరంగా పరిణమించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ విషమ పరీక్షను ఎదుర్కొని ప్రభుత్వాన్ని, పార్టీని ఎలా కాపాడుకుంటారో వేచి చూడాలి.

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

సమాఖ్య పాలనకు పునర్విభజన సవాళ్లు


లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన, 1977లో రాజ్యాంగానికి 42వ సవరణ జరిగిన నాటి నుంచి, రాష్ట్రాల మెడపై ఒక కత్తిలా వేలాడుతోంది. రాజ్యాంగ అధికరణలు 81, 82 తేటతెల్లమైన భాషలో సుబోధకంగా ఉన్నాయి: 'ఒక పౌరుడు, ఒక ఓటు' అనే సూత్రాన్ని అవి చేర్చుకున్నాయి. లోక్‌సభ సభ్యుల సంఖ్య వివిధ రాష్ట్రాల నుంచి ప్రత్యక్ష ఎన్నిక విధానం ద్వారా ఎన్నికయ్యే సభ్యులు 530కి మించకూడదని, కేంద్ర పాలిత ప్రాంతాలు ఎన్నుకునే వారి సంఖ్య 20కి మించకూడదనే పరిమితులను రాజ్యాంగ అధికరణ నిర్దేశించింది. లోక్‌సభలో ప్రస్తుతం రాష్ట్రాల నుంచి ఎన్నికైన ప్రతినిధులు 530 మంది, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఎన్నికైనవారు 13 మంది ఉన్నారు. అధికరణ 81లోని నిబంధన 2(ఎ) ఇలా ఉంది: 'ప్రతి రాష్ట్రం నుండి లోక్‌సభకు ఎంతమంది ఎన్నిక కావాలనే విషయం ఆ రాష్ట్ర జనాభాపై ఆధారపడి ఉంటుంది. జనాభాకు, లోక్‌సభ సభ్యుల సంఖ్యకు గల నిష్పత్తి సాధ్యమైనంతవరకు అన్ని రాష్ట్రాలకు ఒకే విధంగా ఉండాలి'. ఈ అధికరణానికి సంబంధించి 'జనాభా' అంటే ఆఖరుసారిగా జనాభా లెక్కలు జరిగి, అధికారికంగా ప్రకటించబడిన జనాభా అని అర్థం.

అధికరణ 81 ప్రకారం ప్రతి జనాభా గణన అనంతరం ఒక రాష్ట్రానికి కేటాయించే సీట్ల సంఖ్యను పునర్ నిర్ధారించవలసి ఉన్నది. అయితే ఈ ప్రక్రియకు 2026 సంవత్సరం దాకా విరామం పాటించాలి. ఈ కారణంగా వివిధ రాష్ట్రాలకు కేటాయించిన సీట్ల సంఖ్యను 1971 జనాభా గణన ననుసరించి నిర్ధారించిన రీతిలో స్తంభింపచేశారు. ఇది 'ఒక పౌరుడు, ఒక ఓటు' అనే సూత్రాన్ని ఉల్లంఘించడమే.

'ఒక పౌరుడు, ఒక ఓటు' అనేది ప్రజాస్వామ్య మౌలిక సూత్రం అనడంలో సందేహం లేదు. అయితే 1776లోనే అమెరికన్లు గ్రహించినట్లుగా అది సమాఖ్య సూత్రానికి విరుద్ధమైనది. ఈ వైరుధ్యానికి వారు ఒక పరిష్కారాన్ని కనుగొన్నారు. అది గత 250 సంవత్సరాలుగా వారికి బాగా ప్రయోజనకరంగా ఉన్నది.

వారు నిర్దిష్ట కాల వ్యవధుల్లో మొత్తం 50 రాష్ట్రాల్లో ప్రతి రాష్ట్రానికి కాంగ్రెస్ దిగువ సభ ప్రతినిధుల సభలో కేటాయించే సీట్ల సంఖ్యను ఆ రాష్ట్ర జనాభా సంఖ్య ప్రాతిపదికన పునర్ నిర్ధారిస్తూ వస్తున్నారు. అయితే ఎగువసభ సెనేట్‌లో ప్రతి రాష్ట్రానికి సమాన ప్రాతినిధ్యం (ఇద్దరు సభ్యుల చొప్పున) కల్పిస్తున్నారు. అమెరికా వలే భారత్ కూడా ప్రజాస్వామ్య వ్యవస్థ, సమాఖ్య రాజ్యం. 1971లోని జనాభా నిష్పత్తి ప్రకారం ప్రాతినిధ్యం కల్పించడం వల్ల ఊహించని ప్రమాదాలు ఎదురవుతాయనే వాస్తవాన్ని గుర్తించాము. అయితే ఒక పరిష్కారాన్ని కనుగొనడానికి బదులు దాన్ని 2026 దాకా వాయిదా వేశాము. చివరి జనాభా గణన 2011లో జరిగింది. తదుపరి జనాభా గణన 2021లో జరగవలసి ఉండగా కోవిడ్ విలయం వల్ల వాయిదా వేశారు. 2021 నుంచి ఏదో ఒక సాకుతో జనాభా గణన జరగనే లేదు. 2026లో జనాభా గణన అనంతరం విధిగా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరగవలసి ఉన్నది. ప్రతి రాష్ట్రానికి కేటాయించే సీట్ల సంఖ్యను కూడా నిర్ణయిస్తారు. జనాభా పెరుగుదల అదుపులేకుండా జరిగినందుకు కొన్ని రాష్ట్రాలకు ప్రయోజనాలు కల్పిస్తారు. సంపూర్ణ ప్రజనన రేటు 2 శాతం, అంతకంటే తక్కువగా ఉండాలన్న నిర్దేశిత లక్ష్యాన్ని సాధించిన రాష్ట్రాలను సీట్ల కుదింపుతో శిక్షించనున్నారు.

> ఒకవైపు అధికరణలు 81, 82 ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన, ఆయా రాష్ట్రాల సీట్ల సంఖ్య పునర్ నిర్ధారణకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉండడమూ, మరోవైపు జనాభా ప్రాతిపదికన పునర్విభజన, పునర్ నిర్ధారణకు దక్షిణాది రాష్ట్రాలు ససేమిరా అనడం కొనసాగిన పక్షంలో కేంద్రం, దక్షిణాది రాష్ట్రాల మధ్య విభేదాలు తీవ్రమవుతాయి. వాటి పర్యవసానాలు మన సమాఖ్య వ్యవస్థకు చాలా ప్రమాదకరంగా పరిణమిస్తాయి. ఈ సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోగల విజ్ఞతా వివేకాలు మనకు ఉన్నాయా?



పునర్విభజన, సీట్ల పునర్ నిర్ధారణతో దక్షిణాది రాష్ట్రాలు అమితంగా నష్టపోతాయి. వాటి మొత్తం సీట్ల సంఖ్య 129 నుంచి 103కు తగ్గిపోనున్నది. జనాభా నిష్పత్తి సూత్రానికి అనుగుణంగా రాష్ట్రాలకు సీట్ల సంఖ్యను పునర్ నిర్ధారించడమంటే జననాల రేటును తగ్గించి జనాభా పెరుగుదలను నియంత్రించిన రాష్ట్రాలను 'శిక్షించడమే' అవుతుంది. జనాభా నియంత్రణ అనేది గత అర్ధ శతాబ్దిగా, ఇప్పటికీ కూడా, మన జాతీయ లక్ష్యంగా ఉందన్న విషయాన్ని విస్మరించకూడదు. ఇప్పుడు లోక్‌సభలో 129 స్థానాలున్నా దక్షిణాది రాష్ట్రాల వాణి పెద్దగా విన్పించడం లేదు. మరి ఆ సీట్ల సంఖ్య మరింతగా తగ్గితే దక్షిణాది ప్రతినిధుల మాటను కేంద్రం శ్రద్ధగా పట్టించుకుంటుందా? దక్షిణాది రాష్ట్రాల సీట్ల సంఖ్య తగ్గించబోమనే హామీ నిరర్థకమైనది. జనాభా అత్యధికంగా ఉన్న యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల సీట్ల సంఖ్యను పెంచబోమని కేంద్రం హామీ ఇవ్వకపోవడం గమనార్హం. సీట్ల సంఖ్య పునర్ నిర్ధారణకు జనాభా నిష్పత్తి సూత్రాన్ని అనుసరించిన పక్షంలో దక్షిణాది రాష్ట్రాల బలం మరింతగా తగ్గిపోతుంది. పర్యవసానంగా వాటి సమస్యల పరిష్కారం పట్ల ఉపేక్ష మరింతగా పెరుగుతుంది. సీట్ల సంఖ్య పునర్ నిర్ధారణలో కొన్ని రాష్ట్రాలకు సీట్ల సంఖ్యను కుదించకపోవడమూ, కొన్ని రాష్ట్రాల సీట్ల సంఖ్యను పెంచడమూ జరగాలంటే లోక్‌సభకు ఎన్నికయ్యే ప్రతినిధుల సంఖ్యను విధిగా పెంచవలసి ఉంటుంది. బహుశా దీన్ని దృష్టిలో ఉంచుకునే కాబోలు లోక్‌సభ కొత్త భవనాన్ని 888 మంది సభ్యులకు సరిపోయే విధంగా రూపకల్పన చేసి నిర్మించారు. ఇది ఒక విధంగా 'ఒక పౌరుడు, ఒక ఓటు' సూత్రానికి కట్టుబడి ఉన్నందుకు చెల్లిస్తున్న భారీ మూల్యం. అలాగే జననాల రేటును తగ్గించి, జనాభా పెరుగుదలను నియంత్రించిన రాష్ట్రాలకు లోక్‌సభలో సీట్ల సంఖ్యను తగ్గించడం కూడా ఎంతమాత్రం అంగీకారయోగ్యం కాదు.

జననాల రేట్లు తక్కువగా ఉన్న రాష్ట్రాలు లోక్‌సభలో ప్రభావశీలత పరంగా నష్టపోతాయి; జననాల రేట్లు ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు లబ్ధి పొందుతాయి. ఒకవైపు అధికరణలు 81, 82 ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన, ఆయా రాష్ట్రాల సీట్ల సంఖ్య పునర్ నిర్ధారణకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉండడమూ, మరోవైపు జనాభా ప్రాతిపదికన పునర్విభజన, పునర్ నిర్ధారణకు దక్షిణాది రాష్ట్రాలు ససేమిరా అనడం కొనసాగిన పక్షంలో కేంద్రం, దక్షిణాది రాష్ట్రాల మధ్య విభేదాలు తీవ్రమవుతాయి. వాటి పర్యవసానాలు మన సమాఖ్య వ్యవస్థకు చాలా ప్రమాదకరంగా పరిణమిస్తాయి. ఈ సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోగల విజ్ఞతా వివేకాలు మనకు ఉన్నాయా?



• పి. చిదంబరం
కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఐజీఎం స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు సుమారు 2వేల మందితో 3కే రన్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ, పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, వివిధ శాఖల అధికారులు, కళాశాలల విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు. విద్యార్థినుల డప్పు కళా ప్రదర్శన, చిన్నారుల స్కేటింగ్, మహిళా పోలీసుల డ్రోన్ షో ఆకట్టుకున్నాయి.



అభళా..

» జిల్లావ్యాప్తంగా ఘనంగా మహిళా దినోత్సవం

6

ఆట మొదలైంది

నగరంలో భారీగా క్రికెట్ బెట్టింగ్‌లు

నేటి ఇండియా-న్యూజిలాండ్ మ్యాచ్‌కు రూ.కోట్లలో..

శివారు ప్రాంతాల్లో వెలిసిన డెన్‌లు

- మెట్ల మాదిరిగా నెట్‌వర్క్ నడుపుతున్న బుకీలు
- సాధారణ ప్రజల్లా టీవీ చూస్తూ ఫోన్లలో బెట్టింగ్‌లు
- పోలీసులకు చిక్కకుండా ఎక్కడికక్కడ ప్రణాళికలు

ఇండియా-న్యూజిలాండ్ ఫైనల్ మ్యాచ్ ఏమో కానీ, నగరంలో మాత్రం క్రీడాభిమానుల కంటే బెట్టింగ్ బాబుల్లో ఉత్కంఠ పతాకస్థాయికి చేరింది. ఈ మ్యాచ్‌లు క్రీడాభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతుండగా, బెట్టింగ్ రాయుళ్లకు మాత్రం కాసుల పంట పండిస్తున్నాయి. ఉత్తరాది బుకీలతో సంబంధం ఉన్న నలుగురు వ్యక్తులు ఆదివారం జరగబోయే తుది మ్యాచ్‌పై భారీగా బెట్టింగ్‌లు నిర్వహించడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. నగరం మొత్తంగా రూ.కోటి మేర బెట్టింగ్‌లు నిర్వహించడానికి, పోలీసులకు చిక్కకుండా ఉండటానికి పక్కా ప్రణాళిక వేసుకున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరంలోని లోటస్ ల్యాండ్‌మార్క్‌కు చెందిన పరిపూర్ణమైన బుకీ కనుసన్నల్లో బెట్టింగ్ బాగోతాలు నడుస్తున్నాయి. వరల్డ్ చాంపియన్ ట్రోఫీ తుది మ్యాచ్ ఆదివారం జరగనుండగా, ఇండియా, న్యూజిలాండ్ మధ్య జరిగే ఈ మ్యాచ్‌పై జోరుగా బెట్టింగ్‌లు నిర్వహించడానికి సర్వంసిద్ధం చేసుకున్నారు. కాగా, ఈ బెట్టింగ్‌లు నిర్వహించడానికి నగర శివారు ప్రాంతాలను ఎంచుకున్నట్టు ప్రచారం జరుగుతోంది.

దశలవారీగా..

ఇండియా ఫైనల్స్‌కు చేరే ప్రతి మ్యాచ్‌ను క్రీడాభిమానులు చాలా ఉత్కంఠతో వీక్షిస్తారు. కొన్నిచోట్ల స్నేహితులంతా కలిసి ఇళ్లలో చూస్తారు. బ్యాచిలర్స్ రూమ్‌ల్లో టీవీలు ఏర్పాటు చేసుకుని చూస్తారు. బుకీల్లో చిట్టచివరన ఉండే రెండు దశల్లో ఉన్నవారు కూడా ఇలాగే సాధారణంగా మ్యాచ్ చూస్తూ బెట్టింగ్‌లు పెట్టేలా ఏర్పాట్లు చేసుకున్నారు.



రూ.లక్షల్లో జరిగే బెట్టింగ్‌లను నిర్వహించడానికి ప్రత్యేక బృందాలు ఇప్పటికే సిద్ధమైపోయాయి.

అన్నింటిపైనా పందేలు

ఆట ప్రారంభానికి ముందు జరిగే హెడ్ అండ్ టాస్ ప్రక్రియ నుంచి జట్టు విజయం వరకు, అలాగే పరుగులు.. సిక్స్‌లు.. ఫోర్లు.. వికెట్.. క్యాచ్.. ఇలా అన్ని అంశాలపైనా బెట్టింగ్ నిర్వహిస్తున్నారు.

అంతా ఫోన్లలోనే..

బెట్టింగ్‌ల్లోకి పంటర్లను దింపడానికి భారీగా నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఒక్కో బుకీకి ఐదారు ఫోన్లు ఇచ్చారు. భవనానికి మెట్లు ఉన్నట్టుగా నెట్‌వర్క్‌ను దశలవారీగా ఏర్పాటు చేసుకున్నారు. పోలీసులకు చిక్కకుండా అన్ని ఏర్పాట్లు చేశామని బుకీలు పంటర్లకు భరోసా ఇచ్చినట్టు తెలిసింది. ఇప్పటికే బెట్టింగ్‌లో నిత్యం పాల్గొనే వారికి రహస్యంగా సమాచారం పంపారు. పోలీసులు పక్కా సమాచారంతో దాడులు చేసినా రెండు, మూడు దశల్లో ఉన్నవారు మాత్రమే చిక్కేలా ఎత్తులు వేసినట్టు తెలిసింది. ఆదివారం ఒక్కరోజే రూ.కోటి లక్ష్యంగా బెట్టింగ్‌లు నిర్వహించడానికి రంగం సిద్ధం చేసుకున్నట్టు సమాచారం.

ఈ బెట్టింగ్‌లకు సంబంధించి గూగుల్ ప్లేస్టోర్‌లో అనేక యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. వాటి ద్వారా బెట్టింగ్‌లను బుకీలు పరుగులు తీయిస్తున్నారు. లావాదేవీల కోసం డిజిటల్ అకౌంట్లను నిర్వహిస్తున్నారు. వాటి నిర్వహణకు ప్రత్యేకంగా కొంతమందిని వేతనాలు ఇచ్చి మరీ నియమించుకున్నారు. ఇలా చేయడం వెనుక ఓ ఎత్తుగడ ఉంది. పోలీసులకు చిక్కినప్పుడు వారు ఫోన్లను స్వాధీనం చేసుకుంటారు. పోలీసులు ఫోన్లను మిగతా 6లో..

సముద్రమంత నిర్లక్ష్యం

మచిలీపట్నం పోర్టు పనుల్లో పర్యవేక్షణాలోపం

స్థానిక ఏపీఎంబీ అధికారుల మధ్య వర్గపోరు

- అనుభవం లేని ఇంజనీర్లతో పని చేయిస్తున్న 'రైట్స్'
- పనులు పూర్తికాకుండానే ఇబ్బడిముబ్బడిగా బిల్లులు
- బ్రేక్ వాటర్ పనుల్లోనూ అవకతవకలే..
- మంగళగిరిలో ఏపీ మ్యారీటైమ్ బోర్డు సమావేశం
- ఏపీఎంబీ, రైట్స్ సంస్థ అధికారులకు హెచ్చరికలు



మచిలీపట్నం పోర్టు నిర్మాణం జరిగే ప్రాంతం

మచిలీపట్నం పోర్టు పనులను పర్యవేక్షించే అధికారుల తీరుపై ఏపీ మేరీటైమ్ బోర్డు (ఏపీఎంబీ) ఉన్నతాధికారులు గుర్రుగా ఉన్నారా.. పోర్టు పనులను సక్రమంగా పర్యవేక్షించాల్సిన అధికారులు వర్గపోరుతో కొట్లాడుకుంటున్నారా.. ఇలాంటి అనేక అవకతవకలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయా.. ఇటీవల పోర్టు పనులను పర్యవేక్షించే ఏపీ మ్యారిటైమ్ బోర్డు ఉన్నతాధికారులు.. రైట్స్ సంస్థ అధికారులను మంగళగిరిలోని ప్రధాన కార్యాలయానికి పిలిపించి అక్షింతలు వేయడం, ఇదే పద్ధతి కొనసాగితే నేరుగా ముఖ్యమంత్రికి నివేదికను పంపి పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తామని ఏపీఎంబీ సీఈవో ప్రవీణ్ ఆదిత్య హెచ్చరించడం చూస్తే పై ప్రశ్నలన్నీ నిజమేననిపిస్తుంది.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం పోర్టు పనులను 2023, మే 22న ప్రారంభించారు. 21 నెలలు కావస్తున్నా ఇప్పటివరకు 32 శాతం పనులే జరిగాయి. ఈ పనులను వాస్తవంగా ఏపీఎంబీ అధికారులు పర్యవేక్షించాలి. అక్కడ సరిపడా అధికారులు, సిబ్బంది లేకపోవడంతో ఆ బాధ్యతలను కేంద్రప్రభుత్వ సంస్థ అయిన రైట్స్‌కు అప్పగించారు. ఇందుకోసం సదరు సంస్థకు రూ.35 కోట్ల నుంచి రూ.40 కోట్లు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. సంస్థలో ప్రస్తుతం 15 మందికిపైగా ఇంజనీర్లు పనిచేస్తున్నారు. ఒప్పందం ప్రకారం.. అనుభవం ఉన్న ఇంజనీర్లను ఇక్కడ నియమించాలి. కానీ, పోర్టు పనులను పర్యవేక్షించేందుకు పూర్తిస్థాయిలో అనుభవంలేని ఇంజనీర్లను నియమించారు. ఇటీవల కాలంలో ఇంజనీరింగ్ కోర్సు పూర్తిచేసిన వారిని సైతం ఈ సంస్థలో నియమించి, వారితో పనులను పర్యవేక్షిస్తున్న విషయం ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది. వీరిని మార్చాలని మచిలీపట్నం పోర్టు వద్ద పనిచేస్తున్న ఏపీఎంబీ అధికారులు మంగళగిరి ప్రధాన కార్యాలయంలోని ఉన్నతాధికారులకు లేఖ కూడా రాశారు. అయినా మార్పులేదు.

అనేక సమస్యలపై ఆరా

- పోర్టు నిర్మాణంలో అత్యంత కీలకమైన బ్రేక్ వాటర్ల నిర్మాణంలో ఉపయోగించే రాళ్లు ఎంతమేర వేస్తున్నారు, వాటి చుట్టుకొలతలు, బరువు ఎంతమేర ఉన్నాయనే అంశంపై లెక్కలు కడుతున్నారా, ఈ వివరాలు నమోదు చేస్తున్నారా, అందుకు సంబంధించి రికార్డులు చూపమని ఏపీఎంబీ ఉన్నతాధికారి వివరాలు కోరగా, మచిలీపట్నంలో పనిచేసే ఏపీఎంబీ అధికారులు నీళ్లు నమిలినట్టు సమాచారం.
- పోర్టు ప్రాంతంలోని అంతర్గత రోడ్ల నిర్మాణంలో తొలిదశలో వాడే రబ్బీసు పశ్చిమ గోదావరి జిల్లా నుంచి వస్తోంది. ఈ రబ్బీసు అంత నాణ్యతగా లేకున్నా అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే అంశంపై ఉన్నతాధికారి ప్రశ్నించినట్లు తెలిసింది.
- ప్రస్తుతం సముద్రంలో నిర్మిస్తున్న బ్రేక్ వాటర్‌లకు టెట్రా ప్యాడ్‌లను వేస్తున్నారని, వాటి నాణ్యతను గమనించాలనే అంశంపైనా చర్చ జరిగింది. దీంతోపాటు కీలకమైన డ్రెడ్జింగ్ పనులను పూర్తిచేసేందుకు అదనంగా డ్రెడ్జర్లను ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారి ఆదేశించారు. ఆ పనిచేయకుండా అధికారులు జాప్యం చేస్తుండటం గమనించదగ్గ అంశం.
- పోర్టుకు సంబంధించిన రైల్ మార్గం కోసం ఇంతవరకు అధికారులు సరైన నివేదికలను ఇవ్వకుండా, భూసేకరణలో నెలకొన్న ఇబ్బందులను తొలగించకుండా జాప్యం చేస్తుండటంపైనా ఏపీఎంబీ ఉన్నతాధికారులు అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. రైలుమార్గం కోసం నివేదికలు ఇవ్వాలని రైల్వే అధికారులు పదేపదే కోరినా, స్థానిక అధికారులు స్పందించకపోవడం గమనార్హం.

ఓ ఇంజనీర్ కనుసన్నల్లో..

మచిలీపట్నం పోర్టు పనులను దక్కించుకున్న మిగతా 6లో..

ఆటంకాలు తొలగేనా..?

ఇందిరాగాంధీ స్టేడియం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం

- నిధుల మంజూరుకు కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన
- కేంద్ర క్రీడల మంత్రి మాండవీయను కలిసిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి
- రూ.27.48 కోట్లు కేటాయించాలని వినతి



విజయవాడ స్పోర్ట్స్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం అభివృద్ధికి రూ.27.48 కోట్లు కేటాయించాలని రాష్ట్ర క్రీడల మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి.. కేంద్ర క్రీడల మంత్రి డాక్టర్ ఎం.మాండవీయాను కోరారు. ఢిల్లీలో శనివారం కేంద్ర మంత్రిని కలిసిన ఆయన ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఈ ప్రతిపాదన వెనుక క్రీడాభిమానుల కల ఉందని నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకునే వారేరీ..?

రాష్ట్రంలోనే ప్రధాన నగరాల్లో ముందుడే విజయవాడలో అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌ను తిలకించే అవకాశం లేదు. ఎప్పుడో 2002, నవంబరులో ఇక్కడి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఇండియా-వెస్టిండీస్ జట్ల మధ్య వన్డే మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌ను తిలకించడానికి నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి సుమారు 50 వేల మందికిపైగా క్రీడాభిమానులు తరలివచ్చారు. ఆ తర్వాత ఈ స్టేడియంలో ఒక్క ఇంటర్నేషనల్ మ్యాచ్ కూడా ఆడింది లేదు. ఇందుకు కారణాలూ లేకపోలేదు. మ్యాచ్ నిర్వహించేందుకు పాలకులకు ఆసక్తి లేకపోవడం ఒక కారణమైతే, ఇక్కడి క్రీడా సంఘాల మధ్య రాజకీయాలు మరో కారణమని మాజీ క్రికెటర్లు చెబుతున్నారు. ముఖ్యంగా స్టేడియం మిగతా 6లో..

అక్రమ రిజిస్ట్రేషన్లపై దర్యాప్తు జరపాలి

కూటమి ప్రభుత్వంలో పూర్తి విచారణ జరపాలని డిమాండ్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో రవాణా శాఖలో వెలుగుచూసిన అక్రమ రిజిస్ట్రేషన్ల కుంభకోణం కేసును తిరిగి దర్యాప్తు చేయాలనే డిమాండ్ వస్తోంది. వాహనాలే లేకుండా... ఈశాన్య రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసినట్టుగా చూపిస్తూ- లేని వాహనాలకు ఫిజికల్ వెరిఫికేషన్ కూడా పూర్తిచేసి నకిలీ ఆర్సీలను సృష్టించిన విజయవాడ మాఫియా అప్పట్లో అరెస్టైంది. కాగా, ఆ వెంటనే మాఫియా బయటకు వచ్చేసింది. రవాణా శాఖలోని ఇంటిదొంగలు దర్జాగా బయటకు వచ్చి మళ్లీ విధుల్లో చేరారు. ఈ దురాగతాలకు దాదాపు 300కు పైబడి వాహనాలు లేకుండానే రిజిస్ట్రేషన్లు జరిగాయి. కేంద్ర ప్రభుత్వ వాహన్ సైట్‌ను హ్యాక్ చేసి, వాహనాలే లేకుండా ఉన్నట్టుగా నకిలీ ఛాసిస్ నెంబర్లను చూపించి.. ఆయా రాష్ట్రాల నుంచి ఎన్‌వోసీ సర్టిఫికెట్లను పొంది.. వాటిని చూపి ఏపీలో రిజిస్ట్రేషన్ చేయించారు. విజయవాడ కేంద్రంగా డేటా ఎంట్రీ జరగ్గా, అప్పట్లో నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలో ఫిట్‌నెస్ చేసి ఓకే చేశారు. ఫిట్‌నెస్ చేసే క్రమంలోనూ వాహనాలే లేకుండా ఉన్నట్టుగా మిగతా 6లో..



ప్రోత్సాహం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నగరంలోని నోవాటెల్ హోటల్‌లో శనివారం భారతదేశ ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తల సంఘం (ఎలీప్) ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమాలకు నారా భువనేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేశారు. 30 మంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు.

గ్రీన్ సిగ్నల్

త్వరలో విజయవాడ-ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు

జక్కంపూడి నుంచి ఖమ్మం జిల్లా రెమిడిచర్ల వరకు..

విజయవాడ-ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే పనులకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. జక్కంపూడి నుంచి ఖమ్మంజిల్లా రెమిడిచర్ల వరకు జరగనున్న పనులకు 90 శాతానికి పైగా భూ సేకరణ పూర్తిచేసి.. ఆ భూములను జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్)కు అప్పగించేందుకు ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంది. అదే జరిగితే ఈ నెలాఖరుకు పనులు ప్రారంభించేందుకు కాంట్రాక్టు సంస్థ మేఘా సంసిద్ధమవుతోంది.

- ప్యాకేజీ-3లో 90 శాతం పూర్తయిన భూసేకరణ
- వెంటనే పనులు చేపట్టేందుకు సిద్ధంగా మేఘా
- విజయవాడ-నాగ్‌పూర్ ఎకనమిక్ కారిడార్‌లో కీలకం
- రెండు తెలుగు రాష్ట్రాలను కలిపే కొత్త ప్రాజెక్టు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ-నాగపూర్ ఎకనమిక్ కారిడార్‌లో భాగంగా 405 కిలోమీటర్ల అతిపెద్ద భారీ ఎక్స్‌ప్రెస్ వేకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ భారీ ప్రాజెక్టును మొత్తం 10 ప్యాకేజీల్లో చేపడుతున్నారు. ఇందులో ఏపీ, తెలంగాణాలో 89.43 కిలోమీటర్ల నిడివి ఉంది. దీంతో విజయవాడ-ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే పనులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 3 ప్యాకేజీల ప్రాతిపదికన టెండర్లు పిలిచారు. ఖమ్మం జిల్లా వి.వెంకటాయపాలెం నుంచి బ్రాహ్మణపల్లి వరకు 30 కిలోమీటర్ల మేర మొదటి ప్యాకేజీ పనులను దినేష్ చంద్ర అగర్వాల్ ఇన్ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ రూ.747 కోట్లకు దక్కించుకుంది. ఈ పనులు ఇప్పటికే జరుగుతున్నాయి. రెండో ప్యాకేజీలో భాగంగా ఖమ్మం జిల్లా బ్రాహ్మణపల్లి నుంచి రెమెడిచర్ల వరకు 30 కిలోమీటర్ల మేర మేఘా సంస్థ దక్కించుకుంది. ఈ పనులు కూడా పురోగతిలో ఉన్నాయి. ఇక అత్యంత కీలకమైన మూడో ప్యాకేజీ పనులు ఖమ్మంజిల్లా రెమెడిచర్ల నుంచి ఎన్టీఆర్ జిల్లాలో జక్కంపూడి వరకు 30 కిలోమీటర్ల మేర చేపడుతున్నారు. ఈ పనులు పూర్తయితేనే రెండు రాష్ట్రాల మధ్య ఎక్స్‌ప్రెస్ వే అనుసంధానమవుతుంది. అలాగే, విజయవాడ-నాగ్‌పూర్ మిగతా 6లో..

భూ సేకరణ ప్రక్రియ ఇలా..

విజయవాడ-ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే పనుల్లో ఎన్టీఆర్ జిల్లాలో 30 మీటర్ల అలైన్‌మెంట్‌కు సంబంధించి 243.67 ఎకరాల మేర భూములు అవసరమయ్యాయి. విజయవాడ రూరల్ మండలంలో రాయనపాడు, పైడూరుపాడు, జక్కంపూడి గ్రామాల్లో, జి.కొండూరు మండలంలోని సున్నంపాడు, దుగ్గిరాలపాడు, మునగపాడు, గడ్డమణుగు, కొండూరు, పేత్రంపాడు, గంగినేనిపాలెం, తెల్లదేవరపాడు, చెరువు మాధవరం, పినపాక, కవులూరు గ్రామాల్లో భూములు సేకరించాల్సి వచ్చింది. గంపలగూడెం మండలంలో తునికిపాడు గ్రామంలోనూ భూములు సేకరించారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) : 6-16 (ఆది)
సహర్ (ఉదయం) : 5-08 (సోమ)

19న అశోక్ లేలాండ్ యూనిట్ పునఃప్రారంభం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్కులోని అశోక్ లేలాండ్ బస్సు బాడీబిల్డింగ్ యూనిట్ ఈ నెల 19వ తేదీన పునఃప్రారంభం కానుంది. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ చేతులమీదుగా ఈ పునఃప్రారంభం జరగనుంది. లోకేశ్‌తో పాటు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, అశోక్ లేల్యాండ్ చైర్మన్ ధీరజ్ హిందూజా, ఎండీ సేను అగర్వాల్ తదితరులు పాల్గొననున్నారు. అదేరోజు నుంచి బస్సుల బాడీబిల్డింగ్ యూనిట్ పనులు ప్రారంభంకానున్నాయి. ఇప్పటికే బాడీబిల్డింగ్ చేపట్టే విధంగా ప్లాంట్‌ను సిద్ధం చేశారు.

వైసీపీ కౌన్సిలర్లలో ముదురుతున్న వివాదం

- తిరువూరు చైర్‌పర్సన్‌గా కొత్తపేరు

6లో

మహిళా ఉద్యోగుల సాధికారతకు ప్రతీక ఏపీ జేఏసీ అమరావతి: బొప్పరాజు

కలెక్టరేట్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళా ఉద్యోగులందరినీ ఐక్యంచేసి రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయిలో నాయకత్వ బాధ్యతలు అప్పజెప్పిన ఏకైక జేఏసీ ఏపీ జేఏసీ అమరావతి అని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. శనివా రం నగరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని ఆడిటోరియంలో ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర ఉమెన్ కమిటీ అధ్వర్యంలో మహిళా దినోత్సవం జరిగింది. ఉమెన్ కమిటీ చైర్‌పర్సన్ పారే లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు విచ్చేసిన బొప్పరాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళా ఉద్యోగులకు ఏపీ జేఏసీ అమరావతి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి మహిళా సాధికారతకు ప్రతీకగా నిలిచిందన్నారు. ఇద్దరి కంటే ఎక్కువమంది పిల్లల్ని కనాలని సీఎం చంద్రబాబు స్వయంగా ప్రకటించిన నేపథ్యంలో ఇద్దరికన్నా ఎక్కువ మంది పిల్లలున్నప్పటికీ చైల్డ్‌కేర్ లీవ్ వాడుకొనే వెసులుబాటు కల్పించాలని కోరారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్‌డబ్ల్యూఎస్ (రూరల్ వాటర్ సప్లై) ఇంజినీర్ ఇన్ చీఫ్ టి.గాయత్రి దేవి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగిని ఎలాంటి సందర్భంలోనైనా ధైర్యంగా ఉండటం నేర్చుకోవాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఒక మహిళ అదీ ఒక షెడ్యూల్డ్ కులాలకు చెందిన తనకు రాష్ట్రంలో ప్రధానమైన ఈఎన్‌సీగా నియమించినందుకు సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పారే లక్ష్మి, పొన్నూరు విజయలక్ష్మి, సైకం శివకుమారి, సునీత బిల్లిపో, మిరియాల సునీత, విక్రం జ్ఞానేశ్వరి, జి.మోహన్‌బాబు, జనకుల శ్రీనివాసరావు, వి.ఎస్.సాయిలక్ష్మి, జి.అనుపమ పాల్గొన్నారు.


ఏపీ జేఏసీ అమరావతి అధ్వర్యంలో మహిళా దినోత్సవ సభలో పాల్గొని మాట్లాడుతున్న బొప్పరాజు, వేదికపై మహిళా ప్రముఖులు

మహిళా శక్తితోనే సమాజ పురోగమనం

● కలెక్టర్ లక్ష్మీశ

తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఘనంగా మహిళా దినోత్సవం


విద్యార్థినులతో కలిసి డప్పు వాయిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు

వన్‌టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళా శక్తి అధికంగా ఉన్నచోట సమాజం అన్ని రకాలుగా పురోగమిస్తుందని, ఆ శక్తి తోడ్పాటుతో ఏదైనా సాధించగలమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో శనివారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. బాలికలకు స్వీయ రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. చిన్నప్పుడే సమానత్వం, గౌరవం, సమాన అవకాశాలు వంటి విలువలను నేర్పించాలన్నారు. పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ నగరంలో నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించేందుకు కొన్ని బృందాలు ప్రత్యేకంగా పనిచేస్తున్నాయని, 1500 సీసీ కెమెరాలు పని చేస్తున్నాయని, సమీప కాలంలోనే 10వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. మహిళల రక్షణలో నగర పోలీస్ విభాగాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతిరోజూ డ్రోన్ పెట్రోలింగ్ జరుగుతుందన్నారు. కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పోలీస్ కమిషనర్, కలెక్టర్ పరిశీలించారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న మహిళలు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను సత్కరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, సీడబ్ల్యూసీ సభ్యురాలు రాధాకుమారి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మి, చెన్నుపాటి కీర్తి, సూయజ్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మహిళా ఉన్నతాధికారులు, డ్వాక్రా, మెప్మాల ద్వారా ఆర్థిక పురోగతి సాధించిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, పోలీస్ కమిషనర్ వేదికపై డప్పులు వాయించి కళాకారులతో పాటు పాల్గొని అలరించారు. మహిళలు నడుపుతున్న ఆటోలో కూర్చొని వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. డ్రోన్ స్టాళ్లను, ఇంకా ఇతర స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

మగపిల్లలు ఎలా మసలుకోవాలో నేర్పండి

● యువ ఐపీఎస్ అధికారిణి కుమారి మనీషారెడ్డి


డాక్టర్ జయశ్రీ, ఐపీఎస్ అధికారిణి మనీషారెడ్డి, న్యాయాధికారి శోభారాణి, మమతా శ్రీవాత్సవ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య

జగ్గయ్యపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు ఆడపిల్లలతో పాటు మగ పిల్లలకు కూడా సమాజంలో ఎలా నడవాలో చెప్పాలని యువ ఐపీఎస్ అధికారిణి మనీషారెడ్డి విజ్ఞప్తి చేశారు. జీవిత లక్ష్యాలను చేరుకోవాలంటే అవమానాలు భరించాల్సి ఉంటుందని, తన స్వగతాన్ని వివరించారు. శనివారం పట్టణంలోని ఉక్కు కళా వేదికగా పురపాలకసంఘం చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఆధ్వర్యంలో కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మీ నిర్వహణలో జరిగిన మహిళా దినోత్సవంలో ముఖ్యఅతిథిగా ఐపీఎస్ అధికారి మనీషారెడ్డి పాల్గొని ప్రసంగించారు. టెన్త్ పూర్తికాగానే తల్లిదండ్రులు తనను ఇంటర్ బైపీసీ తీసుకుని ఎంబీబీఎస్ చేయించాలని అనుకున్నారని, ఐపీఎస్ కావాలన్న తన లక్ష్యానికి అనుగుణంగా ఆర్ట్స్ గ్రూప్ తీసుకున్నానన్నారు. తనతోపాటు చదువుకున్న వాళ్ల తన కంటే ముందే సెటిల్ అయిపోతే, బంధువులు, ఇరుగు పొరుగువారు తన తల్లిదండ్రులను ఆడిపోసుకున్నారని, అన్ని అవమానాలు భరించి ఈ రోజు ఐపీఎస్ కాగలిగానన్నారు. పెళ్లికి ముందు తండ్రిపై, పెళ్లయ్యాక భర్తపై మహిళలు ఆధారపడ కూడదని ఆర్థిక స్వావలంభన కలిగి ఉండాలన్నారు.

మహిళా ప్రముఖులకు సన్మానం

యువ ఐపీఎస్ అధికారి మనీషారెడ్డితో పాటు, ప్రముఖ వైద్యురాలు జయశ్రీ, న్యాయాధికారి శోభారాణి, ది రాంకో సిమెంట్స్ ప్రెసిడెంట్ సతీమణి మమతా శ్రీవాత్సవ్‌ను సత్కరించారు. మెప్మా సీఆర్పీలను సత్కరించారు. కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మీ, కంచేటి గీతారాణి, వేదులాపురి ఆలేఖ్య, నోముల స్వప్న, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు నజీమూన్ పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి నారీ శక్తి కీలకం: కలెక్టర్


ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, అధికారులు, విద్యార్థినులు

కలెక్టరేట్/గుణదల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాను అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి దిశగా నడిపించే టీం ఎన్టీఆర్‌లో నారీశక్తి కీలకమని, పేదరిక నిర్మూలనలోనూ మహిళల పాత్ర చాలా ముఖ్యమని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం నగరంలోని ఐజీఎం స్టేడియం నుంచి బెంజి సర్కిల్ వరకు సుమారు 2వేల మందితో పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో 3కే రన్ ర్యాలీని నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ, పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, డీసీపీలు గౌతమిశాలి, కేజీవీ సరిత, తిరుమలేశ్వరరెడ్డి, ఏబీటీఎస్ ఉదయరాణి, కృష్ణమూర్తినాయుడు, వివిధ శాఖల అధికారులు, కళాశాలల విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు. శ్రీదుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థుల డప్పు కళా ప్రదర్శన, చిన్నారుల స్కేటింగ్, మహిళా పోలీసు (డ్రోన్ పైలెట్స్) డ్రోన్ షోలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా కలెక్టర్ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన సీపీకి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రప్రభుత్వ ప్రతిష్టాత్మక స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాల సాకారానికి మహిళల పాత్ర ముఖ్యమన్నారు. పబ్లిక్, ప్రైవేటు, పీపుల్ పార్టనర్ షిప్ (పీ4) ద్వారా పేదరిక నిర్మూలనకూ మహిళల భాగస్వామ్యం కీలకమన్నారు. పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ పోలీసు శాఖ మహిళల భద్రతకు నిరంతరం కృషి చేస్తోందని, ముఖ్యమంత్రి శక్తి అనే ఒక మొబైల్ అప్లికేషన్‌ను కూడా ఆవిష్కరించడం జరుగుతోందన్నారు. డీసీపీ గౌతమిశాలి, డీసీపీ కేజీవీ సరిత మాట్లాడిన అనంతరం స్టేడియం నుంచి కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ, పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, అధికారులతో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అక్కడ నుంచి బెంజి సర్కిల్ వరకు ర్యాలీగా నడుచుకొంటూ వెళ్లి బెంజిసర్కిల్ వద్ద మహిళా పోలీసుల డ్రోన్ షోను తిలకించారు. డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, వివిధ శాఖల అధికారులు, మహిళలు, విద్యార్థినులు పాల్గొన్నారు. అంతేకాక ఈ ర్యాలీలో జిల్లా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సుమారు 500 మంది పాల్గొన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వాక్థాన్‌లో వివిధ కళాశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్స్ ర్యాలీలో పాల్గొని అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఖ్యాతిని తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ, కమిషనర్ ఆఫ్ పోలీసు రాజశేఖర్‌బాబు జెండా ఊపి ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల (బాలికలు), మేరీస్టెల్లా కళాశాల, దుర్గా మల్లేశ్వర మహిళా కళాశాల, ఫార్మసీ కళాశాల, సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.


బెలూన్స్ ఎగురవేస్తున్న హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి

వైద్య విద్యార్థులు క్రీడలకు ప్రాధాన్యతనివ్వాలి

● హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వేమిరెడ్డి రాధికారెడ్డి

గన్నవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులు క్రీడలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వేమిరెడ్డి రాధికారెడ్డి అన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ ఆధ్వర్యంలో 26వ పురుషుల ఇంటర్ మెడికల్ గేమ్స్ మీట్ శనివారం మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఘ నంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ ర్సిటీ క్రీడలను ప్రోత్సహించేందుకు బడ్జెట్‌ను కేటాయిస్తుందని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నతులుగా ఎదగాలన్నారు. డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ భీమేశ్వర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.అనిల్‌కుమార్, డాక్టర్ రెహమాన్, స్పోర్ట్స్ సెక్రటరీ డాక్టర్ ఇ.త్రిమూర్తి, దేవినేని రవి పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఎమ్మెల్సీ ఇవ్వాలి

భారతీనగర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు డబ్బులు ఖర్చు పెట్టి ఎమ్మెల్యే ఎన్నికల్లో పోటీ చేయలేరు కనుక, తమ వయసులో ఉద్యోగాల కోసం పోరాడుతున్న వారిలో ఎవరో ఒకరికి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత కుమార్ కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన శనివారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, మంత్రి అచ్చెన్నాయుడును వారి కార్యాలయాల్లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ విషయాన్ని సీఎం చంద్రబాబుతో చర్చిస్తామని హామీ ఇచ్చారు.

విశిష్ట సేవలందిస్తున్న మహిళలకు సత్కారం

విజయవాడ కల్చరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తెలుగు కళావాహిని, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం సాయంత్రం కౌతా పూర్ణానందం కళావేదికపై పలు రంగాలలో విశిష్ట సేవలు అందిస్తున్న మహిళలకు సత్కారం జరిగింది. చింతకాయల చిట్టిబాబు పర్యవేక్షణలో ప్రొఫెసర్స్ వర్ల అరుణకుమారి, డాక్టర్ జమ్మి శారదలక్ష్మి, గాయనీమణులు మల్లాది కార్తీక త్రివేణి, భారతి, సుహాసిని, మల్లేశ్వ రి, సునీత, సీతామహాలక్ష్మి, వ్యాపారవేత్త మంజరి, చిత్రకారిణి రామసీ త, అనౌన్సర్ పూర్ణచంద్రికలను దుశ్శాలువాలతో గౌరవించి జ్ఞాపిక అందజేశారు. అతిధులుగా గోళ్ల నారాయణరావు, శింగంశెట్టి చంద్రశేఖ ర్, బీవీ వీరభద్రరావు ప్రసంగిస్తూ సమాజంలో మహిళ పాత్ర కీలకమైనదన్నారు.

శ్రీదేవి సాంస్కృతిక సాంఘిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో...

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శ్రీదేవి సాంస్కృతిక సాంఘిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలో శనివారం ఘనంగా నిర్వహించారు. వీఎంసీ డిప్యూటీ కమిషనర్ బి.సృజన, సీఆ ర్డీఏ జోనల్ జాయింట్ డైరెక్టర్ కె.ప్రవీణ, డాక్టర్ పి.రమ్య, సెంట్రల్ జోన్ ఏసీపీ స్రవంతిరాయ్, ఎమ్మెల్యే సతీమణి బొండా సుజాత హాజరయ్యారు. వారిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

ఆ 'అసైన్డ్' బదలాయింపుపై నిషేధం లేదు : హైకోర్టు

అమరావతి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): భూమిలేని నిరుపేదలకు 1954కు ముందు ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూమి విక్రయానికి ఎలాంటి నిషేధం లేదని హైకోర్టు మరోసారి నొక్కి చెప్పింది. 1954 జూన్ 18కు ముందు అసైన్డ్ చేసిన భూమి బదలాయింపు విషయంలో ఎలాంటి నిషేధం లేదని రావి సతీష్ కేసులో హైకోర్టు స్పష్టమైన తీ ర్పు ఇచ్చిందని గుర్తు చేసింది. పెనమలూరు మండలం, కానూరు గ్రా మం పరిధిలో సర్వే నెం. 177/ఏ1లోని 0.66 సెంట్ల పిటిషనర్ భూమి ని అసైన్డ్ భూమిగా ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను ర ద్దు చేసింది. ఈ భూమి విక్రయానికి సంబంధించి పిటిషనర్ స మర్పించే దస్త్రాలను స్వీకరించి, రిజిస్ట్రేషన్ చేయాలని పటమట సబ్ రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ ఇటీవల తీర్పు ఇచ్చారు.

వక్ఫ్ ఆస్తుల ఆక్రమణకు వక్ఫ్ సవరణ బిల్లు

ఈ బిల్లును పార్లమెంట్‌లో అడ్డుకోవాలి: పలువురు వక్తలు

ధర్నాచౌక్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ ఆస్తులను ఆక్రమించుకునేందుకే వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తుందని దీన్ని అడ్డుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మసీదులు, ఖబరస్తాన్ల పరిరక్షణ కోసం, వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో నిరసన కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ బోర్డు జాతీయ ప్రధానకార్యదర్శి మౌలానా ఫజ్లుర్రహీం ముజద్దిది మాట్లాడుతూ ఈ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కు ఐదు కోట్ల మంది ముస్లింలు అభ్యంతరాలు తెలియజేయడం జరిగిందన్నారు. ముస్లింల అభిప్రాయాలను పట్టించుకోకుండా వక్ఫ్ ఆస్తులను హరించేందుకే ఎన్డీఏ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. సీఎం చంద్రబాబును కలిసి మద్దతు తెలియజేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సీపీఐ, సీపీఎం నేతలు జల్లి విల్సన్, గఫూర్, సీహెచ్.బాబురావు, ప్రముఖ న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్ తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు సభ్యులు, మౌలానా నసీర్ అహ్మద్ ఉమ్రి, మౌలానా ముఫ్తి యూసఫ్, అక్బర్ భాషావివిధ ముస్లిం సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

అమరావతిపై నిందలు వేసే వారిపై చర్యలు తీసుకోవాలి

● పోతుల బాల కోటయ్య

గాంధీనగర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిని ఎమ్మెల్సీలు బొత్స సత్యనారాయణ, రవీంద్రబాబు శ్మశానం అని వ్యాఖ్యానించడాన్ని అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు పోతుల బాల కోటయ్య తీవ్రంగా ఖండించారు. శ్మశనంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌బాబు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లు అమరావతిపై నిందలు వేసినా, బూతులు మాట్లాడినా సహించామని, కూటమి ప్రభుత్వంలో కూడా వైసీపీ నేతలు అమరావతిని శ్మశానమని అనడంపై ధ్వజమెత్తారు. రూ.40వేల కోట్ల అభివృద్ధి పనులు ఘోస్ట్ సిటీలో జరుగుతున్నాయా? మంత్రి నారాయణ సమాధానం చెప్పాలన్నారు. అమరావతిపై నిందలు వేసే వారిపై చట్ట ప్రకారం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అమరావతి జేఏసీ సమన్వయ కమిటీ ప్రతినిధి కళ్ళం రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ అమరావతిపై తప్పుడు ప్రచారం చేస్తే సహించబోమని హెచ్చరించారు. అమరావతి మహిళా జేఏసీ ప్రతినిధి కొమ్మినేని వరలక్ష్మీ మాట్లాడుతూ అమరావతిపై పదే పదే నిందలు వేసి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

విధుల నుంచి ఇద్దరు ప్రధానోపాధ్యాయుల తొలగింపు

వన్‌టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జగ్గయ్యపేట నియోజకవర్గం లింగాలపాడు జడ్పీహెచ్ పాఠశాల హెచ్ఎం ఆళ్ల రాంబాబు, జగ్గయ్యపేట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎ.మాధవిలతను పరీక్షల విధుల నుంచి తొలగించినట్టు ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి జీవీ సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో వీరికున్న అనుభవం దృష్ట్యా జగ్గయ్యపేట, తపోవన్ విద్యాలయం ఇంగ్లీషు మీడియం స్కూల్, నందిగామ శ్రీవిద్యాలయ హైస్కూల్‌లో సిట్టింగ్ స్క్వాడ్ అధికారులుగా నియమించామన్నారు. అయితే ఈనెల 3న గానీ, 5న గానీ నిర్వహించిన అపోస్ ఇంటర్ పరీక్షల్లోనూ ఎలాంటి ఆరోపణలు, ఫిర్యాదులు రాలేదన్నారు. 6న సామాజిక మాధ్యమాల్లో ఆరోపణలు రావటంతో ఏపి కో-ఆర్డినేటర్లుగా పనిచేస్తున్నారనే విషయాన్ని తెలుసుకుని పరీక్షల విధుల నుంచి తప్పించినట్టు తెలిపారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన ఓపెన్‌గా మాస్ కాపీయింగ్ కథనాన్ని పరిశీలించామని ఎన్టీఆర్ జిల్లాలో 17 సెంటర్లలో జరుగుతున్న పరీక్షల్లో ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

దుర్గగుడి చీరల విభాగంలో ముగిసిన విచారణ

● త్వరలో కమిషనర్‌కు పూర్తి నివేదిక అందజేత

ఇంద్రకీలాద్రి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడి దేవస్థానం చీరల విభాగంలో జరిగిన అవకతవకలపై దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ నియమించిన కమిటీ చేపట్టిన విచారణ శనివారంతో ముగిసింది. చీరల విభాగంలో కోట్లాది రూపాయలు అవకతవకలు జరిగినట్టు ఏఈవో సుధారాణి కమిషనర్‌కు నివేదిక పంపించారు. ఆయన ఆదేశాలతో గుంటూరు డిప్యూటీ కమిషనర్ కె.వి.శ్రీనివాసరావు, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ హెచ్‌జీ వెంకటేష్, తూర్పు గోదావరి జిల్లా పెద అవుటపల్లి గ్రూప్ టెంపుల్ సూపరింటెండెంట్ కె.ఎల్.ఎన్.శెట్టి, రాజమండ్రిలోని ఆర్‌జేసీ కార్యాలయం సూపరింటెండెంట్ పి.సుబ్రహ్మణ్యం ఈనెల 7 నుంచి విచారణ చేపట్టారు. చీరల విభాగంలో తనిఖీలు, రికార్డులను పరిశీలించి, విచారణ అధికారిణిగా పనిచేసిన సుధారాణి నుంచి వివరాలు తెలుసుకున్నారు. అలాగే అవకతవకల సమయంలో పనిచేసిన గుమస్తాలు పి.సుబ్రహ్మణ్యం, కె.రమేష్, మధు శనివారం విచారణ కమిటీ ముందు హాజరవగా వారి నుంచి వేర్వేరుగా లిఖితపూర్వక స్టేట్‌మెంట్‌తో పాటు పలు రికార్డుల్లో వారికి కావాల్సిన నకళ్లను తీసుకున్నారు. ఈ నివేదికను రెండు, మూడు రోజుల్లో రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్‌కు అందజేయనున్నారు.



ప్రభుత్వాసుపత్రి బయటే వైద్యం..!

కనిపించని వైద్యుడు.. సిబ్బందితో మమ

జగ్గయ్యపేట రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు ఘర్షణ పడగా ఒక వ్యక్తి తీవ్ర రక్తస్రావంతో గండ్రాయిలోని భూచవరం పీహెచ్‌సీకి శుక్రవారం వెళ్లగా వైద్యాధికారి లేకపోవటంతో సిబ్బంది సేవలందించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామానికి చెందిన లింగనబోయిన రామారావు, బొమ్మనబోయిన గోపీ మద్యం మత్తులో ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. రామారావుకు తీవ్ర గాయాలవటంతో స్నేహితులు బైక్‌పై పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. తీవ్ర రక్తస్రావంతో వచ్చిన వ్యక్తికి సిబ్బంది బయటే వాష్ ఏరియాలో వైద్య సేవలందించారు. మద్యం మత్తులో తీవ్ర రక్తస్రావంతో ఉన్న రామారావును లోపలికి తరలించాలని యత్నించినా సహకరించలేదని సిబ్బంది అంటున్నారు. ప్రధాన వైద్యాధికారి అనిల్‌కుమార్‌ను వివరణ కోరగా డ్యూటీ వైద్యాధికారి ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉండాలన్నారు. వైద్యుడు లేకపోవటంతో సిబ్బంది మానవతా దృక్పథంతో లోపలికి తీసుకెళ్లాలని యత్నించినా సహకరించకపోవటంతో బయటే వైద్యం అందించారన్నారు. ఈ ఘర్షణపై సమాచారం అందిందని విచారించి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ తెలిపారు.

సముద్రమంత నిర్లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

కాంట్రాక్టు సంస్థ చేసిన పనుల అంచనాలను రైట్స్ సంస్థ నమోదుచేసి, ఏపీఎంబీకి పంపాలి. ఆ బిల్లులను ఏపీఎంబీ అధికారులు ప్రభుత్వానికి పంపుతారు. దీనిని సాకుగా తీసుకుని ఏపీఎంబీలో పని చేసే ఇంజనీర్ ఒకరు అంతా తన చేతుల్లోకి తీసుకుని తెరవెనుక చక్రం తిప్పుతున్నాడనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ అంశాన్ని గ్రహించిన ఏపీఎంబీ ఉన్నతాధికారి మచిలీపట్నం పోర్టు పనులను తనిఖీ చేసేందుకు వచ్చిన సమయంలో సదరు ఏఈని తనదైనశైలిలో హెచ్చరించారు. పనుల నాణ్యత పరిశీలనలో చూపాల్సిన శ్రద్ధ, బిల్లులు చేయడంలో చూపుతున్నారని, ఇదేం పద్ధతి అని నిలదీశారు. దీంతో స్థానిక అధికారులు ఖంగుతిన్నారు. నీటిపారుదల శాఖ నుంచి డెప్యుటేషన్‌పై ఏపీఎంబీకి వచ్చిన ఈ ఏఈ ఎంతకాలం పాటు ఇక్కడ పనిచేస్తారనే అంశంపైనా ఉన్నతాధికారులు ఆరా తీసినట్లు సమాచారం. పనుల పర్యవేక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏపీఎంబీ ఈఈ, డీఈలకు షోకాజ్ నోటీసులు కూడా జారీచేశారు. ఈ నోటీసులకు స్థానిక ఏపీఎంబీ అధికారులు ఇచ్చిన సమాధానంపైనా ఏపీ మేరిటైమ్ బోర్డు ఉన్నతాధికారులు సంతృప్తి చెందలేదని అధికారులు చెప్పుకొంటున్నారు. పనులు సక్రమంగా చేయకున్నా నెలకు రూ.50 కోట్ల నుంచి రూ.70 కోట్ల మేర బిల్లులు పెడుతున్నారని, ఈ బిల్లులు ఎలా చేయాలని ఏపీఎంబీ ఉన్నతాధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. ఇటీవల కాలంలో మచిలీపట్నం పోర్టు పనులను పర్యవేక్షిస్తున్న ఏపీఎంబీ, రైట్స్ సంస్థ అధికారులను మంగళగిరిలోని కార్యాలయానికి పిలిపించి, సమీక్ష నిర్వహించిన సమయంలో ఉన్నతాధికారులు ఇక్కడి లోపాలను ఎత్తి చూపారు. పనితీరుపై ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తామని ఉన్నతాధికారి హెచ్చరించారు.

ఆట మొదలైంది

(5వ పేజీ తరువాయి)

విశ్లేషించినప్పుడు ఈ లావాదేవీల వివరాలు తెలియకుండా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. వారికి ఆటతో ఏమాత్రం సంబంధం ఉండదు. పందేలను పరుగులు తీయించే వ్యక్తి వారికి సమాచారం ఇస్తాడు. దాన్నిబట్టి ఎవరెవరు ఏయే కేటగిరీలో పందెం కట్టారో రాసుకుంటారు. దానిపై వారు ఎంతెంత పందెం పెట్టారో నమోదు చేసుకుంటారు. ఇప్పటి వరకు జరిగిన డబ్ల్యూసీటీ మ్యాచ్‌లన్నింటి పైనా నగరానికి చెందిన ప్రముఖ బుకీలు భారీగానే బెట్టింగ్‌లు నిర్వహించినట్టు తెలుస్తోంది. ఓ పరిపూర్ణవంతుడే సుమారు రూ.కోటి వరకు బెట్టింగ్‌లు నిర్వహించినట్టు పందెపురాయుళ్లలో చర్చ నడుస్తోంది. ఈ బెట్టింగ్‌ల్లో జరుగుతున్న వ్యవహారాలు బయటకు లీకవుతుండటంతో ప్రధాన బుకీలు వారి కింద పనిచేసే వారికి కొన్ని సూచనలు ఇచ్చినట్టు తెలిసింది. బెట్టింగ్‌లోకి కొత్తగా వచ్చే వారిని ఎలాంటి సిఫార్సు లేకుండా రప్పించవద్దని చెప్పినట్టు సమాచారం. ఆన్‌లైన్‌లో, ఫోన్లలో బెట్టింగ్‌లు పెట్టే వారి గురించి తెలుసుకునే పనిలో పడ్డారు. బెట్టింగ్‌ల్లో బుకీలుగా వ్యవహరించే వారికి హెచ్చరికలు జారీ చేసినట్టు తెలిసింది. ఎవరైనా పోలీసులకు చిక్కితే వారికి ఇచ్చే కమీషన్లలో కోత విధించడం గానీ, ఇవ్వకపోవడం గానీ చేస్తామని హెచ్చరిస్తున్నారు.

ఆటంకాలు తొలగేనా..?

(5వ పేజీ తరువాయి)

నిర్వహణ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా లేకపోవడం ఇంకో కారణంగా పేర్కొంటున్నారు. స్టేడియం నిర్వహణలో మున్సిపల్ కార్పొరేషన్ పూర్తిగా విఫలం కావడం కూడా ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో మంగళగిరిలో నిర్మాణంలో ఉన్న స్టేడియం పూర్తయితే అంతర్జాతీయ స్థాయి మ్యాచ్‌లు చూడొచ్చన్న నగరవాసుల కోరిక కూడా కలగానే ఉండిపోయింది. కాగా, వన్డే మ్యాచ్ కాకపోయినా టీ20 మ్యాచ్‌నైన నగరవాసులకు అందించాలని గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రయత్నాలు చేసింది. కానీ, ఆశించిన ఫలితం అందలేదు. ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం క్రీడలపై చిన్నచూపు చూడటంతో క్రీడాభివృద్ధికి ఒక్క అడుగు పడింది లేదు. మళ్లీ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే క్రీడల అభివృద్ధికి నడుం బిగించింది. ఇందులో భాగంగానే స్టేడియాన్ని అభివృద్ధి చేసి టీ20 మ్యాచ్‌లను నగరంలో నిర్వహించేందుకు నిధులను సమకూర్చే పనిలో ప్రభుత్వం నిమగ్నమైంది.

గ్రీన్‌సిగ్నల్

(5వ పేజీ తరువాయి)

నడుమ అనుసంధానం ఏర్పడుతుంది. ఇక ప్యాకేజీ-1, 2 పనులు తుదిదశకు చేరుకున్నాయి. ప్యాకేజీ-3 పనులు ఇప్పటి వరకు మొదలు కాలేదు. ఈ పనుల కోసం ఎన్టీఆర్ జిల్లాలో 30 ఎకరాల మేర భూములను సేకరించారు. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో భూ సేకరణలో తీవ్రజాప్యం జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక భూ సేకరణ ప్రక్రియను 90శాతం పూర్తి చేశారు.

అక్రమ రిజిస్ట్రేషన్లపై దర్యాప్తు జరపాలి

(5వ పేజీ తరువాయి)

చూపించారు. ఈ వ్యవహారంలో ఆర్సీల కోసం డబ్బు ఇచ్చిన వారిని వదిలేశారు. కనీసం విచారణకు కూడా పిలవలేదు. అప్పట్లో ప్రాథమిక విచారణలో ఈ బాగోతాలు బయటపడ్డాయి. ఆ తర్వాత రవాణా శాఖ ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరపాల్సి ఉన్నా ఆ పని చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో పునః విచారణ జరపాలనే డిమాండ్ వస్తోంది.

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం: కలెక్టర్

గాంధీనగర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పిస్తామని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఎన్జీవోహోంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజులుగా నిర్వహించిన వివిధ పోటీల్లో మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. ఎంపీ కేశినేని చిన్ని సతీమణి కేశినేని జానకీ లక్ష్మీ మాట్లాడుతూ, మహిళల కోసం ప్రత్యేకంగా ఒక రోజు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డు సర్వే కమిషనర్ ఎస్‌కే.షరీన్ బేగం, ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.వి.శివారెడ్డి, ఎ.విద్యాసాగర్ మాటాడారు. సంఘం మహిళా నేతలు ఎం.రాజ్యలక్ష్మీ, బి.జానకి, బి.తులసీ రత్నం, లలితాంబిక తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	90, 97, 107
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

లబ్బీపేట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మొగల్రాజపురం సెక్షన్, బృందావన్ విద్యుత్ ఉపకేంద్రం, రింగు రోడ్డు సెక్షన్‌లోని 11 కేవీ టిక్కిల్ రోడ్ ఫీడర్ పరిధిలో నందమూరి రోడ్డు, బందర్ రోడ్డు సుందరం మోటార్స్ ఏరియా, టిక్కిల్ రోడ్డు, కృష్ణనగర్, కామినేని వారి వీధి, డీవీ మానర్ రోడ్, శ్యాంనగర్, మెనర్ ఫుడ్‌ప్లాజా రోడ్ ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామనని ఏపీసీపీడీసీఎల్ ఈఈ రవీంద్రబాబు తెలిపారు.



పీబీ సిద్దార్థ ఆడిటోరియంలో మహిళలను సన్మానిస్తున్న యోగాసన నిర్వాహకులు



మహిళలను సన్మానిస్తున్న స్టెల్లా కళాశాల యాజమాన్యం



ర్యాలీని ప్రారంభిస్తున్న పీబీ సిద్దార్థ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు

ఘనంగా మహిళా దినోత్సవం

పటమట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పీబీ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో యోగాసన సిటీ 2024-25 విభాగంలో అస్మితా ఖేలో ఇండియా, బోర్డు అథారిటీ ఆఫ్ ఇండియా, క్విట్ ఇండియా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్తంగా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలకు యోగా పోటీలు నిర్వహించారు. మూడుసార్లు ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన స్వర్ణకుమారిని, రాజధాని పోరాటంలో విశేష పోరాటం చేసిన గోవిందమ్మ, వరలక్ష్మిలను, పతాంజలి యోగా సమితికి చెందిన ఝాన్సీలక్ష్మిని సత్కరించారు. గత ఏడాది డిసెంబరు, ఈఏడాది జనవరిలో నేషనల్ యోగా పోటీల్లో మెడల్స్ సాధించిన వారిని సత్కరించారు. 14వ ఫ్యామిలీ కోర్టు జడ్జి ఇందిరాప్రియదర్శిని, ఝార్కండ్ రిటైర్డ్ డీసీపీ విష్ణువర్ధన్‌రావు, డాక్టర్ ప్రవీణ్, స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ గౌరవాధ్యక్షుడు గొట్టిపాటి రామకృష్ణ, అధ్యక్షురాలు రాధిక, కార్యదర్శి ప్రేమ్‌కుమార్, రాజేశ్వరి పాల్గొన్నారు.

స్టెల్లా కళాశాలలో..

స్టెల్లా కళాశాలలో ప్రిన్సిపల్ జెసింతా క్వాడ్రస్ మహిళా దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఆయుష్ విభాగం మెడికల్ ఆఫీసర్ ప్రియదర్శిని ముఖ్య అతిథిగా విచ్చేశారు. పలు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కరస్పాండెంట్ సిస్టర్ లేనా క్వాడ్రస్, డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ ఉషాకుమారి, డాక్టర్ మంగా దేవి, మంజుల పాల్గొన్నారు.

ఎన్‌సీసీ బెటాలియన్ ఆధ్వర్యంలో ర్యాలీ

మొగల్రాజపురం: పీబీ సిద్ధార్థ కళాశాల ఎన్‌సీసీ17(ఏ)బెటాలియన్ నిర్వహించిన ర్యాలీని ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు జెండా ఊపి ప్రారంభించారు. పిన్నమనేని రోడ్డు, జమ్మిచెట్టు సెంటర్ మీదుగా తిరిగి కళాశాల వరకు ర్యాలీ సాగింది. అనంతరం మహిళా సాధికారతపై వక్తృత్వ, రంగోలి పోటీలు నిర్వహించారు. బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ జీసీ పాండే, కెప్టెన్ కె.విజయ్ పాల్గొన్నారు.

రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

విజయవాడ(స్పోర్ట్స్): బెజవాడ రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్వర్యంలో సత్యనారాయణపురం జీవీఎస్ శాస్త్రి పార్క్‌లో బీఆర్ఎస్ఈ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కార్పొరేటర్ వీరమాచనేని లలిత కిషోర్ కేక్ కట్ చేశారు. రోలర్ స్కేటింగ్‌లో జాతీయ, అంతర్జాతీయస్థాయిలో బెజవాడ రోలర్ అసోసియేషన్ క్రీడాకారిణులు మెడల్స్ సాధించారని అన్నారు. మెడల్స్ సాధించిన క్రీడాకారిణిలు, వారి తల్లిదండ్రులను సన్మానించారు.



పారిశుధ్య కార్మికులు, వీరమహిళలను సత్కరిస్తున్న జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, అమ్మిశెట్టి వాసు తదితరులు

మహిళల గుండె చప్పుడు జనసేన

● ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను

మొగల్రాజపురం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళల సమస్యల పరిష్కారం కోసం నిస్వార్థంగా పనిచేయడం, వారికి అండగా నిలవడం వల్ల మహిళల గుండె చప్పుగా జనసేన మారిందని ఆ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను అన్నారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, తూర్పు నగర ఇన్‌చార్జి అమ్మిశెట్టి వాసు ఆధ్వర్యంలో గాయత్రీనగర్‌లో నిర్వహించిన మహిళాదినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఉదయభాను పాల్గొన్నారు. డాక్టర్ హారిక, హైకోర్టు న్యాయవాది కల్పన, పారిశుధ్య మహిళా కార్మికులను, వీరమహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ మండలి రాజేష్, కార్పొరేటర్ ఉమ్మడి శెట్టి రాధిక, పార్టీ రాష్ట్ర కార్యదర్శి శివపార్వతి, సహాయ కార్యదర్శి పొతిరెడ్డి అనిత, కృష్ణా పెన్నా రీజియన్ కో-ఆర్డినేటర్ మల్లెపు విజయలక్ష్మి, పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మి, అంబటి రాజ్యలక్ష్మి, శ్యాంప్రసాద్, పలువురు వీర మహిళలు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ఎమ్‌వో పద్మావతి, డీసీపీ సరితకు సత్కారం



డీసీపీ కేజీవీ సరితను సన్మానిస్తున్న గోకర్ణేశ్వరరావు



డాక్టర్ పద్మావతిని సన్మానిస్తున్న సిబ్బంది

ప్రభుత్వాసుపత్రి: ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా విజయవాడ డీసీపీ (అడ్మిన్) కేజీవి సరితను చుట్టుగుంట సెంటర్లో శ్రీ చైతన్య కళాశాల రవీంద్రనాథ్ ఠాగూర్ భవన్ ప్రిన్సిపాల్ నిజాంపట్నం గోకర్ణేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. విజయవాడ ప్రభుత్వాసుత్రిలో సివిల్ సర్వీసెస్ రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్ (సీఎస్ఆర్ఎమ్‌వో) డాక్టర్ పద్మావతిని సిబ్బంది సత్కరించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సీనియర్ నర్సింగ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న మిరియాల జాన్సిరాణిని ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం రాష్ట్ర నాయకులు సత్కరించారు.



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న రావి సౌజన్య

పారిశుధ్య కార్మికులకు సన్మానం

పటమట: జనసేన కృష్ణా-పెన్నా రీజినల్ కోఆర్డినేటర్ రావి సౌజన్య ఆధ్వర్యంలో తూర్పు నియోజకవర్గ పరిధిలోని మహిళా పారిశుధ్య కార్మికులను సత్కరించారు.

ఆర్థిక గణాంకాల నవీకరణతో

వికసిత భారత్ సాకారం



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ ఎన్ఆర్ భానుమూర్తి తదితరులు

మొగల్రాజపురం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): 'భారత దేశానిది ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. 2047 నాటికి వికసిత భారత్ స్వప్నం సాకారమవ్వాలంటే రాష్ట్ర, జాతీయస్థాయిలో ఆర్థిక గణాంకాల నవీకరణ జరగాలి. ఆర్థిక వృద్ధి రేటు 8శాతం పైగా ఉండాలి.' అని మద్రాస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.ఆర్.భానుమూర్తి అన్నారు. పీబీ సిద్ధార్థ కళాశాల వెబినార్ హాలులో ఏపీ ఎకనామిక్ ఫోరం రెండు రోజుల పాటు నిర్వహించే 41వ వార్షిక సదస్సును శనివారం ఆయన ప్రారంభించారు. సంపద సృష్టి, సంక్షేమ పథకాల మధ్య సమన్వయంతో సంతులిత అభివృద్ధి సాధ్యమవుతుందని కళాశాల ప్రిన్సిపాల్, సదస్సు సమన్వయకర్త డాక్టర్ మేకా రమేష్ అన్నారు. ఏపీ ఎకనామిక్ అసోసియేషన్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఎల్.కృష్ణమోహన్‌రావు, అధ్యక్షుడు ప్రొఫెసర్ టీఎల్ఎన్ స్వామి, సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ సైన్సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.గలాబ్, సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు పాల్గొన్నారు. ఆర్థిక వృద్ధిపై తయారు చేసిన సావనీర్‌ను భానుమూర్తి ఆవిష్కరించారు.

బీ లీగ్ మ్యాచ్‌లో వీవీకేఆర్ఎమ్‌పై

వెల్‌కమ్ జట్టు ఘన విజయం

విజయవాడ(స్పోర్ట్స్), మార్చి 8(ఆంధ్రజ్యోతి): మూలపాడు గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న దేవినేని వెంకటరమణ, ప్రణీత మెమోరియల్ బీ లీగ్ మ్యాచ్‌లలో శనివారం వీవీకేఆర్ఎమ్ జట్టుపై వెల్‌కమ్ జట్టు ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన వెల్‌కమ్ జట్టు 45.5ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 210 పరుగులు చేసింది. జట్టులో వరణ్ సాత్విక్ 74 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ దిగిన వీవీకేఆర్ఎమ్ జట్టు 16ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి కేవలం 73 పరుగులు చేసి ఓటమి పాలైంది. వెల్‌కమ్ జట్టు బౌలర్ సుమిత్ 5వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు.

లయోలా కళాశాలపై చర్యలు తీసుకోవాలి

● అటానమస్ పేరుతో అవకతవకలకు పాల్పడుతోందని ఏబీవీపీ నిరసన

భారతీనగర్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర లయోలా కళాశాల అటానమస్ పేరుతో ఎన్నో అవకతవకలకు, దౌర్జన్యాలకు పాల్పడుతోందని, విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తోందని, ప్రభుత్వం కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యసమితి సభ్యుడు స్వర్గం దుర్గారావు డిమాండ్ చేశారు. అటానమస్ స్టేటస్ ముగిసినా రిటెయిన్ చేసుకోలేదని, ఎందుకు ఇలా చేస్తున్నారని ప్రశ్నిస్తే దరఖాస్తు పెట్టామని మాట దాటేస్తూ యాజమాన్యం తప్పించుకుంటుదని అన్నారు. ఏబీవీపీ విజయవాడ శాఖ ఆధ్వర్యంలో శనివారం కళాశాల ఎదుట నాయకులు నిరసన తెలిపారు. ఇటీవల కృష్ణా విశ్వవిద్యాలయం నుంచి వచ్చిన త్రిసభ్య కమిటీ ఇచ్చిన రిపోర్టులో కళాశాల తప్పులను తెలియజేసిందన్నారు. ఇంకా ఇలాగే కొనసాగితే వందల ఎకరాలు విరాళంగా ఇచ్చిన దాతల ఆశలను సమాధి చేసినట్లు అవుతుందన్నారు. గత ఏడాది ఐబీఎం కంపెనీతో కొలాబరేషన్ ఉందంటూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులో విద్యార్థులతో రూ.లక్ష అదనంగా కట్టించుకుని మోసం చేసిందన్నారు. నగర సిటీ జాయింట్ సెక్రటరీ వసీం, కార్యకర్తలు హనీఫ్, విజయ్, వంశీ పాల్గొన్నారు.

10, 17, 24 తేదీల్లో వైద్య సేవ ఉద్యోగుల విధుల బహిష్కరణ

ప్రభుత్వాసుపత్రి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి ఈనెల 10, 17, 24 తేదీల్లో మూడు సోమవారాలు రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో పని చేస్తున్న ఉద్యోగులందరూ విధులు బహిష్కరిస్తున్నట్లు ఏపీ వైద్య సేవ ఎంప్లాయిస్ జేఏసీ(ఏపీఏఎమ్‌సీహెచ్ఈయు) హెచ్-146 అనుబంధం) యూనియన్ కేడర్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ గోవింద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్యసేవ పథకాన్ని బీమా పరిధిలోకి తీసుకెళ్లేందుకు, ఆప్కాస్ రద్దు చేసేందుకు అడుగులేసిందన్నారు. ఏప్రిల్ నుంచి బీమా సేవలు కొనసాగుతాయని తెలియజేసిందన్నారు. దీంతో రాష్ట్రంలో పనిచేస్తున్న వైద్య సేవ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అన్న క్యాంటీన్లతో తీరుతున్న పేదల ఆకలి

రాణిగారితోట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పట్టెడన్నం పెడుతున్న అన్న క్యాంటీన్లను పేద ప్రజలు ఆదరిస్తూ అకలి తీర్చుకుంటున్నారని టీడీపీ 18వ డివిజన్ అధ్యక్షుడు వేముల దుర్గారావు అన్నారు. శనివారం డివిజన్‌లోని అన్న క్యాంటీన్‌ను ఆయన సందర్శించారు. అక్కడ భోజనానికి వచ్చిన వారితో మాట్లాడి భోజనం నాణ్యత, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. వైసీపీ ప్రభుత్వం వీటిని విస్మరించడంతో అనేక మంది పేదలు అవస్థలు పడ్డారని అన్నారు. ప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



FLATS FOR SALE

» PORANKI, Prabhu Nagar : Premium Individual, E/F, New 3 BHK (Total 2500 S.ft) & Plinth 1850 S.ft) Flats. Near Capital Hospital. UD 77 Yards : Cell : 89789 14242
AJB - 9177

» కొత్తవి 2 BHK - 1290 sft, 3 BHK 1550 sft, ఫ్లాట్స్ అమ్మకానికి కలవు. PVR Meadows (70 Flats), శ్రీ కనకదుర్గ నగర్ కాలనీ, మహానాడు రోడ్డుకి దగ్గర VJA ✆ 97034 19192
AJB- 209316

» న్యూలాంచింగ్ ఆఫర్ ఓపెన్ ఫ్లాట్స్, డూప్లెక్స్ విల్లాస్ విజయవాడ నడిబొడ్డున బందరురోడ్, తాడిగడప ఐస్‌క్రీమ్ ఫ్యాక్టరీ దగ్గర, తారురోడ్డు ఫేసింగ్ 133, 150, 200 గం. ఫ్లాట్స్ గ.27,500/- 3 BHK విల్లా 85 లక్షల నుంచి బ్యాంక్‌లోన్ Hyma Prasad ✆ 99596 45468
AJB- 519

» సింగ్‌నగర్, ఆంధ్రప్రభ కాలనీ, నందమూరి నగర్, మారుతి కార్ల షోరూం వెనుక, షిర్డిసాయి హైట్స్ నందు 1st ఫ్లోర్ లోని E/F, W/F, ఫుల్లీ ఫర్నిష్డ్ 3BHK ఫ్లాట్స్ Total Plinth 1431 sft, Ready to Occupy, బ్యాంక్ లోన్ సౌకర్యంతో అమ్మకం. సెల్: 93929 82559, 98492 42413
AJB-225966

అమ్మకం

» VJA భవానీపురం, స్వాతి రోడ్ రన్నింగ్ కండీషన్స్‌లో గ్రౌండ్ వెజ్ 1st నాన్‌వెజ్ 2nd & 3rd ఫ్లోర్స్‌లో బాంక్వెట్ హాల్స్‌తో సంప్ర: ✆ 98484 46926
AJB- 225629

లీజుకు ఇవ్వబడును

» గుంటూరు - విజయవాడ హైవే నంబూరు రేడియో స్టేషన్ ఎదురు సర్వీస్ రోడ్డు ప్రక్కన తూర్పు ఫేస్, 1500 చ॥గ॥ కమర్షియల్ స్థలం లీజుకు కలదు. సంప్ర॥ 93941 55562.
AJG-210400

» విజయవాడ దగ్గర, కంకిపాడు గ్రామం, మెయిన్ రోడ్, వ్యవసాయ మార్కెట్ ఎదురు 950 చ॥గ॥ కమర్షియల్ స్థలం లీజుకు ఇవ్వబడును. సంప్ర॥ 93941 55562.
AJG-210501

లేట్ మ్యారెజెస్ స్పెషల్

30 సం॥ పైబడిన వారికి మాత్రమే జ్యోతిష్య గురువు స్వయంగా చూస్తున్నారు మీకు 6 నెలల్లో భాగస్వామి మా లక్ష్యం మా ఆఫీస్‌లో నేరుగా కలవండి. ఫీజు లేదు
79934 36358

WANTED

» పోరంకిలోని ప్రముఖ పబ్లికేషన్స్‌కు అనుభవజ్ఞులైన DTP ఆపరేటర్లు, లేడీ అకడమిక్ కో ఆర్డినేటర్స్, అకౌంటెంట్స్ కావలెను. అర్హత మరియు అనుభవం బట్టి Salary నిర్ణయించబడును. సెల్ : 77300 35678
AJB - 225635

» అమెరికా, కాలిఫోర్నియాలో ఇంటి వద్ద వుండి చిన్న పిల్లను చూసుకోవడానికి వీసా కలిగి అనుభవం గల మహిళ కావలెను. వివరాలకు సంప్ర. సెల్ : 94935 77077
AJB - 209306

» పనిమనిషి కావలెను సీనియర్ సిటీజన్‌కు ఇంటి, వంటపని ఉదయం 7.00 నుండి 9.00 గం.ల వరకు గాంధీనగర్ విజయవాడ నందు ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. నో బ్రోకర్స్. సంప్ర: ✆ 99127 21805
AJB- 225637

పాతనోట్లు మార్చబడును

» చినిగిన నోట్లు, మాసిన నోట్లు మార్చబడును. కొత్తపేట, కుమ్మరవీధి, నెహ్రూచౌక్, గణపతిరావు రోడ్డు, విజయవాడ-1. సంప్రదించండి : ✆ 630 333 2014
AJB- 225785

TO-LET

» గుంటూరు, R.T.C. బస్టాండ్ మెయిన్ గేటు ఎదురు అన్ని వసతులతో రన్నింగ్ చేసుకొనుటకు అనువైన హోటల్ సరోవర్ రెస్టారెంట్ అద్దెకు ఇవ్వబడును. సంప్ర॥ 98485 85469.
AJG-204373

TO-LET COMMERCIAL

» విజయవాడ, విద్యాధరపురం, నాలుగు స్థంబాల సెంటర్‌లో 1400 sft, 1st ఫ్లోర్ (ఈస్ట్ ఫేసింగ్) ఆఫీస్, బ్యాంకు, హాస్పిటల్ C & F గొడౌన్‌కు అద్దెకు కలదు. లిఫ్ట్ సౌకర్యం సంప్ర : 98491 62010
AJB - 225634

LAND FOR SALE

నూజివీడు To మైలవరం బైపాస్ ఫేసింగ్‌తో అమరావతి ORRకి అతి చేరువలో 3ఎకరముల కమర్షియల్ ల్యాండ్ అమ్మకమునకు కలదు Cell: 9666719777
AJD:199642

BUILDING & CONSTRUCTIONS

» తక్కువ ఖర్చు పూర్తి క్వాలిటీతో మీ ఇల్లు మరియు ఇతర ఏ కట్టడాలైన కాంట్రాక్ట్ పద్ధతిలో కట్టబడును. P.V.R. Constructions ✆ 77805 69091.
AJB- 209317

PLOT FOR SALE

» VJA పటమట, న్యూ పోస్టల్ కాలనీ, రోడ్ నెం.5, ప్లాట్ నెం. 200, పడమర ఫేస్, 180 చ.గ.ల రేకుల షెడ్ అమ్మకమునకు కలదు. సెల్ : 92465 25639, 94823 90385
AJB - 209405

» విజయవాడ, చుట్టుగుంట, ఏలూరు రోడ్, రామ్‌కార్ షోరూం వెనుక పడమర ఫేస్ 40 అడుగుల రోడ్‌లో 800 చ.గ.లు అమ్మకమునకు కలదు. సంప్ర: సెల్:92464 74697
AJB- 225631

★ హైదరాబాద్‌లో హయత్‌నగర్, పసుమాముల కుంట్లూరు, పెద్దఅంబర్‌పేట్, అబ్దుల్లాపూర్‌మెట్, మునగనూర్ కోహెడ ప్రాంతాలలో ప్లాట్లు కొనబడును. (నో బ్రోకర్స్) 9391125860
AJH-002918

» విజయవాడ, పాతపాడు, మంగళాపురం గ్రామం మధ్యలో బస్సురోడ్ పడమర ఫేస్ 611 చ.గ.లు అమ్మకం అపార్టుమెంట్లుకు ఉపయోగపడును. రేటు చ.గ.లు: 10,000/- ✆ 89859 17897, 94402 80263
AJB- 209303

» విజయవాడ, పాతపాడు శివారు, మంగళాపురం నుండి ఉడా కాలనీ రోడ్డు, పడమర ఫేస్ 1064 చదరపు గజములు (67 x 143) భూమి అమ్మబడును. చ.గ రేటు రూ. 9,500/- బెజవాడ రాజారావు సంప్రదించండి. సెల్ : 89859 17897, 94402 80263
AJB-209311

HOUSE FOR SALE

» సింగ్ నగర్, ప్రకాష్ నగర్‌లో పుచ్చపల్లి సుందరయ్య స్కూల్ ప్రక్కన గల వంగవీటి మోహనరంగా కమ్యూనిటీ హాల్ ఎదురు సందులో 72 గజాలలో G+2 (2 BHK) బిల్డింగ్ అమ్మకము. సెల్ : 789 32 99337
AJB - 9179

» విజయవాడ కానూరు రోడ్డు కామయ్య తోపు సెంటర్ చలసానినగర్, మూడో లైను, Autumn Fileld అపార్ట్‌మెంట్ 2BHK, 1000 Sft. ఫ్లాట్ అమ్మబడును. సంప్ర॥ 9133157576, 9848667579.
AJG-2033

» మొగల్‌రాజ్‌పురం, బోయపాటి మాధవరావు రోడ్డులో, 150 చ.గ.ల ఈస్ట్ ఫేస్, 2 బెడ్ రూమ్స్, గ్రౌండ్ మరియు ఫస్ట్ ఫ్లోర్ గల ఇల్లు అమ్మకం. సెల్ : 63010 46797
AJB - 209417

» AMPAPURAM, Bapulapadu Mandal. E/F, 200 Sq. yards House Sale. 3rd House from National High-Way : Contact : 94911 53063.
AJB - 9180

SERVICES

» Srinivas Technologies సోలార్ ఫెన్సింగ్ వర్క్స్ : మీ ఇల్లు, విల్లాలు, వెంచర్‌లకు వర్క్ చేయబడును. సంప్ర : సెల్ నెం. 89851 67770
AJB-925

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి



ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
అమెరికన్ మ్యాన్‌హంట్	డాక్యూ సిరీస్	మార్చి 10
అమెజాన్ ప్రైమ్		
వీల్ ఆఫ్ టైమ్ 3	వెబ్‌సిరీస్	మార్చి 13
బీ హ్యాపీ	హిందీ చిత్రం	మార్చి 14
జీ5		
ఇన్ గలియోంమే	హిందీ చిత్రం	మార్చి 14
ఆపిల్ టీవీ ప్లస్		
డోప్ థీఫ్	వెబ్‌సిరీస్	మార్చి 14
ఈటీవీ విన్		
పరాక్రమం	తెలుగు చిత్రం	మార్చి 13
రామం రాఘవం	తెలుగు చిత్రం	మార్చి 14
సోనీ లివ్		
ఏజెంట్	తెలుగు చిత్రం	మార్చి 14

కూతురు కోసం తండ్రి తపన

దేశంలోని అతిపెద్ద డ్యాన్స్ రియాలిటీ షోలో ప్రదర్శన ఇవ్వాలన్న కూతురి కోరికను తీర్చేందుకు ఓ తండ్రి చేసిన ప్రయత్నాల నేపథ్యంలో సాగే హిందీ చిత్రం 'బీ హ్యాపీ'. అభిషేక్‌బచ్చన్ శివ అనే అంకిత భావం గల తండ్రి పాత్రను పోషించారు. ఇనాయత్ వర్మ ఆయన కూతురు ధార పాత్రలో కనిపించనుంది. డాన్స్ డ్రామా నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కింది. తల్లి లేని లోటు తెలియకుండా అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురి కోరికను తీర్చేందుకు తపించే తండ్రి పాత్రలో అభిషేక్ నటన ఈ సినిమాకు ప్రధానాకర్షణ అని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. తండ్రీ, కూతురు కలసి ముంబై వెళ్లడం, అక్కడ డ్యాన్స్ షోలో పాల్గొనేందుకు వారు చేసే ప్రయత్నాల్లోంచి పుట్టే వినోదం అలరిస్తుంది. ఈ చిత్రానికి రెమో డిసౌజా దర్శకత్వం వహించగా, సల్మాన్‌ఖాన్, ఇమ్రాన్ మజూర్ నిర్మించారు.



వేసవిలో పిల్లలకు ఇవి తినిపించాలి..!

వేసవికాలంలో పిల్లలకు బలవర్ధకమైన పోషకాహారం అత్యవసరం. పెరుగుతున్న ఎండవేడిని తట్టుకునేలా సమయానుసారం పిల్లలకు ఎలాంటి ఆహారం పెట్టాలో తెలుసుకుందాం.

- ఎండ వేడిమి వల్ల పిల్లల శరీరంలో నిర్జలీకరణ స్థితి ఏర్పడి వడదెబ్బ తగిలే అవకాశం ఉంటుంది. దీన్ని నివారించేందుకు తరచూ పిల్లల చేత చల్లని నీరు తాగిస్తూ ఉండాలి. ఫ్రిజ్ కంటే కుండలోని నీళ్లు ఆరోగ్యానికి మంచివి.
- మధ్యాహ్న సమయంలో పలుచని మజ్జిగ, కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు, నిమ్మరసం, రాగి జావ, బార్లీ నీళ్లు తాగించాలి. కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్‌ల జోలికి వెళ్లనీయకూడదు.
- సబ్జా గింజలు లేదా చియా గింజలను నీళ్లలో నానబెట్టి వాటిని పండ్ల రసాలు లేదా చల్లని మజ్జిగలో కలిపి పిల్లలకు తాగించవచ్చు. నగ్గుబియ్యంతో తయారు చేసే జావ కూడా వేసవి తాపాన్ని హరిస్తుంది.
- పుచ్చకాయ, కర్బూజా, బొప్పాయి, నారింజ, స్ట్రాబెర్రీ, దానిమ్మ, మామిడి లాంటి తాజా పండ్లను పిల్లలకు తినిపించాలి. కీరా ముక్కలు, తాటి ముంజలు కూడా మేలు చేస్తాయి.
- పాలకూర, టమాటా, కేరట్, బీట్‌రూట్, సొరకాయ, బీరకాయ లాంటి కూరగాయలతో చేసిన వంటలను భోజనంలో చేర్చాలి.
- తాజా కూరగాయలు, పండ్లతో సలాడ్స్, స్మూతీలు తయారు చేసి ఇస్తే పిల్లలు ఇష్టంగా తింటారు.
- ఉదయం అల్పాహారంగా ఇడ్లీ, దోశ, పెసరట్టు, పోహ లాంటి తేలికగా జీర్ణమయ్యేవాటిని తినిపించాలి. మధ్యాహ్న భోజనంలో రకరకాల కూరగాయలతో తయారు చేసిన సాంబార్, మజ్జిగ ఉండేలా చూడాలి. వీటివల్ల పిల్లలకు జీర్ణశక్తి మెరుగుపడుతుంది. శరీరంలో నీటిశాతం నిలిచి ఉంటుంది. రాత్రి భోజనంలో ఆరోగ్యకరమైన సూప్‌ని చేర్చాలి. సాధ్యమైనంతవరకూ నూనె, మసాలా పదార్థాలను పిల్లలకు పెట్టకపోవడమే మంచిది.
- సాయంకాలం పిల్లలు ఆకలి అన్నప్పుడు కొన్ని డ్రై ఫ్రూట్స్, ఖర్జూరాలు, మొలకలు, తేనె కలిపిన పండ్ల ముక్కలు తినిపించవచ్చు.





'భంభం భోలే...' అంటూ ఖంగుమని మోగే కంచుకంఠం కైలాష్ ఖేర్‌ది! 'జేజమ్మ...', 'వచ్చాడయ్యా సామి...', 'కథానాయక...' లాంటి పాటలతో తెలుగువారికి దగ్గరయిన కైలేష్ ఖేర్ 19 భాషల్లో తన గానాన్ని వినిపిస్తున్నారు. ఆయన ఆత్మకథ 'తేరీ దివానీ' ఇటీవల విడుదలయింది. ఈ నేపథ్యంలో ఆయన 'నవ్య'కు ఇచ్చిన ఇంటర్వ్యూ...

సిద్ధి లేకుండా ప్రసిద్ధి చెందలేం



చాలా మంది జీవితంలో చివరి దశలోనే ఆత్మకథలు రాస్తారు... మీరు ఇప్పుడే రాయటానికి కారణాలేమిటి?

నా ఉద్దేశంలో ప్రతి వ్యక్తి జీవితం ఒక అందమైన కథ. దీనిలో అనేక పార్శ్వాలు ఉంటాయి. ఇవి కూడా మనల్ని అభిమానించేవారికి తెలియాలి. అయితే ఈ పార్శ్వాలను ఎంత జాగ్రత్తగా, ఎంత నిబద్ధతతో వారి దగ్గరకు తీసుకువెళ్తున్నామనేది ముఖ్యం. దీనికి మాధ్యమంగా నేను పుస్తకాన్ని ఎంచుకున్నాను. ఇక నా జీవితం సంగీతంతో ముడిపడి ఉంది. అందరికీ నేను ఒక గాయకుడిగా మాత్రమే తెలుసు. చాలాకాలంగా నా అభిమానులు నా దగ్గరకు వచ్చి "మీ పాటలు మా హృదయాన్ని తాకుతాయి. మీరు మనసు పెట్టి పాడతారు. అలా పాడటానికి వెనుక ఉన్న కారణాలేవిటి?" అని అడుగుతూ ఉంటారు. వారి కోసమే 'తేరీ దివానీ' అనే ఈ పుస్తకాన్ని తీసుకువచ్చాను. ఒక సామాన్యుడు అసామాన్య కళాకారుడిగా ఎలా రూపుదిద్దుకున్నాడన్నదే ఈ పుస్తక కథ. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. ఈ పుస్తక ప్రచురణకర్తల్లో నేను కూడా ఒకడిని. ఎందుకంటే - మంచి పుస్తకాలు అందరి దగ్గరకు వెళ్లాలనేదే నా కోరిక. అందుకే 'కైలాస ఎడ్వర్‌టైజింగ్' అనే సంస్థను ఏర్పాటు చేసి 'పెంగ్విన్' సంస్థతో కలిపి ఈ పుస్తకాన్ని ప్రచురించాం.

పుస్తక రచన సమయంలో మీ అనుభవాలేమిటి?

మనం ప్రపంచాన్ని ఎలా చూస్తే అలా కనిపిస్తుంది. ఒక ఏనుగును నలుగురు అంధులు వేరు వేరుగా చూస్తారు. వారి వారి అనుభవాలు వారికి ఉంటాయి. మనం కూడా అంతే. మనకు తెలిసిందే ప్రపంచం అనుకుంటాం. కానీ ఈ పుస్తకం రాసేటప్పుడు నాకు అనేక అనుభవాలు కలిగాయి. ఆ సమయంలో కైలాష్ కేర్ పైకి కనిపిస్తాడు. కానీ వాడి చేత రాయించేవాడు ఈశుడే! ఈ విషయం నాకు పుస్తకం రాసే సమయంలో అర్థమయింది. ఆ సమయంలో నాకు ఒక మిత్రుడు సహకరిస్తున్నాడు. ఒక రోజు మేమిద్దరం కలుసుకోవాల్సి ఉంది. కానీ తను నాకు ఫోన్ చేసి- "నేను రాలేను" అని చెప్పాడు. ఎందుకో అప్పుడు నాకు - 'క్యా సజనా... బిన్ సజనా..' అనే రెండు మాటలు అప్రయత్నంగా వచ్చాయి. ఆ మాటల నుంచి అప్రయత్నంగా పాట పుట్టుకువచ్చింది. ఆ పాటను త్వరలోనే విడుదల చేయబోతున్నాం. ఇలాంటి అనుభవాలెన్నో.

మీ ఆలోచనలు సంగీతంలో ఉంటాయా? మాటల్లో ఉంటాయా?

నేను దేన్నీ ఆలోచించను. మనసులో వచ్చిన ఆలోచనలను ఎప్పటికప్పుడు మాటల రూపంలో పెడతానంతే! మాట్లాడినప్పుడు కూడా అంతే! అందుకే నా మాటల్లో స్పష్టత ఉంటుంది. మాటలు నది మాదిరిగా ప్రవహిస్తూ ఉంటాయి.

మన దేశంలో సినిమా సంగీతానికి ఉన్న ప్రాధాన్యత దేశీయ సంగీతానికి ఉందని మీరు అనుకుంటున్నారా?

మన దేశంలో సినిమా పాటలకు ఆదరణ ఎక్కువ. కానీ దేశీ సంగీతానికి కూడా స్థానికంగా చాలా ప్రాధాన్యం ఉంటుంది. మన దేశంలో ప్రతి ప్రాంతానికి ఒకో ప్రత్యేకత ఉంది. అక్కడ ఉన్న సంగీతం ఇతరులు కూడా విన్నప్పుడు దానిలో ఉన్న గొప్పదనం అర్థమవుతుంది. నేను గత పదేళ్లుగా 'భారత్‌కా అమృత్ కలశ్' అనే రియాలిటీ షో నిర్వహిస్తున్నాను. దీనిలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారి వారి వేష భాషల్లో వచ్చి పాటలు పాడతారు. ఛానల్స్‌లో కూడా ఇలాంటి షోలు రావాలి. లేకపోతే వాళ్ల రియాలిటీ షోలకు 'ఫిల్మీ రియాలిటీ షో' అని పేరు పెట్టుకోవాలి.

మీతో కలిసి ఆల్బమ్స్ చేయటానికి చాలామంది ఔత్సాహికులు వస్తూ ఉంటారు.. వారికి మీరు ఇచ్చే సలహా ఏమిటి?

సిద్ధి లేకుండా ప్రసిద్ధి చెందలేం. అంటే చాలా కష్టం తర్వాతే విజయం లభిస్తుంది. దానివల్ల ప్రసిద్ధులమవుతాం. కానీ ఈ మధ్యకాలంలో సులభంగా ప్రసిద్ధి చెందాలనే ఆలోచన చాలామందిలో కనిపిస్తోంది. మనల్ని ఇష్టపడే అభిమానుల సంఖ్య క్రమంగా పెరగాలి. అంతేతప్ప ఒకేసారి లక్షలమంది రావాలనుకోకూడదు. ఒక పాట హిట్ అయిన వెంటనే ప్రపంచాన్ని జయించామని అనుకోకూడదు.

కైలాష్ ఖేర్ ఎప్పుడూ సనాతన ధర్మాన్ని ప్రచారం చేస్తూ కనిపిస్తారు. శుద్ధమైన హిందీలో మాట్లాడతారు. అందుకు కారణమేదైనా ఉందా?

గత కొద్దికాలంగా నేను మాట్లాడే భాషలో కూడా మార్పు వచ్చింది. ఒకప్పుడు నేను మామూలుగా మాట్లాడేవాడిని. ఇప్పుడు శుద్ధంగా మాట్లాడటం నేను నేర్చుకున్నాను. నేను పాటలు పాడటం మొదలుపెట్టినప్పుడు నాకు ఏమీ తెలీదు. సినిమా పాటలు, 'చిత్రహార్' లాంటివి తెలీదు. టీవీలో షోలు కూడాఎప్పుడూ చూడలేదు. అలాంటి నేను ఇప్పుడు 19 భాషల్లో పాడుతున్నానంటే ఏదో ఒక కారణం ఉండాలి కదా! ఆ కారణం ఆధ్యాత్మికత. నా ఉద్దేశంలో ఆధ్యాత్మికత లేకపోతే భారత దేశం లేదు. ఇంగ్లీషు సంస్కృతి నాలుగైదు వందల సంవత్సరాల క్రితం వచ్చిందే. అంతకుముందు నుంచి 'బతుకు...బతకనివ్వు' అనేది మన సంస్కృతి. 'అందరూ బావుండాలి... అందులో మనం ఉండాలి' అనేది మన సంస్కృతి. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. ప్రపంచంలో అందరూ యంత్రాలు తయారుచేస్తున్న సమయంలో మనం మంత్రాలు జపించేవాళ్లం. వాళ్లు యంత్రాలు తయారుచేసి పిచ్చి వాళ్లు అయిపోయారు. ఇప్పుడు వారు మానసిక ప్రశాంతత కోసం మన దగ్గరకు వస్తారు. అంటే మన సంస్కృతి అంత గొప్పది. అలాంటి భావనను నేను ఎప్పుడూ వదలను. కైలాష్ కేర్ ఎప్పుడూ మారడు. ఆధ్యాత్మికతను వదలడు.


• సివిఎల్ఎన్ ప్రసాద్



కథానాయకుడు బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ వెండితెర ఆరంగేట్రం కోసం నందమూరి అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారు. 2024లో వారి ఎదురుచూపులు ఫలించాయి. 'హను-మాన్' చిత్రంతో పాన్ ఇండియా దర్శకుడిగా మారిన ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించే ఓ చిత్రం ద్వారా మోక్షజ్ఞ హీరోగా పరిచయమవ్వనున్నట్లు అధికారికంగా వెల్లడించారు.

వెండితెర ఎంట్రీ దక్కాలంటే ఆషామాషీ విషయం కాదు. అలాంటిది ఇండస్ట్రీనే ఎర్రతివాచీ వేసి ఆహ్వానిస్తే ఎలా ఉంటుంది. పరిశ్రమలో నటీనటుల వారసుల పరిచయానికి ఉండే క్రేజే వేరు. కొత్తగా వచ్చే వారసులకు తమ తల్లిదండ్రుల అభిమానుల ఆదరణ కూడా విశేషంగా ఉంటుంది. అలా వెండితెర ఎంట్రీ ఇస్తున్న కొత్త తరంపై ఓ లుక్కేద్దాం.

వారసులు వచ్చేస్తున్నారు...





ఎన్టీఆర్ నటవారసత్వాన్ని నందమూరి బాలకృష్ణ అందుకొన్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఆ కుటుంబం నుంచి మూడు తరాల నటులు ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. తాజాగా, ఆ కుటుంబం నుంచి నాలుగో తరానికి చెందిన ఇద్దరు నూతన కథానాయకులు చిత్రసీమను పలకరించనున్నారు. అందులో ఒకరు బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ కాగా, మరోకరు హరికృష్ణ మనవడు, జానకిరామ్ తనయుడు తారకరామారావు. కథానాయకుడు బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ వెండితెర ఆరంగేట్రం కోసం నందమూరి అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారు. 2024లో వారి ఎదురుచూపులు ఫలించాయి. 'హను-మాన్' చిత్రంతో పాన్ ఇండియా దర్శకుడిగా మారిన ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించే ఓ చిత్రం ద్వారా మోక్షజ్ఞ హీరోగా పరిచయమవ్వనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఇది ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో సూపర్ హీరో కథాంశంతో తెరకెక్కనుంది. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభం కానుంది. దీని తర్వాత తన తండ్రి బాలకృష్ణ దర్శకత్వంలో 'ఆదిత్య 999 మ్యాక్స్' చిత్రంలో మోక్షజ్ఞ నటించనున్నారు. బాలకృష్ణ కథానాయకుడిగా సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించిన సూపర్ హిట్ చిత్రం 'ఆదిత్య 369'కు సీక్వెల్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. అలాగే, "సార్', 'లక్కీ భాస్కర్' చిత్రాలతో సూపర్‌హిట్‌లు అందుకొన్న వెంకీ అట్లూరీ కూడా మోక్షజ్ఞ కోసం ఓ కథ తయారుచేశారట. నట వారసులను, కొత్తతరాన్ని ఇండస్ట్రీకి పరిచయం చేయడంలో ముందుంటారు దర్శకులు వైవీఎస్ చౌదరి. ఆయన దర్శకత్వంలో తెరకెక్కబోతున్న ఓ సినిమాలో జానకీరామ్ తనయుడు తారకరామారావు కథానాయకుడిగా ఎంట్రీ ఇస్తున్నారు. ఇటీవలె ఈ సినిమాను ప్రకటించడంతో పాటు తారకరామారావు లుక్‌ను విడుదల చేశారు. ఇందులో కథానాయికగా వీణా రావు నటిస్తున్నారు. ఈ ఏడాదే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



మరో మేనల్లుడు సిద్ధం

ఘట్టమనేని కుటుంబం నుంచి తెరంగేట్రం చేసేందుకు మరో వారసుడు సిద్ధమయ్యారు. మహేశ్‌బాబు అల్లుడిగా ఇప్పటికే అశోక్ గల్లా 'హీరో' సినిమాతో పరిచయమై ప్రేక్షకులను మెప్పించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అశోక్ తమ్ముడు సిద్ధార్థ్ గల్లా కూడా సిల్వర్‌స్క్రీన్ వైపు అడుగులేస్తున్నారు. రచయిత గోపీ మోహన్ దర్శకత్వంలో ఇది తెరకెక్కనుంది. అలాగే, మహేశ్‌బాబు అన్న కుమారుడు రమేశ్‌బాబు తనయుడు కూడా వెండితెరపై అలరించేందుకు ముస్తాబవుతున్నారు.

బాలనటులుగా

మంచు కుటుంబం నుంచి మూడో తరం వారసులు వెండితెర ఎంట్రీకి రెడీ అయ్యారు. మంచు మోహన్‌బాబు, ఆయన తనయులు విష్ణు, మనోజ్ నటులుగా ఇప్పటికే ఇండస్ట్రీలో ఉన్నారు. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ఈ సినిమాతో ఆయన తనయుడు అవ్రామ్, కుమార్తెలు అరియాన, వివియాన బాలనటులుగా పరిచయం అవుతున్నారు. భారీ తారాగణంతో ముఖేశ్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఏప్రిల్ 25న విడుదల కానుంది.

డియోల్ కుటుంబం నుంచి..



'యానిమల్' సినిమాతో ఫామ్‌లోకి వచ్చారు బాబీ డియోల్. ఆయన కుమారులు ఆర్యమన్ డియోల్, ధరమ్ డియోల్ కూడా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వడానికి సుముఖంగా ఉన్నట్లు వెల్లడించారు. తెలుగులో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా 2023లో విడుదలై ఘనవిజయం సాధించిన 'బేబీ' సినిమాను ఆర్యమన్ డియోల్ హీరోగా తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో దివంగత నటుడు ఇర్ఫాన్ ఖాన్ తనయుడు బాబిల్ కూడా నటించనున్నట్లు టాక్. హీరోయిన్లుగా సారా అలీఖాన్, క్రితి శెట్టి పేర్లను పరిశీలిస్తున్నారు.

సైఫ్ నటవారసుడు



బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ వారసురాలిగా సారా అలీ ఖాన్ ఇప్పటికే సినిమాల్లో ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు సైఫ్ తనయుడు ఇబ్రహీం అలీఖాన్ హీరోగా ప్రేక్షకుల ముందుకు వచ్చారు. షౌనా గౌతమ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'నదానియాన్' చిత్రంలో నటించారు. ఇటీవలె ఈ సినిమా విడుదలైంది. ఆయన ప్రస్తుతం కునాల్ దేశ్‌ముఖ్ దర్శకత్వంలో 'దిలెర్' అనే చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో శ్రీలీల కథానాయికగా నటిస్తోంది.

మెగాఫోన్‌తో...

స్టార్ హీరోల వారసులు ఎక్కువ మంది నటులుగా మారుతుంటే.. వారికి భిన్నమైన దారిలో ప్రయాణిస్తున్నవారూ ఉన్నారు. తమిళ కథానాయకుడు విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా మెగాఫోన్ పట్టనున్నారు. సందీప్ కిషన్ హీరోగా ఓ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్ తనయుడు ఆర్యన్ ఖాన్ కూడా దర్శకత్వం వైపు అడుగులేస్తున్నారు. 'బా..డ్స్ ఆఫ్ బాలీవుడ్' పేరిట నెట్‌ఫ్లిక్స్ రూపొందిస్తున్న ఈ సెటైరికల్ వెబ్ సిరీస్‌కు ఆర్యన్ ఖాన్ దర్శకుడు. ఇందులో షారుక్ ఖాన్, ఆమిర్ ఖాన్, సల్మాన్ ఖాన్ తదితరులు అతిథి పాత్రల్లో మెరవనున్నారు.



యంగ్ పవన్‌గా..

పవన్‌కల్యాణ్ తనయుడు అకీరా నందన్ వెండితెరపైకి ఎంట్రీ ఇవ్వకున్నా.. మెగా అభిమానులకు బాగా సుపరిచితమే. అప్పుడప్పుడు సోషల్ మీడియాలో అకీరా చేసే వీడియో ఎడిట్స్‌ను మెచ్చుకుని మురిసిపోతుంటారు మెగాభిమానులు. ప్రస్తుతం పవన్ కథానాయకుడిగా 'సాహో' ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో 'ఓజీ' తెరకెక్కుతోంది. ఇందులో పవన్ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌లో అకీరా మెరవనున్నట్లు టాక్.

నటించే సామర్థ్యంతో పాటు కీబోర్డ్ ప్లేయర్‌గానూ అకీరాకు ప్రవేశముంది. దీంతో ఈ సినిమాలో తమ సంగీత బృందంలో అకీరాను చేర్చుకునే ఆలోచనలో ఉన్నట్లు తమన్ తెలిపారు.



ఆర్సీబీ ఇంటికి!

యూపీ రికార్డు స్కోరు ● పోరాడి ఓడిన బెంగళూరు


జార్జియా వోల్ (99 నాటౌట్)

- నాకౌట్‌కు గుజరాత్, ముంబై
- డబ్ల్యూపీఎల్

లఖ్‌నవూ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో పరుగుల వరద పారింది. అటు యూపీ వారియర్స్, ఇటు బెంగళూరు (ఆర్సీబీ) బ్యాటర్లు పోటీపడి భారీషాట్లతో అలరించారు. దరిమిలా మ్యాచ్‌లో 400కుపైగా పరుగులు నమోదయ్యాయి. ఆఖరి ఓవర్ వరకూ మజా పంచిన ఈ పోరులో యూపీ వారియర్స్ మహిళలు 12 పరుగులతో నెగ్గారు. ఇప్పటికే ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన యూపీ విజయంతో టోర్నీని ముగించింది. మరోవైపు చావోరేవో తేల్చుకోవాల్సిన ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంప్ బెంగళూరు అద్భుతంగా పోరాడినా నిరాశ తప్పలేదు. దాంతో 7 మ్యాచుల్లో రెండే గెలిచిన స్మృతీ మంధాన సేన (4 పాయింట్లు) కూడా నాకౌట్‌కు చేరకుండానే వెనుదిరిగింది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత యూపీ 20 ఓవర్లలో 225/5తో డబ్ల్యూపీఎల్ చరిత్రలో భారీ స్కోరు చేసింది. టాపార్డర్ బ్యాటర్లు జార్జియా వోల్ (99 నాటౌట్), కిరణ్ నవ్‌గిరే (46), గ్రేస్ హ్యారిస్ (39) సత్తా చాటారు. రికార్డు ఛేదనలో బెంగళూరు 19.3 ఓవర్లలో 213 రన్స్‌కు ఆలౌటైంది. రిచా ఘోష్ (33 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సలతో 69), ఎలిస్ పెర్రీ (28), సబ్బినేని మేఘన (27), స్నేహ్ రాణా (26) ధనాధన్ ఇన్నింగ్స్‌తో అలరించారు. జార్జియా ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచింది. ఇక..టేబుల్ టాపర్ ఢిల్లీ ఇంతకుముందే ప్లేఆఫ్స్‌కు చేరగా..శనివారం నాటి మ్యాచ్ ఫలితంతో గుజరాత్, ముంబై ప్లేఆఫ్స్ బెర్త్‌లు ఖరారయ్యాయి.

సంక్షిప్త స్కోర్లు
యూపీ: 20 ఓవర్లలో 225/5 (జార్జియా వోల్ 99 నాటౌట్, కిరణ్ 46, హ్యారిస్ 39, వేర్‌హమ్ 2/43).
బెంగళూరు: 19.3 ఓవర్లలో 213 ఆలౌట్ (రిచా 69, పెర్రీ 28, మేఘన 27, రాణా 26, ఎకిల్‌స్టోన్ 3/25, దీప్తీ 3/50, హెన్రీ 2/39).

ఫిట్ ఇండియాలో భాగమవ్వండి



కేంద్ర క్రీడా మంత్రి మన్‌సుఖ్ మాండవ్య

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రధాన మంత్రి మోదీ ప్రారంభించిన ఫిట్ ఇండియా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగమవ్వాలని కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవ్య కోరారు. శనివారం అంతర్జాతీయ మహిళల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ శివార్లలోని కన్హా ఆశ్రమంలో నిర్వహించిన సైకిల్ ర్యాలీలో మాండవీయ, జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, పారా ఒలింపియన్ జీవాంజి దీప్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాండవ్య మాట్లాడుతూ.. క్రీడల్లో మహిళల ప్రాతినిథ్యం పెరుగుతుండడం శుభ పరిణామన్నారు. సైక్లింగ్‌ను దినచర్యలో భాగం చేసుకుంటే ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చునని చెప్పారు.

దాదాపు పాతికేళ్ల క్రితం నాటి సంగతి.. 2000, అక్టోబరు 15న కెన్యాలో చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్. అప్పటిదాకా ఓటమన్నదే లేని భారత్‌ను నేలకు దించుతూ న్యూజిలాండ్ టైటిల్ ఎగరేసుకుపోయింది. మళ్లీ ఇన్నాళ్లకు అవే జట్లు అదే ట్రోఫీ కోసం సమర భేరి మోగిస్తున్నాయి. తాజా టోర్నీలోనూ టీమిండియాకు పరాజయమే లేదు. మరి.. అదే జోరును తుది పోరులోనూ చూపి ప్రత్యర్థిపై రోహిత్‌సేన ప్రతీకారం తీర్చుకుంటుందా? లేదంటే సరైన సమయంలో దెబ్బతీసే అలవాటున్న కివీస్ ఆధిపత్యం చాటుతుందా? విజేత ఎవరో నేడు తేలనుంది.



అదరాలి ఫైనల్ పంచ్

జోరు మీదున్న భారత్

మధ్యాహ్నం 2.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

న్యూజిలాండ్‌తో టైటిల్ పోరు నేడే
స్పిన్నర్లు కీలకం ● చాంపియన్స్ ట్రోఫీ


కేన్, శాంట్నర్



దుబాయ్: ఎనిమిదేళ్ల తర్వాత జరుగుతున్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ (సీటీ) ఆఖరి అంకానికి చేరింది. ఆదివారం జరిగే ఫైనల్లో న్యూజిలాండ్‌ను భారత్ ఎదుర్కొనబోతోంది. టీమిండియాకిది వరుసగా మూడో సీటీ ఫైనల్. కాగా, టోర్నీలో ఇప్పటిదాకా భారత్ రెండుసార్లు విజేతగా నిలిచింది. 2013లో భారత్ చివరి సారి గెలిచింది. ఇక తాజా టోర్నీలో బంగ్లాదేశ్, పాకిస్థాన్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియాపై గెలిచి రోహిత్ సేన పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉంది. అటు కివీస్ కూడా గ్రూప్ దశలో భారత్ చేతిలో మాత్రమే ఓడింది. దీనికితోడు 2000లో భారత్‌పైనే గెలిచి తమ ఏకైక టైటిల్ దక్కించుకోవడం కివీస్‌కు సానుకూలాంశం. అలాగే ఐసీసీ నాకౌట్ మ్యాచ్‌ల్లోనూ భారత్‌పై 3-1తో కివీస్ జట్టే ఆధిక్యంలో ఉంది. అందుకే భారత్ ఏమాత్రం అలసత్వం ప్రదర్శించినా కప్ చేజారుతుంది.

కొండంత అండగా స్పిన్నర్లు: స్టార్ పేసర్ బుమ్రా లేని లోటును ఏమాత్రం తెలియనీయకుండా భారత జట్టు చాంపియన్స్ ట్రోఫీలో అదరగొడుతోంది. దీనికి కారణం జట్టులోని నలుగురు స్పిన్నర్లే. కుడి-ఎడమ కాంబినేషన్‌లో వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్ ప్రత్యర్థి బ్యాటర్లను తమ ఉచ్చులో బిగిస్తున్నారు. కివీస్‌తో గ్రూప్ మ్యాచ్‌లో వరుణ్ చేసిన మాయాజాలం చూశాం. అయితే గత రెండు మ్యాచ్‌ల్లో కుల్దీప్ పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. అతడి స్థానంలో పేసర్లు హర్షిత్ లేక అర్ష్‌దీప్‌లలో ఒకరికి చోటిస్తారా? అన్నది చూడాలి. అటు కుడి చేతి వాటం బ్యాటర్లపై జడేజా, అక్షర్ ప్రభావం చూపుతున్నారు. అలాగే మధ్య ఓవర్లలో కచ్చితమైన లెంగ్త్‌తో కట్టడి చేస్తున్నారు. కివీస్, ఆసీస్‌పైనా నలుగురు స్పిన్నర్లతో బరిలోకి దిగి ఫలితం రాబట్టారు. అందుకే ఈ ఫైనల్లోనూ ఈ వ్యూహంలో మార్పుండకపోవచ్చు. పేసర్లు షమి, హార్దిక్ పవర్‌ప్లేలో పరుగులను నియంత్రించాలనుకుంటున్నారు. అయితే షమి నుంచి పూర్తి స్థాయి బౌలింగ్ ప్రదర్శన రావాల్సి ఉంది.

సమ ఉజ్జీగా ..

కివీస్ జట్టులోనూ సమర్థులైన స్పిన్నర్లు కలిగి ఉన్నారు. సెమీస్‌లో దక్షిణాఫ్రికాను ఏడు వికెట్లతో వణికించారు. కెప్టెన్ శాంట్నర్ బంతుల్లో పరుగులు సాధించడం అంత సులువు కాదు. ఈ లెఫ్టామ్ స్పిన్నర్ ఖాతాలో 4.85 ఎకానమీ రేటుతో 7 వికెట్లున్నాయి. అతడికి తోడు బ్రేస్‌వెల్, రచిన్, ఫిలిప్స్ దుబాయ్ పిచ్‌పై రాణించేందుకు సిద్ధంగా ఉన్నారు. గతేడాది స్పిన్ బలంతోనే ఈ జట్టు భారత్‌పై టెస్టు సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన విషయం మర్చిపోరాదు. అయితే భారత్‌పై ఐదు వికెట్లతో రాణించిన పేసర్ హెన్రీ గాయం కారణంగా ఆడడం కష్టమే. సెమీస్‌లో దక్షిణాఫ్రికాపై 362 పరుగులు సాధించి బ్యాటర్లు సైతం ఊపు మీదున్నారు. రచిన్, విలియమ్సన్ శతకాలు.. మిచెల్, ఫిలిప్స్‌ల మెరుపు ఇన్నింగ్స్‌లతో సఫారీలు చిత్తుగా ఓడారు. ఇక వీరి ఫీల్డింగ్ ప్రత్యర్థి జట్లను వణికిస్తుంటుంది. అందుకే అన్ని విభాగాల్లో జోరు మీదున్న కివీస్‌ను భారత్ తమ స్థాయికి తగ్గ ఆటతీరుతో అడ్డుకోవాల్సి ఉంటుంది.

పిచ్: భారత్ ఇప్పటిదాకా నాలుగు పిచ్‌లపై ఆడింది. అయితే ఫైనల్‌కు మాత్రం పాక్‌తో ఆడిన పిచ్‌ను సిద్ధం చేయనున్నారు. ఆ మ్యాచ్ జరిగి రెండు వారాలైంది కాబట్టి తాజాగా ఉంటుందని క్యూరేటర్ చెబుతున్నాడు. ఇక్కడ తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ సులువైనా ఆ తర్వాత ఛేదన కష్టంగా మారింది. స్పిన్నర్లకే కాకుండా ఈ వికెట్ పేసర్లకు కూడా అనుకూలించనుంది.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, విరాట్, శ్రేయాస్, అక్షర్, రాహుల్, హార్దిక్, జడేజా, కుల్దీప్, షమి, వరుణ్ చక్రవర్తి.
న్యూజిలాండ్: యంగ్, రచిన్, విలియమ్సన్, లాథమ్, మిచెల్, ఫిలిప్స్, బ్రేస్‌వెల్, శాంట్నర్ (కెప్టెన్), జేమిసన్, ఓరౌర్కీ, హెన్రీ/స్మిత్.

చాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక పరుగులు సాధించిన క్రిస్ గేల్ (791) రికార్డును అధిగమించేందుకు విరాట్ కోహ్లీ 46 పరుగుల దూరంలో ఉన్నాడు.

'ఆఖరాట'లో మురిపిస్తారా?

వెటరన్ స్టార్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలకు ఇదే చివరి ఐసీసీ టోర్నీగా క్రికెట్ పండితులు విశ్లేషిస్తున్నారు. దీంతో ఫైనల్లో ఆ ఇద్దరిపై అందరి దృష్టి నెలకొంది. గతేడాది టీ20 వరల్డ్‌కప్ అందించినట్టుగానే ఈసారి మరో ఐసీసీ ట్రోఫీతో మురిపించాలని రోహిత్, కోహ్లీ పట్టుదలగా ఉన్నారు. విరాట్ టోర్నీలో తన ఫామ్‌ను చాటుకుంటూ అభిమానులను ఖుషీ చేస్తున్నాడు. అయితే, పిచ్‌లు విభిన్నంగా ఉండడంతో ఈ టోర్నీలో అతడి ఆటలో మునుపటి వేగం కనిపించడం లేదు. దీంతో ఫైనల్లో ఆ లోటును తీరుస్తూ కివీస్‌పై కోహ్లీ విరుచుకుపడాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఇక రోహిత్ ఉన్న కాసేపు ఎడాపెడా షాట్లు బాదేస్తున్నా, నిలకడ లోపిస్తోంది. టోర్నీలో అతడి అత్యధిక స్కోరు 41 మాత్రమే. రోహిత్ 20 ఓవర్ల వరకు కుదురుకోగలిగినా భారత్‌కు భారీస్కోరు ఖాయం. మరోవైపు ఓపెనర్ గిల్, శ్రేయాస్, అక్షర్, రాహుల్, హార్దిక్ ఊపు మీదున్నారు. మరోసారి కలిసికట్టుగా ఆడితే ట్రోఫీ భారత్‌దే.

రూ. 5 వేల కోట్ల బెట్టింగ్‌లు..!

న్యూఢిల్లీ: భారత్-కివీస్ ఫైనల్ మ్యాచ్‌పై భారీగా బెట్టింగులు కడుతున్నారు. దుబాయ్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌పై సుమారు రూ. 5 వేల కోట్ల బెట్టింగ్‌లు పెట్టినట్టు సమాచారం. ఇందుకోసం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బుకీలు దుబాయ్‌లో వాలిపోయినట్టు తెలుస్తోంది. ఈ బిగ్ బెట్టింగ్ రాకెట్ వెనుక డి-కంపెనీ ఉన్నట్టు సమాచారం. కాగా, ఎక్కువ మంది బుకీలు భారత్‌ను ఫేవరెట్‌గా భావిస్తున్నారట. ఈ మేరకు రోహిత్ సేనపైనే ఎక్కువగా పందాలు కాస్తున్నారట.

విరాట్‌కు గాయం..?

ప్రాక్టీస్ సెషన్‌లో విరాట్ కోహ్లీ మోకాలికి గాయం కావడం ఆందోళన కలిగిస్తోంది. బ్యాటింగ్ సమయంలో పేసర్ బంతి బలంగా తాకింది. దీంతో బాధతో విలవిల్లాడిన విరాట్‌కు ఫిజియో చికిత్స అందించాడు. మోకాలికి స్ప్రే చేయడంతో పాటు బ్యాండేజి కట్టారు. ఆ తర్వాత కోహ్లీ ప్రాక్టీస్‌కు దూరంగా ఉన్నాడు. అయితే గాయంపై ఆందోళన అనవసరమని, విరాట్ ఫైనల్ ఆడతాడని జట్టు వర్గాలు తెలిపాయి.

'టాప్స్'లో 13 మంది తెలుగు అథ్లెట్లకు చోటు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): టార్గెట్ ఒలింపిక్స్ పోడియం పథకం (టాప్స్)లో తెలుగు రాష్ట్రాల నుంచి 13 మంది క్రీడాకారులకు చోటు దక్కింది. కేంద్ర క్రీడాశాఖ ఆధ్వర్యంలో జరిగే టాప్స్‌లో కోర్ బృందంలో 42 మంది, పారా కోర్ గ్రూప్‌లో 52 మంది, డెవలప్‌మెంట్ గ్రూప్‌లో 112 మందికి మొత్తంగా 206 మంది ప్లేయర్లకు చోటు లభించింది. కోర్ గ్రూప్‌లోని క్రీడాకారులకు నెలకు రూ.50 వేలు, డెవలప్‌మెంట్ గ్రూప్ అథ్లెట్లకు నెలకు రూ.25 వేలు చొప్పున ఉపకార వేతనంగా అందనుంది. కోర్ గ్రూప్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి షట్లర్లు సింధు, సాత్విక్ సాయిరాజ్, పుల్లెల గాయత్రి, ఆర్చర్ ధీరజ్, బాక్సర్ నిఖత్ జరీన్, షూటర్ ఇషా సింగ్, టీటీ ప్లేయర్ శ్రీజ ఉన్నారు. డెవలప్‌మెంట్ గ్రూప్‌లో ఏపీ నుంచి ఆర్చర్ జ్యోతి సురేఖ, స్ప్రింటర్ యర్రాజీ జ్యోతి, పారా అథ్లెట్ రొంగలి రవి, తెలంగాణ తరఫున అథ్లెట్ నందిని, పారా అథ్లెట్ జీవాంజి దీప్తి, షూటర్ కెనాన్ చినాయ్‌లకు చోటు దక్కింది.


శౌర్యకు డబుల్స్ టైటిల్



హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) జే30 టోర్నీలో హైదరాబాద్ కుర్రాడు శౌర్య సామల డబుల్స్ విజేతగా నిలిచాడు. తమిళనాడులోని మదురైలో జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో శౌర్య/హృతిక్ కటకం జోడీ 6-3, 7-6 (8-6)తో ఆరవ్ చావ్లా/ప్రకాశ్ శరణ్ జంటను ఓడించింది.

బిజినెస్ ప్లస్

అప్పు చేసి తిరిగి చెల్లించకపోతే క్రెడిట్ స్కోర్ దెబ్బతింటుందన్న విషయం తెలిసిందే. కానీ, ఇంతవరకు రుణం తీసుకోకపోయినా మీ క్రెడిట్ స్కోర్ చాలా తక్కువగా ఉందా..? అందుకు కారణాలేంటో తెలుసుకుందాం..



అప్పు చేయకపోయినా క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉందా?

క్రెడిట్ హిస్టరీ లేకపోవడం

ఇప్పటివరకు మీరు రుణం తీసుకోలేదు, క్రెడిట్ కార్డు కూడా వాడటం లేదనుకోండి.. క్రెడిట్ బ్యూరోల వద్ద మీ డేటా ఉండకపోవడం వల్ల స్కోర్ తక్కువగా ఉండే అవకాశం ఉంది. సాధారణంగా యువతీ యువకులు, విద్యార్థులు, సదా నగదు లేదా డెబిట్ కార్డు ద్వారా చెల్లింపులు చేపట్టే వారి స్కోర్ తక్కువగా ఉంటుంది.

క్రియారహిత క్రెడిట్ కార్డు

మీరు క్రెడిట్ కార్డు తీసుకున్నారు. కానీ దాన్ని వినియోగించకపోతే మీ రుణ నిర్వహణ తీరుపై క్రెడిట్ బ్యూరోలకు సమాచారం ఉండదు. కాబట్టి, క్రియారహిత క్రెడిట్ కార్డు కారణంగా మీ స్కోర్ తగ్గకపోయినప్పటికీ పెరగడం మాత్రం జరగదు.

రుణ తిరస్కరణ

మీరు గతంలో క్రెడిట్ కార్డు లేదా వ్యక్తిగత రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ, ఆ దరఖాస్తు తిరస్కరణకు గురైన పక్షంలోనూ క్రెడిట్ స్కోర్ తగ్గుతుంది. అయినప్పటికీ, అది తాత్కాలికమే.

తక్కువ క్రెడిట్ హిస్టరీ

క్రెడిట్ స్కోర్ ఆల్గోరిథమ్స్ సుదీర్ఘ క్రెడిట్ హిస్టరీ కలిగిన వారికి ప్రాధాన్యమిస్తాయి. మీరు ఈ మధ్య కాలంలోనే క్రెడిట్ కార్డు లేదా ఏదైనా రుణ సాధనాన్ని తీసుకున్నారనుకోండి.. తొలుత మీ స్కోర్ తక్కువగానే ఉంటుంది. ఆపై మీ రుణ నిర్వహణ తీరును బట్టి స్కోర్ పెరగడం లేదా తగ్గడం జరుగుతుంది.

క్రెడిట్ నివేదికలో తప్పులు

ఇతర వ్యక్తుల వ్యక్తిగత రుణం లేదా ఆలస్య చెల్లింపుల వివరాలు పొరపాటున మీ క్రెడిట్ రిపోర్టులో చేర్చిన పక్షంలోనూ స్కోర్ తగ్గే ప్రమాదం ఉంది.

క్రెడిట్ మిక్స్ లేకపోవడం

సాధారణంగా ఒకే రుణ సాధనం కలిగిన వారి స్కోర్ తక్కువగానే ఉంటుంది. క్రెడిట్ కార్డు, వ్యక్తిగత రుణం.. ఇలా భిన్న రుణ సాధనాలను ఉపయోగించుకోవడంతో పాటు వాటి నిర్వహణ తీరు బాగుంటే భవిష్యత్‌లో స్కోర్ పెరిగేందుకు అవకాశం ఉంటుంది.

క్రెడిట్ కార్డు పరిమితిలో 30 శాతానికి మించి వినియోగం

మీకు క్రెడిట్ కార్డు ఉంటే, తరచుగా దాని పరిమితిలో 30 శాతానికి మించి వినియోగించుకుంటున్నట్లయితే, సకాలంలోనే బిల్లు చెల్లించినప్పటికీ క్రెడిట్ స్కోర్ తగ్గుతుంది. ఎందుకంటే, మీరు జీవితంలో రుణాలపైనే అధికంగా ఆధారపడుతున్నారడానికి అది సంకేతం.

జాయింట్ అకౌంట్స్

ఇతర వ్యక్తి రుణానికి మీరు సహ-సంతకందారు లేదా హామీదారుగా ఉన్నట్లయితే, ఆ వ్యక్తి రుణం చెల్లింపులో విఫలమైతే తనతో పాటు మీ క్రెడిట్ స్కోర్ కూడా తగ్గుతుంది.

సామ్కో లార్జ్ క్యాప్ ఫండ్

సామ్కో అసెట్ మేనేజ్‌మెంట్.. లార్జ్ క్యాప్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది లార్జ్ క్యాప్ స్టాక్స్‌ల్లో పెట్టుబడులు పెట్టే ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. సామ్కో ప్రొప్రైటరీ వ్యూహమైన 'కేర్' రూపొందించిన 100 లార్జ్ క్యాప్ కంపెనీల్లో ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేస్తుంది. మార్కెట్ ఆటుపోట్లను తట్టుకుంటూ ఎప్పటికప్పుడు పెట్టుబడుల వ్యూహాలను మార్చుకోవటం ఈ ఫండ్ ప్రత్యేకత. ఈ ఫండ్‌కు నిఫ్టీ 100 టోటల్ రిటర్న్ ఇండెక్స్ బెంచ్‌మార్క్‌గా ఉండనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.5,000. సిప్ రూపంలో అయితే కనీసం రూ.500. ముగింపు తేదీ ఈ నెల 19.

బంధన్ డెట్ ఇండెక్స్ ఫండ్

బంధన్ మ్యూచువల్ ఫండ్.. క్రిసిల్-ఐబీఎక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 3-6 నెలల డెట్ ఇండెక్స్ ఫండ్‌ను తీసుకువచ్చింది. స్వల్పకాలంలో ఫిక్స్‌డ్ ఆదాయం అందించే విధంగా ఈ ఫండ్‌ను రూపొందించింది. మూడు నుంచి ఆరు నెలల్లో మెచ్యూర్ అయ్యే ఏఏఏ- రేటెడ్ సర్టిఫికెట్స్ ఆఫ్ డిపాజిట్స్, కమర్షియల్ పేపర్స్, బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, ఆర్థిక సంస్థలు జారీ చేసిన కార్పొరేట్ బాండ్స్‌ల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెడుతుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ 11.

'బీమా'పై జర జాగ్రత్త

పొరపాట్లు చేస్తే తిప్పలే

ప్రతి వ్యక్తి ఆర్థిక ప్రణాళికలో బీమా ఒక భాగం. అనుకోని సంఘటనలు ఏమైనా జరిగితే, పాలసీకి అనుగుణంగా ఆ ఖర్చులను బీమా కంపెనీ చెల్లిస్తుంది. దీనివల్ల మన పొదుపు మొత్తాలపై ప్రభావం పడదు. అయితే బీమా కంపెనీల ఏజెంట్లు చెప్పే పదజాలం అందరికీ అర్థం కాదు. చాలా మంది ఏజెంట్లు కూడా ఎంతసేపటికి ఏదోలా తమ పాలసీలు అంటగట్టేందుకు ప్రయత్నిస్తారే తప్ప ఆ పాలసీల పూర్తి వివరాలను పాలసీదారులకు అర్థమయ్యేలా చెప్పరు. ఈ పొరపాటు చివరికి పాలసీదారుల కొంప ముంచుతుంటాయి. అందుకే బీమా పాలసీలు తీసుకునేటప్పుడే అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. పాలసీ తీసుకునే సమయంలో పొరపాట్లు చేయకుండా ఏయే జాగ్రత్తలు తీసుకుంటే మంచిదో తెలుసుకుందాం.



అవసరం మేరకే పాలసీ

బీమా పాలసీ తీసుకునే ముందే మన అవసరాలు ఏమిటో స్పష్టంగా ఆలోచించుకోవాలి. ఆరోగ్య బీమా పాలసీల విషయంలో ఇది మరింత అవసరం. మెట్రో నగరాల్లో ఇవాళ ఏ చిన్న ఆస్పత్రికి వెళ్లినా ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి వ్యక్తి కనీసం రూ.25 లక్షల కవరేజీ ఉండేలా ఆరోగ్య బీమా పాలసీ తీసుకోవాలి. లేకపోతే భవిష్యత్ కోసం దాచుకున్న నాలుగు రాళ్లూ ఆస్పత్రి ఖర్చులకే హరించుకుపోతాయి. ఆరోగ్య బీమా పాలసీ తీసుకునేటప్పుడు అవసరాలతో పాటు మనం ఉంటున్న ప్రాంతం, కుటుంబ సభ్యుల సంఖ్యను కూడా గుర్తుంచుకోవాలి.

పోల్చి చూసుకోవడం

బీమా పాలసీలు తీసుకునేటప్పుడు పూర్తిగా కంపెనీల ఏజెంట్లు చెప్పే మాటలపైనే ఆధారపడకూడదు. వారు ఎంతసేపటికీ తమ కమీషన్ చూసుకుంటారే తప్ప మీ అవసరాలు పెద్దగా పట్టించుకోరు. పాలసీ తీసుకునే ముందే ఏదైనా తటస్థ చానల్ ద్వారా లేదంటే ఆన్‌లైన్ ద్వారా వివిధ బీమా కంపెనీల పాలసీలను పరిశీలించటంతో పాటు అవి అందించే ప్రయోజనాలను పోల్చి చూసుకోవాలి. మీ బడ్జెట్‌కు అనుగుణంగా ఏ కంపెనీ తక్కువ ప్రీమియంతో సమగ్ర పాలసీ అందిస్తోంది? ఆ కంపెనీ క్లెయిమ్స్ సెటిల్‌మెంట్ నిష్పత్తి ఎలా ఉంది? సరిచూసుకుని మరీ పాలసీని ఎంపిక చేసుకోవాలి.

ఎప్పటికప్పుడు సమీక్ష

మారే జీవితానికి అనుగుణంగా బీమా అవసరాలూ మారుతుంటాయి. హోమ్ ఇన్సూరెన్స్ ఇందుకు ఉదాహరణ. మారే అవసరాలకు అనుగుణంగా ఇంట్లో అదనపు గదులు, వంట గది ఏర్పాటు లేదా నవీకరించాల్సి ఉంటుంది దాంతో ఇంటి విలువా మారుతుంది. ఆ మారిన విలువకు అనుగుణంగా పాలసీ కవరేజీ పెంచుకోవాలి. అలాగే ఆ మార్పులను బీమా కంపెనీకి తెలియజేయాలి. లేకపోతే ఏదైనా ప్రమాదం జరిగి క్లెయిమ్ చేయాల్సి వచ్చినపుడు సమస్యలు ఎదురవుతాయి.

కవరేజీ ముఖ్యం

చాలా మంది ప్రీమియం భారం తగ్గించుకునేందుకు తక్కువ కవరేజీతో సరిపెడుతుంటారు. ఇది ఏ మాత్రం సరికాదు. ముఖ్యంగా ఆరోగ్య, టర్మ్ పాలసీలను మన ఆరోగ్య, ఆర్థిక అవసరాలకు అనుగుణంగా తీసుకోవాలి. తక్కువ ప్రీమియంతో పోతుంది కదాని పెద్దగా కవరేజీ లేని పాలసీలు తీసుకుంటే, జరగరాని అనర్థాలు జరిగినప్పుడు కుటుంబ ఆర్థిక భద్రత కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉంది.

కీలక సమాచారం

మీరు ఇచ్చే వివరాల విశ్వసనీయత ఆధారంగానే బీమా కంపెనీలు మీకు పాలసీలు విక్రయిస్తాయి. కాబట్టి పాలసీ తీసుకునే ముందే ధూమపానం, అప్పటి వరకు మీకు ఉన్న అనారోగ్య సమస్యలు, పాత క్లెయిమ్స్ విషయాన్ని బీమా కంపెనీకి తెలియజేయండి. ప్రీమియం తగ్గుతుంది కదాని మీకున్న పొగ తాగే అలవాటు, ఇప్పటికే ఉన్న వ్యాధుల విషయం దాయవద్దు. అలా దాస్తే భవిష్యత్‌లో ముఖ్యంగా క్లెయిమ్స్ సెటిల్‌మెంట్ సమయంలో సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. ఈ విషయాలు తెలిస్తే బీమా కంపెనీలు పాలసీలను తిరస్కరించే ప్రమాదం కూడా ఉంటుంది.

స్పష్టమైన అవగాహన

మీరు తీసుకోబోయే పాలసీ గురించి మీకు స్పష్టమైన అవగాహన ఉండాలి. అందుకోసం మీరు తీసుకునే పాలసీ కింది ఏ నష్టాలు కవర్ అవుతాయి? ఏవి కావు? మినహాయింపులు, తగ్గింపులు, పాలసీ ప్రయోజనాల గురించి పూర్తిగా చదివి తెలుసుకోవాలి.

క్లెయిమ్ విధానంపై అశ్రద్ధ

బీమా పాలసీ తీసుకోగానే సరిపోదు. క్లెయిమ్ చేసుకోవాల్సిన అవసరం వచ్చినప్పుడు ఎలా క్లెయిమ్ చేసుకోవాలో కూడా తెలిసి ఉండాలి. ఈ క్లెయిమ్ విధానం ఎంత సులభంగా ఉంటే అంత మంచిది. లేకపోతే క్లెయిమ్ కోసం బీమా కంపెనీల చుట్టూ తిరగడానికి లేదా ఉత్తర ప్రత్యుత్తరాలకే పుణ్యకాలం కాస్తా సరిపోతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని క్లెయిమ్ విధానం వీలైనంత సింపుల్‌గా ఉండే కంపెనీల నుంచి పాలసీలు తీసుకోవడం మంచిది.

డెడ్‌లైన్స్ దగ్గర పడుతున్నాయ్..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) ముగింపు దగ్గర పడుతోంది. దీంతో ఈ మార్చి నెలాఖరులోగానే ఈపీఎఫ్‌కు సంబంధించి యూనివర్సల్ అకౌంట్ నంబర్ (యూఏఎన్) యాక్టివేషన్, ఎంప్లాయీ లింక్డ్ ఇన్సెంటివ్ (ఈఎల్ఐ) పథకం, ఎంప్లాయీస్ లింక్డ్ ఇన్సూరెన్స్ (ఈడీఎల్ఐ) పథకం, పన్ను ఆదా పెట్టుబడులు, ప్రత్యేక ఫిక్స్‌డ్ డిపాజిట్లకు సంబంధించి మీ బ్యాంకు ఖాతాలతో మీ ఆధార్ సీడింగ్ పూర్తి చేయాలి. ఆ వివరాలు మీకోసం

ఈపీఎఫ్ యూఏఎన్: ఈఎల్ఐ పథకం కోసం ఈపీఎఫ్ యూఏఎన్, బ్యాంకు ఖాతాలతో ఆధార్ సీడింగ్ యాక్టివేషన్ గడువును ఈపీఎఫ్ఓ ఈ నెల 15 వరకు పొడిగించింది. ఈ అప్‌డేషన్ పూర్తయితే తప్ప ఈపీఎఫ్ఓ అందించే ఈఎల్ఐ పథకం ప్రయోజనాలను ఈపీఎఫ్ చందాదారులు అందుకోలేరు.

బీమా ప్రయోజనాలు: ఈపీఎఫ్ సంస్థ అందించే కొన్ని బీమా ప్రయోజనాలు అందుకోవాలన్నా ఈ నెల 15లోగా ప్రతి ఈపీఎఫ్ సభ్యుడూ తన యూఏఎన్‌ను యాక్టివేట్ చేసుకోవాలి. ఈ పథకం కింద ప్రతి ఈపీఎఫ్ చందాదారుడికీ రూ.7 లక్షల వరకు కవరేజీ లభిస్తుంది.

ఐటీఆర్ ఫైలింగ్/అప్‌డేషన్: గత రెండేళ్లలో మీరు ఫైల్ చేసిన ఐటీ రిటర్న్‌ల్లో పొరపాట్లు దొర్లినా లేదా ఏదైనా ఆదాయాన్ని పేర్కొనక పోయినా ఈ నెలాఖరులోగా ఆ పొరపాట్లను సరిదిద్ది ఈ నెలాఖరులోగా కొత్త ఐటీ రిటర్న్ ఫైల్ చేయవచ్చు.

పన్ను ఆదా పెట్టుబడులు: ఒకవేళ మీరు పాత పన్ను విధానంలో ఉంటే ఈ నెలాఖరులోగా మీ పన్ను ఆదా పెట్టుబడులు పూర్తి చేయాలి. ఎన్‌పీఎస్, ఈపీఎఫ్, పీపీఎఫ్, ఐదేళ్ల కాల పరిమితి ఉండే ట్యాక్స్ సేవింగ్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఈఎల్ఎస్ఎస్ ఈ కోవలోకి వస్తాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



9వ తేదీ			
హైదరాబాద్	410	విజయవాడ	420
వరంగల్	412	గోదావరి	415
చిత్తూరు	443	విశాఖపట్నం	415
		దజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర — **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	63	విజయవాడ	85
వరంగల్	63	గుంటూరు	80
కరీంనగర్	63	ఒంగోలు	80
మహబూబ్‌నగర్	63	చిత్తూరు	72
కర్నూలు	63	నెల్లూరు	77
విశాఖపట్నం	84		
గోదావరి	85	అనంతపురం	77

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	87,710 ▲	80,400 ▲	1,08,100 ▲
విజయవాడ	88,800 ▲	83,300 ▼	98,000 ▼
విశాఖపట్నం	86,100 ▼	78,930 ▼	97,360 ▼
రాజమండ్రి	87,710 ▲	80,400 ▲	99,500 ▲
ప్రొద్దుటూరు	87,900 ▼	81,400 ▼	98,200 ▼
ముంబై	86,059 ▼	78,830 ▲	96,724 ▲

అర్జున్ సన్నాఫ్ వైజయంతి



నందమూరి కల్యాణ్‌రామ్ హీరోగా ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఎన్‌కేఆర్ 21'. అశోక్ వర్ధన్ ముప్పా, సునిల్ బలుసు నిర్మాతలు. ఈ చిత్రంలో ఐపీఎస్ అధికారిగా పవర్‌ఫుల్ పాత్రలో విజయశాంతి నటిస్తున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఈ చిత్రం పేరును యూనిట్ ప్రకటించింది. 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' అనే టైటిల్‌ను నిర్ణయించి, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేసింది. పోస్టర్‌లో కల్యాణ్ రామ్, విజయశాంతి మండుతున్న జ్వాలల మధ్య ధృఢ సంకల్పంతో నడుస్తున్నట్లు కనిపిస్తున్నారు. కాగా, ఈ చిత్రంలో సాయి మంజ్రేకర్ కథానాయికగా, సోహైల్ ఖాన్ విలన్‌గా నటిస్తున్నారు.

సరికొత్త ప్రేమకథను చూస్తారు

- దర్శకుడు విశ్వకరుణ్



కిరణ్ అబ్బవరం నటించిన తాజా చిత్రం 'దిల్‌రుబా' ఈ నెల 14న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర దర్శకుడు విశ్వకరుణ్ శనివారం సినిమా విశేషాలు మీడియాతో పంచుకున్నారు. 'వెస్ట్రన్ కల్చర్ నుంచి మనం సార్, థాంక్స్ అనే మాటల్ని త్వరగా అలవాటు చేసుకున్నాం. తెలుగులో క్షమించమని అడగలేం కానీ సారీ అని మాత్రం ఈజీగా చెప్పేస్తాం. తన తప్పు లేనప్పుడు సారీ ఎందుకు చెప్పాలంటాడు మా హీరో. ఈ సినిమాలో కిరణ్ అబ్బవరం పోషించిన సిద్ధు పాత్ర తన వ్యక్తిత్వం విషయంలో కాంప్రమైజ్ కాదు. దీని వల్ల అతను జీవితంలో ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొన్నాడు, వాటిని ఎలా అధిగమించాడు అన్నదే చిత్ర కథ' అని ఆయన చెప్పారు. ఇటీవల వచ్చిన 'డ్రాగన్' చిత్రానికీ, తమ సినిమాకు సంబంధం లేదని చెబుతూ 'మా మూవీ ట్రీట్‌మెంట్ వేరుగా ఉంటుంది. ప్రేమకథలన్నీ ఒకటే. వాటిని తెరపై చూపించే విధానమే కొత్తగా ఉంటుంది. అటువంటి కొత్త తరహా ప్రేమకథను దిల్ రుబాలో చూస్తారు' అని వివరించారు. 'కిరణ్ అబ్బవరం ఇచ్చిన సపోర్ట్‌ను మరచిపోలేను. నా వర్క్‌లో ఆయన ఎప్పుడూ ఇన్‌వాల్వ్ కాలేదు. కెరీర్‌లో ఎదురు దెబ్బలు తిన్న ఎవరికైనా మంచి సినిమా చేయాలనే భయం ఉంటుంది. అందుకే ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకుంటాం. కిరణ్‌గారు చేసేది అదే. 'క' మూవీ సక్సెస్ తర్వాత మరింత గ్రాండ్‌గా 'దిల్‌రుబా'ను తీసుకురావాలని ఆయన అనుకున్నారు. ఆ క్రమంలో కొన్ని మార్పులు చేశాం కానీ మూల కథలో ఎలాంటి మార్పు చేయలేదు' అని వివరించారు.



చిత్రజ్యోతి
SINCE 1965

తెలుగులోనూ అద్భుతమైన స్పందన

'ఒక చరిత్రను సినిమాగా తీయడం అంత తేలికైన విషయం కాదు. అందుకే 'ఛావా' చిత్రాన్ని రూపొందించిన దర్శకుడు లక్ష్మణ్‌కు ధన్యవాదాలు' అన్నారు నిర్మాత బన్నీవాసు. విక్కీ కౌశల్, రష్మిక నటించిన 'ఛావా' చిత్రాన్ని గీతా ఆర్ట్స్ డిస్ట్రిబ్యూటర్స్ తెలుగులో విడుదల చేసింది. మంచి ఆదరణ దక్కుతున్న సందర్భంగా యూనిట్ శనివారం థాంక్స్ మీట్‌ను నిర్వహించింది. బన్నీ వాసు మాట్లాడుతూ 'ఈ సినిమాను తెలుగులో విడుదల చేసినందుకు గర్వంగా ఉంది. మమ్మల్ని నమ్మి సినిమా ఇచ్చిన దినేశ్‌కు కృతజ్ఞతలు. తెలుగులోనూ 'ఛావా'కు అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఇది పిల్లలకు చూపించాల్సిన సినిమా. ఇది కేవలం సినిమా కాదు.. ఒక ఎమోషన్. ఈ రోజు మనం ఇంత స్వేచ్ఛనీ, స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్నామంటే కారణం ఆ రోజు శంభాజీ మహారాజ్ వంటి మహావీరుల త్యాగ ఫలితమే. మా టీమ్ చాలా బాగా పని చేసింది. రెహమాన్ గారు ఎంతో బిజీగా ఉన్నా నాలుగు రోజుల్లో పాటలు పూర్తి చేశారు' అని చెప్పారు. తెలుగు డబ్బింగ్ డైరెక్టర్ రాఘవ మాట్లాడుతూ 'ఒక సినిమాలా కాకుండా ఎంతో ఎమోషనల్‌గా ఫీలయి, అందరూ పని చేశారు. నాలుగే రోజుల్లో డే అండ్ నైట్ వర్క్ చేసి అద్భుతమైన క్వాలిటీతో డబ్బింగ్ పూర్తి చేశాం' అని చెప్పారు. సినిమాలో మంచి పాత్ర చేసే అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు నటుడు వినీత్‌కుమార్ సింగ్, పాటలు రాసే ఛాన్స్ ఇచ్చిన బన్నీ వాసుకి గీత రచయిత శ్రీమణి కృతజ్ఞతలు తెలిపారు.

అట్టహాసంగా ఐఫా వేడుకలు



ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ (ఐఫా) సిల్వర్ జూబ్లీ వేడుకలు జైపూర్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు షారుక్ ఖాన్, షాహిద్ కపూర్, మాధురీ దీక్షిత్, కరీనా కపూర్, కృతీ సనన్ తదితరులు జైపూర్ చేరుకున్నారు. నటుడు కార్తీక్ ఆర్యన్, దర్శక నిర్మాత కరణ్ జోహార్ ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా వ్యవహరిస్తున్నారు. 'జబ్ వియ్ మెట్' జంట షాహిద్ కపూర్, కరీనా కపూర్ ఈ వేడుకలో ప్రత్యేకాకర్షణగా నిలిచారు. ఈ మాజీ ప్రేమికులిద్దరూ వేదికపై ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. నేడు ఐఫా అవార్డులను విజేతలకు ప్రదానం చేస్తారు. బాలీవుడ్ ఆల్‌టైమ్ క్లాసిక్ చిత్రం 'షోలే' విడుదలై 50 ఏళ్లు అయిన సందర్భంగా ప్రీమియర్ షో ప్రదర్శించి అమితాబ్ బచ్చన్, ధర్మేంద్రలతో పాటు చిత్రబృందాన్ని ఘనంగా సన్మానించనున్నారు.

పూర్తి మహిళా సిబ్బందితో రైలు



రైలు ప్రారంభం సందర్భంగా విశాఖ రైల్వేస్టేషన్‌లో సిబ్బందితో డీఆర్ఎం లలిత్ బొహ్రా, తూర్పు కోస్తా రైల్వే మహిళల సంక్షేమ సంఘం వాల్తేరు డివిజన్ అధ్యక్షురాలు జ్యోత్స్న బొహ్రా

విశాఖపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వాల్తేరు రైల్వే డివిజన్ అధికారులు శనివారం విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం రోడ్ వరకు ఒక రైలును పూర్తిగా మహిళా సిబ్బందితోనే నడిపారు. విశాఖ స్టేషన్‌లో ఈ రైలును తూర్పు కోస్తా రైల్వే మహిళల సంక్షేమ సంఘం వాల్తేరు డివిజన్ అధ్యక్షురాలు జ్యోత్స్న బొహ్రా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం లలిత్ బొహ్రా మాట్లాడుతూ, మహిళలకు అన్ని విభాగాల్లో కీలక బాధ్యతలు అప్పగించే విషయంలో వాల్తేరు డివిజన్ ముందుందని చెప్పారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా మహిళా బృందాలే పనిచేస్తున్నాయని తెలిపారు.

రైతులకు నికరాదాయమే లక్ష్యం

- సాగు ఖర్చులు తగ్గించి, నాణ్యమైన దిగుబడులకు ప్రణాళికలు
- విత్తన ఎంపిక నుంచే అన్నదాతలకు మార్గనిర్దేశం
- శాస్త్రవేత్తలతో వ్యవసాయశాఖ డైరెక్టర్ చర్చలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సాగు ఖర్చులు తగ్గించి, నాణ్యమైన దిగుబడుల ద్వారా రైతులకు నికరాదాయం సమకూరేలా వ్యవసాయశాఖ పంటల వారీగా ప్రణాళికలు అమలు చేయనున్నది. పంటలు సాగులో ఉన్నప్పుడు క్షేత్రస్థాయి అధికారులు పొలం బడి కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ.. విత్తనం ఎంపిక దగ్గర నుంచే రైతులకు సరైన మార్గనిర్దేశం చేయాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు భావిస్తున్నారు. ఇందుకోసం వివిధ పంటల సాగులో ఎదురవుతున్న సమస్యలపై ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు, అధికారులతో ఆయన చర్చిస్తున్నారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, ఇతరత్రా సాగు ఖర్చులు తగ్గించి, నాణ్యమైన అధిక ఉత్పత్తులు సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కసరత్తు చేస్తున్నారు. సన్న బియ్యంసాగుపై ఇటీవల వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. ఆహార వినియోగదారుల ప్రాధాన్యత, ఎగుమతులకు అనువైన వరి రకాల సాగుపై చర్చించారు. మార్కెట్‌లో డిమాండ్ లేని రకాల సాగును తగ్గించేసి, సన్నరకాలను పండించేలా రైతులకు అవగాహన కల్పించాలని నిర్ణయించారు. తాజాగా మినుము, కంది, పుల్లశనగ(బెంగాళీగ్రామ్)పై విడివిడిగా చర్చాగోష్టులు నిర్వహించారు. జొన్న, మొక్కజొన్న, తృణ, చిరుధాన్యాలు, పత్తి తదితర పంటలపైనా త్వరలో చర్చించనున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. చీడపీడలు తట్టుకుని, నాణ్యమైన అధిక ఉత్పత్తి ఇచ్చే విత్తనాలను ఎంపిక చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే, వ్యవసాయ రంగంలో సాంకేతికతను జోడించాలని ఇటీవల వ్యవసాయశాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. డ్రోన్లు, ఉపగ్రహాలు, డీప్‌టెక్ సాంకేతిక వినియోగం పెం చాలని సూచించారు. దీంతో పంటలకు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకుని, సమస్యలను అధిగమించేలా రైతులకు అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులతో డిల్లీరావు చర్చిస్తున్నారు. త్వరలో 875 కిసాన్ డ్రోన్లు రైతులకు అందుబాటులోకి రానుండగా, ఈఏడాది మరో వె య్యి వ్యవసాయ యాంత్రీకరణ కేంద్రాల ఏర్పాటుకుప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. దీంతో వ్యవసాయ పంటల్లో ఎరువులు, క్రిమిసంహారక మందుల పిచికారి, పంట కోతలో యాంత్రీకరణ ఆవశ్యకత, పంట ఉత్పత్తుల శుద్ధీకరణపైనా రైతులు దృష్టి సారించేలా అవగాహన కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో శాఖల వారీగా సదస్సులు నిర్వహించాలని సీఎం చంద్రబాబు నిర్ధేశించడంతో అధికారులు ఆ దిశగా సిద్ధమవుతున్నారు.



ఢిల్లీలో శనివారం పురస్కారం అందుకుంటున్న పెనుగొండ లక్ష్మీనారాయణ

కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్న పెనుగొండ

న్యూఢిల్లీ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ తెలుగు రచయిత పెనుగొండ లక్ష్మీనారాయణ కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. శనివారం ఢిల్లీలోని కమానీ ఆడిటోరియంలో లక్ష్మీనారాయణకు అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ పురస్కారాన్ని అందజేశారు. దేశ వ్యాప్తంగా 21 భాషలకు గాను కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలు ప్రదానం చేశారు. పురస్కారంలో భాగంగా లక్ష రూపాయల నగదుతోపాటు రజత పతకం ఆయనకు లభించింది. దీపిక అభ్యుదయ వ్యాస సంపుటికి గాను ఆయన ఈ పురస్కారాన్ని దక్కించుకున్నారు. పెనుగొండ లక్ష్మీనారాయణ తెలుగు సాహిత్య రంగంలో విశేష కృషి జరిపారని, అనేక గ్రంథాలు రచించారని సాహిత్య అకాడమీ ప్రశంసా పత్రంలో పేర్కొన్నారు. పెనుగొండ 1954లో పల్నాడు జిల్లాలో జన్మించారు. న్యాయవాదిగా పని చేస్తున్నారు. 1974 నుంచి అభ్యుదయ రచయితల సంఘం కార్యకర్తగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. సుమారు 200కి పైగా సాహిత్య వ్యాసాలు రాసిన పెనుగొండ పలు ఇతర పురస్కారాలనూ అందుకున్నారు.

లోక్ అదాలత్‌లకు విశేష స్పందన

- రాష్ట్రవ్యాప్తంగా ఒక్కరోజే 49,056 కేసుల పరిష్కారం

అమరావతి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లకు విశేష స్పందన లభించింది. ఒక్కరోజే 49,056 కేసులు పరిష్కారమయ్యాయి. మొత్తం రూ.32.60 కోట్ల పరిహారం అందజేశారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, ఏపీ న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వహణ అధ్యక్షుడు జస్టిస్ ఎస్.రవినాథ్ తిల్హరి, హైకోర్టు న్యాయసేవల కమిటీ అధ్యక్షుడు జస్టిస్ ఆర్.రఘునందనరావు మార్గదర్శకంలో రాష్ట్రవ్యాప్తంగా న్యాయస్థానాలో 343 లోక్ అదాలత్ బెంచ్‌లు నిర్వహించారు. ఇరువర్గాల ఆమోదంతో రాజీకి అవకాశం ఉన్న కేసులను పరిష్కరించారు. మరోవైపు హైకోర్టు న్యాయసేవల కమిటీ ఆధ్వర్యంలో హైకోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన లోక్‌అదాలత్‌లో న్యాయమూర్తులు జస్టిస్ అవధానం హరిహరనాథశర్మ, జస్టిస్ వై.లక్ష్మణరావు పాల్గొన్నారు. పెండింగ్‌లో ఉన్న 125 కేసులు పరిష్కరించి, రూ.2 కోట్ల పరిహారం అందజేశారు. లోక్ అదాలత్‌ల విజయవంతానికి సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులు, అధికారులకు న్యాయసేవాధికార సంస్థ సభ్యకార్యదర్శి ఎం.బబిత, హైకోర్టు న్యాయసేవల కమిటీ కార్యదర్శి జి.మాలతి కృతజ్ఞతలు తెలిపారు.

కోడెలపై తప్పుడు కేసు పెట్టా

- విజయసాయి, గోపిరెడ్డి ఒత్తిడితోనే చేశా
- ఆంధ్ర రంజీ మాజీ క్రికెటర్ నాగరాజు



నాగరాజు

నరసరావుపేట లీగల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి, నరసరావుపేట వైసీపీ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఒత్తిడి చేసి తనతో మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు, ఆయన కుమారుడు డాక్టర్ కోడెల శివరామ్‌లపై తప్పుడు కేసు పెట్టించారని ఆంధ్ర రంజీ మాజీ క్రికెటర్ నాగరాజు వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా పొలాకి మండలం ఏవ్వారిపేట గ్రామానికి చెందిన ఆయన ఈ కేసును కోర్టులో రాజీమార్గం ద్వారా పరిష్కరించుకున్నారు. అనంతరం కోర్టు ఆవరణలో మీడియాతో మాట్లాడారు. 2019లో కోడెల శివప్రసాదరావు, కోడెల శివరామ్‌లు తన వద్ద నుంచి 15 లక్షల రూపాయలు లంచం తీసుకున్నట్లు కేసు పెట్టాలని వైసీపీ నేతలు తీవ్రంగా ఒత్తిడి తెచ్చారన్నారు. కేసు పెట్టకపోతే రంజీ క్రికెట్ టీమ్‌లో ఆడే అవకాశం తనకు కల్పించబోమని ఆనాడు విజయసాయిరెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి బెదిరించారని తెలిపారు. దీంతో తాను భయపడి తప్పుడు కేసు పెట్టానని వెల్లడించారు. తాను కోడెల కుటుంబంపై చేసిన ఫిర్యాదులో ఎలాంటి వాస్తవం లేదన్నారు.

ఏప్రిల్ 8, 9 తేదీల్లో గుజరాత్‌లో ఏఐసీసీ సమావేశాలు

- కీలక నిర్ణయాలు తీసుకోనున్న అధిష్ఠానం: గిడుగు

రాజమహేంద్రవరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 8, 9 తేదీల్లో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఏఐసీసీ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఏఐసీసీ వర్కింగ్ కమిటీ సభ్యుడు గిడుగు రుద్రరాజు వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఏపీలో పార్టీ అనుసరించాల్సిన విధానాలపై కీలక నిర్ణయాలు తీసుకుంటారన్నారు. అన్ని కమిటీలను ప్రక్షాళన చేసి ప్రజాక్షేత్రంలో చురుకుగా పనిచేసే విధంగా నిర్ణయాలు ఉంటాయన్నారు. గుజరాత్, బిహార్ ఎన్నికల మీద తమ అధినేత రాహుల్ దృష్టి పెట్టారని గిడుగు తెలిపారు.

బీఈడీ ప్రశ్నపత్రం లీకేజీ వెనుక ఒడిసా ఏజెంట్లు

- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు

పెదకాకాని, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బీఈడీ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంలో ముగ్గురు నిందితులను పెదకాకాని పోలీసులు శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ప్రశ్నపత్రం లీకేజీ ఘటన వెలుగులోకి రాగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం ఆ రోజు రాత్రి పెదకాకాని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీఈడీ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం 70082 12851 మొబైల్ నంబరు ద్వారా జరిగిందని సమాచారం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన పెదకాకాని పోలీసులు ఒడిశాకు చెందిన ధీరెన్ కుమార్ సాహూ అనే బీఈడీ విద్యార్థిని శుక్రవారం రాత్రి తెనాలిలోని ఓ లాడ్జిలో అదుపులోకి తీసుకున్నారు. రిజిస్ట్రార్ ఫిర్యాదులో పేర్కొన్న మొబైల్ నంబరు అతను వాడుతున్నట్లు గుర్తించారు. పోలీసుల విచారణలో ఒడిశాకు చెందిన గణేష్ సీహెచ్ సాహూ, మిలాన్ ప్రుస్తి అనే విద్యార్థులకు కూడా ఇందులో ప్రమేయం ఉందని తేలింది. దీంతో వారిద్దరినీ కూడా అదుపులోకి తీసుకుని విచారించారు. ఒడిశాకు చెందిన కొందరు ఏజెంట్ల రూపంలో ఆ రాష్ట్రంలోని విద్యార్థులకు ఏపీలోని ఏఎన్‌యూతోపాటు పలు యూనివర్సిటీలలో అడ్మిషన్ ఇప్పించడంతోపాటు వారిని ప్రాక్టికల్, థియరీ పరీక్షల్లో పాస్ చేయించడం వంటి పనులన్నీ చక్కబెడుతున్నట్టు తెలుస్తోంది. దీని కోసం లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. నిందితుల నుంచి పోలీసులు కీలక సమాచారం రాబట్టినట్టు తెలుస్తోంది.

స్వర్ణంతో చాంపియన్ ట్రోఫీ కప్

» బంగారంతో వికెట్లు, బాల్, బ్యాట్ రూపొందించిన ఐలవరం స్వర్ణకారుడు





బంగారు చాంపియన్ ట్రోఫీ కప్, వికెట్లు, బ్యాట్, బాల్.. (ఇన్‌సెట్) వీరేంద్ర

భట్టిప్రోలు(కొల్లూరు), మార్చి 8(ఆంధ్రజ్యోతి): చాంపియన్ ట్రోఫీ ఫైనల్లో భారత్ గెలుపొందాలని ఓ స్వర్ణకారుడు ట్రోఫీకి సంబంధించిన కప్, బాల్ బ్యాట్, వికెట్లు బంగారంతో రూపొందించాడు. ఆదివారం ఇండియా-న్యూజిలాండ్ మధ్య ఫైనల్ మ్యాచ్ జరగనుండటంతో భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామానికి చెందిన మాచర్ల వీరేంద్రకుమార్ 1.060 గ్రాముల బంగారంతో కప్, బ్యాట్, బాల్, వికెట్లు తయారు చేశారు. ఫైనల్ మ్యాచ్ సందర్భంగా ఆదివారం తాను రూపొందించిన వస్తువులను ఆవిష్కరించనున్నట్టు వీరేంద్రకుమార్ తెలిపారు.

'ఏటికొప్పాక'లో ఒదిగిన ఝాన్సీ లక్ష్మీబాయి!

» అనకాపల్లి జిల్లా కళాకారుడి అద్భుత సృష్టి



ఝాన్సీ లక్ష్మీబాయి యుద్ధం చేస్తున్నట్టుగా తీర్చిదిద్దిన బొమ్మ

ఎలమంచిలి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం ఏటికొప్పాకకు చెందిన హస్త కళాకారుడు గొర్సా సంతోశ్ మరో అద్భుత కళాఖండానికి ప్రాణం పోశారు. తన వీరోచిత పోరాట పటిమతో చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన ధీర వనిత ఝాన్సీ లక్ష్మీబాయి ఆకృతిని అంకుడు కర్రతో, సహజ సిద్ధమైన రంగులను ఉపయోగించి సుమారు 20 రోజులపాటు శ్రమించి తీర్చిదిద్దినట్టు సంతోశ్ తెలిపారు. అడుగు పొడవు, అడుగున్నర వెడల్పు గల ఈ కళాఖండాన్ని అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్ధం చేసినట్టు చెప్పారు.

స్నేహితులతో కలసి.. సేవకు కదిలి..!

» వదాన్య జనసొసైటీ పేరిట సేవా కార్యక్రమాలు

» నిరుపేద విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థికసాయం

» డీఎస్సీ, కానిస్టేబుల్ ఉద్యోగ అభ్యర్థులకు ప్రోత్సాహం

» నేడు శ్రీసత్యసాయి జిల్లాలో వదాన్య అభినందన సభ : అశోక్



అశోక్ పడపాటి

హైదరాబాద్ సిటీ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): నలుగురు స్నేహితులు కలిస్తే పార్టీలు, పబ్‌లు అంటూ సరదాగా కాలం గడిపేస్తారు. కానీ అశోక్ పడపాటి మాత్రం అందుకు పూర్తి భిన్నం. ఓవైపు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా ఉద్యోగం చేస్తూనే మరోవైపు పల్లెల్లోని ప్రతిభావంతులకు బాసటగా నిలిచేందుకు విభిన్న సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. మిత్రులతో కలసి వారాంతాల్లో అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలకు నిత్యావసరాలు అందించడంతో మొదలుపెట్టి ఇప్పుడు 'వదాన్య జన సొసైటీ' పేరుతో నిరుపేద విద్యార్థుల ఉన్నతవిద్యకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఆ వివరాలు అశోక్ మాటల్లోనే... 'సాటివారికి సాయపడేలా ఏదైనా చేద్దామని నా మిత్రుడు అరుణ్ అనంత రామన్‌ను కదిలించాను. అతని మద్దతుతో మరికొంతమంది స్నేహితులూ ముందుకొచ్చారు. నెల జీతంలో 0.5 శాతం సొమ్మును సామాజిక సేవకు కేటాయించడానికి అంగీకరించారు. మొదట్లో నెలలో ఒక వారాంతం అనాథ, వృద్ధాశ్రమాలకు వెళ్లి నిత్యావసరాలు అందించడంతో సేవ మొదలుపెట్టాం. తర్వాత కూకట్‌పల్లి, బాలానగర్, మోతీనగర్ తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతి గదుల ఏర్పాటుతో పాటు కొన్నాళ్లు హైస్కూలు విద్యార్థులకు ఉచిత ట్యూషన్లు చెప్పాం. ఆర్థిక ఇబ్బందులతో ఫీజులు చెల్లించలేక ఎంతోమంది అర్ధంతరంగా చదువు ఆపేయడం చూసి చలించిపోయాం. మా వంతుగా వీలైనంతమందికి విద్యాదానం చేయాలని నిర్ణయించుకున్నాం. 2010 నుంచి ఇప్పటివరకు సుమారు 400 మంది పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం అందించాం. కరోనా కాలంలో సొంతూరైన శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు గ్రామంలో పేద రోగులకు ఆక్సిజన్ సిలిండర్లు అందించాం. ఆర్థిక స్థోమత లేక ఆన్‌లైన్ తరగతులకు దూరమవుతున్న 80మందికి ఉచితంగా ల్యాప్‌టాప్‌లు ఇచ్చాం. జిల్లాలోని స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంపొందించే లక్ష్యంతో మండల, జిల్లా స్థాయిల్లో తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు నాలుగేళ్లుగా ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు వారి ఉన్నత విద్యకు సహకరిస్తున్నాం. జిల్లావ్యాప్తంగా డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థులకు రాతపరీక్ష నిర్వహించి నగదు బహుమతులు అందజేస్తున్నాం. గత డిసెంబరులో నిర్వహించిన పరీక్షల్లో టాప్‌లో నిలిచినవారికి ఈ నెల 9న కొత్తచెరువులో మొత్తం రూ.4లక్షలు బహుమతిగా అందిస్తున్నాం. కానిస్టేబుల్ తదితర ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకూ సాయం చేయాలని నిర్ణయించాం."

రాజ్‌భవన్‌లో తేనీటి విందుకు ఆహ్వానం

అశోక్ సేవలను గుర్తించిన గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, జనవరి 26న రాజ్‌భవన్‌లోని తేనీటి విందుకు ఆహ్వానించారు. ఆహా ఓటీటీలో ప్రసారమయ్యే 'అన్‌స్టాపబుల్' కార్యక్రమంలోనూ ప్రత్యేక అతిథిగా పాల్గొని నందమూరి బాలకృష్ణ ప్రశంసలు అందుకున్నారు. భారత వికాస సంఘం అశోక్‌ను భారతీయ యువ పురస్కారంతో సత్కరించింది. వదాన్య ఆర్థిక సాయంతో ఉన్నత విద్యను అభ్యసించిన కొందరు సాఫ్ట్‌వేర్, సీఏ, మేనేజ్‌మెంట్ తదితర రంగాల్లో స్థిరపడటం తమకెంతో సంతృప్తినిచ్చిందని అశోక్ ఆనందం వెలిబుచ్చారు. ఇదంతా మిత్ర బృందం సమష్టి సహకారంతోనే సాధ్యమైందని చెప్పారు. ఉమ్మడి అనంతపురం జిల్లాను విద్యా, ఉద్యోగుల నిలయంగా తీర్చిదిద్దాలన్నదే వదాన్య సంకల్పమని వెల్లడించారు.

నేటి నుంచి శ్రీవారి తెప్పోత్సవాలు

తిరుమల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆదివారం నుంచి ఐదు రోజుల పాటు శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు జరగనున్నాయి. రోజూ రాత్రి 7నుంచి 8 గంటల వరకు స్వామి, అమ్మవార్లు పుష్కరిణిలో తెప్పపై కొలువుదీరి విహరిస్తారు. ఈ ఉత్సవాల నేపథ్యంలో మార్చి 9, 10 తేదీల్లో సహస్ర దీపాలంకార సేవను, 11, 12, 13 తేదీల్లో ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

తిరుమలలో పూర్వ వైభవం: పృథ్వీరాజ్



గతంలో ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తిరుమల ఎలా ఉండేదో ప్రస్తుతం అలానే ఉందని సినీ నటుడు పృథ్వీరాజ్ అన్నారు. తిరుమల శ్రీవారిని శనివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తిరుమలలో పూర్వ వైభవం కనిపిస్తోందని, లడ్డూ నాణ్యత కూడా పెరిగిందన్నారు.

రేపటి నుంచి రబీ ఈ-క్రాప్ ముసాయిదాపై గ్రామ సభలు

అమరావతి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): 'రబీ సాగుకు సంబంధించి రైతుల ఈ-క్రాప్ నమోదు ముగిసింది. ముసాయిదా జాబితాను సోమవారం నుంచి రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించనున్నాం' అని వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు తెలిపారు. సామాజిక తనిఖీలో భాగంగా ముసాయిదాపై గ్రామ సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అభ్యంతరాలు గ్రామ సభల్లో తెలియజేస్తే.. రైతులు ధ్రువీకరించిన వివరాలతో జాబితాలో మార్పు, చేర్పులు చేస్తామన్నారు. తుది జాబితాను ఈ నెల 22న విడుదల చేస్తామని ఆయన వివరించారు.

సెల్‌ఫోన్ కొనివ్వలేదని... బాలుడి ఆత్మహత్య

» అనంతపురం జిల్లాలో ఘటన

యాడికి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ కొనివ్వలేదని తల్లిపై అలిగి బాలుడు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన అనంతపురం జిల్లాలో జరిగింది. యాడికి మండలం నిట్టూరు గ్రామానికి చెందిన గంజి మల్లికార్జున, వెంకటలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. మల్లికార్జున గతంలోనే కుటుంబాన్ని వదిలేసి వెళ్లిపోయాడు. ఇద్దరు కొడుకులూ భవన నిర్మాణ పనులకు వెళుతుండగా.. తల్లి వెంకటలక్ష్మి కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. తనకు సెల్‌ఫోన్ కొనివ్వాలని ఇటీవల చిన్న కుమారుడు మహేంద్ర (17) తల్లిని అడిగాడు. ఇప్పుడు నీకు సెల్‌ఫోన్ అవసరమా అని తల్లి మందలించింది. దీంతో మహేంద్ర అలిగి, శుక్రవారం రాత్రి విషపుగుళికలు మింగాడు. ఇది గుర్తించిన తల్లి వెంకటలక్ష్మి చికిత్స నిమిత్తం కొడుకును తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లింది. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించింది. చికిత్స పొందుతూ శనివారం మహేంద్ర మృతిచెందాడు. తల్లి వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రీడాభివృద్ధికి సహకరించండి

» కేంద్రం సహకారంతో పాలసీ, యాప్ తెచ్చాం

» రాయచోటిలో స్టేడియం నిర్మాణానికి రూ.42.62 కోట్లు అవసరం

» కేంద్ర మంత్రి మాండవీయను కోరిన క్రీడా మంత్రి రాంప్రసాద్ రెడ్డి

అమరావతి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో పలు ప్రాజెక్టులకు, క్రీడా, మౌలిక సదుపాయాలు కల్పన కోసం నిధులు విడుదల చేయాలని కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయను, రాష్ట్ర మంత్రి రాంప్రసాద్ రెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని కన్హా శాంతివనంలో నిర్వహించిన చింతన్ శిబిర్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో క్రీడలకు ఇస్తున్న ప్రాధాన్యతను కేంద్ర మంత్రికి రాంప్రసాద్‌రెడ్డి వివరించారు. 'క్రీడాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు క్రీడల్లో కార్పొరేట్‌లతో భాగస్వామ్యం వంటి అంశాలపై సీఎం చంద్రబాబు దృష్టిపెట్టారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏపీలో నూతన క్రీడా పాలసీ, క్రీడా యాప్‌ను ఆవిష్కరించాం. రాయచోటిలో క్రీడా సముదాయ నిర్మాణం కోసం కేంద్రం నుంచి రూ.42.62 కోట్లు ప్రాజెక్టు సహకారం అందించాలి. రాయచోటిలో జిల్లా స్థాయి ఖేలో ఇండియా హాకీ కేంద్రం ఏర్పాటు చేయాలి' అని రాష్ట్ర మంత్రి కోరారు. ఈ సందర్భంగా విశాఖలో దివ్యాంగులు స్పోర్ట్స్ సెంటర్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయించంపై కేంద్ర మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి అవసరమైన సహాయ, సహకారాలు అందించేందుకు కేంద్ర మంత్రి మాండవీయ అంగీకరించారు.

గుజరాత్ కాంగ్రెస్‌లో బీజేపీ కోవర్టులు

» అవసరమైతే 40 మందిపై వేటు: రాహుల్



అహ్మదాబాద్, మార్చి 8: గుజరాత్ కాంగ్రెస్‌లోని కొందరు నేతలు బీజేపీ కోసం పనిచేస్తున్నారని కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. అవసరమైతే 30-40 మంది నాయకులపై వేటు వేసేందుకు కూడా వెనుకాడబోమని స్పష్టంచేశారు. కనీసం 5% ఓట్లు పెంచుకోగలిగితే రాష్ట్రంలో అధికారం మనదేనని చెప్పారు. రెండ్రోజుల గుజరాత్ పర్యటనలో చివరిరోజైన శనివారం అహ్మదాబాద్‌లో ఆయన పార్టీ కార్యకర్తల సమావేశంలో ప్రసంగించారు. 'మనలో కొందరు నేతలు రహస్యంగా బీజేపీ కోసం పనిచేస్తున్నారు. వారెవరో మనం వడపోయాలి. లేకుంటే రాష్ట్ర ప్రజలు మనల్ని విశ్వసించరు' అని చెప్పారు. ప్రజలు బీజేపీ వలలో చిక్కుకున్నారని అన్నారు. గత 20-25 ఏళ్ల బీజేపీ విజన్ విఫలమైందని.. కాంగ్రెస్ తేలికగా కొత్త విజన్ అందించగలదని తెలిపారు. 'గుజరాత్‌లో కాంగ్రెస్‌కు జిల్లా, బ్లాక్, ఇతర స్థాయుల్లో నేతలకు కొదువలేదు. కానీ వారు సంకెళ్లలో ఉన్నారు. నాతో సహా అందరం రాష్ట్ర ప్రజల్లోకి వెళ్లాలి. వారు చెప్పేది వినాలి. నా నుంచి ఏమాశిస్తున్నారు.. వారి విద్య, ఆరోగ్యం, భవిష్యత్ కోసం మనం ఏం చేస్తామో వారికి తెలియాలి' అని చెప్పారు. ఐదు శాతం ఓట్లు పెంచుకోగలిగినా రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తంచేశారు. తెలంగాణలో పార్టీ 22 శాతం ఓట్లు పెంచుకుందని.. అధికారంలోకి వచ్చిందని ప్రస్తావించారు. 2027లో గుజరాత్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. వచ్చే నెల 8-9 తేదీల్లో గుజరాత్(అహ్మదాబాద్)లోనే ఏఐసీసీ ప్లీనరీ జరుగనుంది.

ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోండి

» గిగ్ వర్కర్లకు కేంద్రం సూచన.. ప్రభుత్వ పథకాల వర్తింపు

న్యూఢిల్లీ, మార్చి 8: తగిన గుర్తింపు, వివిధ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడం కోసం ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని శనివారం కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ అందరు గిగ్/ప్లాట్‌ఫారం వర్కర్లను కోరింది. ఆర్థిక వ్యవస్థకు గిగ్ వర్కర్లు అందిస్తున్న సేవలను గుర్తించిన కేంద్రప్రభుత్వం 2025-26 బడ్జెట్‌లో పలు సంక్షేమ పథకాలను ప్రకటించింది. ఈ-శ్రమ్ పోర్టల్‌ను ఏర్పాటు చేసి, వారి పేర్లను నమోదు చేయనున్నట్టు, అందుకు అనుగుణంగా గుర్తింపు కార్డులు జారీ చేయనున్నట్టు ప్రకటించింది. ఆయుష్మాన్ భారత్-ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీ-పీఎంజేఏవై) కింద ఆరోగ్య సేవలు అందించనున్నట్టు తెలిపింది. ఈ ఆరోగ్య పథకం కింద గిగ్ వర్కర్లు, వారి కుటుంబ సభ్యులు ఏటా రూ.5 లక్షల మేర ఆరోగ్య సేవలు పొందడానికి వీలు కలుగుతుంది.

లలిత్ మోదీకి వనువాటు పౌరసత్వం

న్యూఢిల్లీ, మార్చి 8: ఐపీఎల్ మాజీ ఛైర్‌పర్సన్, పరారీలో ఉన్న లలిత్ మోదీ మరోసారి వార్తల్లో నిలిచారు. పసిఫిక్‌లోని ఒక చిన్న ద్వీప దేశమైన వనువాటు పౌరసత్వం పొందారు. ఈ విషయాన్ని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ధ్రువీకరించింది. మనీలాండరింగ్, పన్ను ఎగవేత ఆరోపణలు ఎదుర్కొంటున్న లలిత్ మోదీ తన పాస్‌పోర్టును లండన్‌లోని భారత హైకమిషన్ కార్యాలయంలో అప్పగిస్తానని ఇటీవల దరఖాస్తు చేసుకున్నట్లు ఎంఈఏ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు. అంతకుముందే లలిత్ వనువాటు పౌరసత్వాన్ని పొందినట్లు తెలిసిందని, అయినా చట్టప్రకారం ఆయనపై కేసు దర్యాప్తును కొనసాగిస్తామని స్పష్టం చేశారు. 3లక్షల జనాభా కలిగిన వనువాటులో గోల్డెన్ పాస్‌పోర్ట్ ప్రోగ్రామ్ అమలులో ఉంది. దీనిద్వారా రూ.1.3కోట్లు చెల్లించి ఆ దేశ పౌరసత్వాన్ని కొనుగోలు చేయవచ్చు. కాగా, గత రెండేళ్లలో దాదాపు 30మంది భారతీయులు (ఎన్ఆర్ఐలతో సహా) వనువాటు పౌరసత్వం పొందారు.

జోర్డాన్ సైన్యం చంపిన కేరళ వాసి..

జాబ్ స్కాం బాధితుడు!

న్యూఢిల్లీ, మార్చి 8: అక్రమంగా ఇజ్రాయెల్‌లోకి ప్రవేశిస్తూ జోర్డాన్ సైన్యం కాల్పుల్లో మృతిచెందిన కేరళవాసి థామస్ గ్రెబియేల్ జాబ్ స్కాం బాధితుడని అధికారులు తెలిపారు. నెలకు రూ. 3.5 లక్షల జీతం ఇస్తామని ఆశ చూపి అతడిని, మరొకరిని ఓ ఏజెంట్ జోర్డాన్ తీసుకెళ్లినట్లు అధికారులు వెల్లడించారు. భారత్ నుంచి వెళ్లే ముందు థామస్ నుంచి రూ. 2లక్షలు, అనంతరం మరో రూ. 50 వేలు తీసుకున్నట్లు తమ దర్యాప్తులో తేలిందని చెప్పారు. పర్యాటక వీసాపై జోర్డాన్ వెళ్లిన అనంతరం అక్కడ ఉద్యోగాలు లేవని ఇజ్రాయెల్‌లో మంచి జాబ్ దొరుకుతుందని థామస్‌ను ఏజెంట్ నమ్మించాడు. ఈ క్రమంలో గత నెల 10న జోర్డాన్ సరిహద్దు నుంచి అక్రమంగా ఇజ్రాయెల్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో థామస్‌పై సైన్యం కాల్పులు జరిపింది. ఈ దాడిలో అతడు మృతి చెందాడు. అతడి బంధువు ఎడిసన్ చార్లెస్ గాయపడ్డారు.

జైళ్లలో దివ్యాంగ ఖైదీలకున్న సౌకర్యాలేంటి?

» నివేదిక సమర్పించండి.. కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): జైళ్లలో వికలాంగ ఖైదీలకు ఉన్న సౌకర్యాలపై 4వారాల్లో నివేదిక సమర్పించాలని ఆదేశిస్తూ కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. జైలులో దివ్యాంగులకు సరైన వసతులు లేకపోవడం వల్లే ప్రొఫెసర్ సాయిబాబ, ఫాదర్ స్టాన్ స్వామి మరణించారని ఆరోపిస్తూ సత్యన్ అనే వ్యక్తి సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేశారు. భీమా కోరేగావ్ హింస కేసులో విచారణ ఖైదీగా జైలులో ఉండగానే స్టాన్‌స్వామి 2021లో ప్రాణాలు విడిచారు. 2014లో మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలతో అరెస్టయిన సాయిబాబ నిర్దోషిగా విడుదలైన కొన్ని నెలల్లోనే మరణించారు. జైళ్లలో వికలాంగులకు తగు ఏర్పాట్లు లేని కారణంగానే ఇద్దరు మరణించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆ పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. అంతర్జాతీయ మానవ హక్కుల ప్రమాణాలకు అనుగుణంగా దేశంలోని జైలు వ్యవస్థను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని పిటిషనర్ తరపు న్యాయవాది కోరారు.

మహిళల భద్రతకు పెద్దపీట

అతివలకు బీఎన్ఎస్ రక్షణ ఛత్రం.. పడతులపై నేరాలకు పాల్పడితే ఉరే

» ప్రపంచంలో నేనే అధిక సంపన్నుడిని

» కోట్ల మంది మహిళామణుల ఆశీస్సులు నా సొంతం.. అవే నా సంపద, బలం

» మహిళా దినోత్సవ సభలో ప్రధాని మోదీ



గుజరాత్‌లోని నవ్‌సారి జిల్లా వాంసి బోర్సి గ్రామంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ప్రధాని మోదీ

నవ్‌సారి, మార్చి 8: మహిళల భద్రతకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. వారిపై జరిగే నేరాల కట్టడికి కఠిన చట్టాలు రూపొందించడంతోపాటు నియమ, నిబంధనలను కూడా కఠినతరం చేశామని వెల్లడించారు. మహిళలపై అత్యాచారానికి పాల్పడడం సహా అమానుషాలకు ఒడిగట్టే వారికి ఉరిశిక్ష విధించేలా చట్టాలను రూపొందించినట్టు తెలిపారు. బ్రిటీష్ కాలం నాటి ఐపీసీ సెక్షన్ స్థానంలో తీసుకువచ్చిన భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్).. మహిళలకు రక్షణ కవచంగా మారిందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుజరాత్‌లోని నవ్‌సారి జిల్లాలో ఉన్న వాంసి బోర్సి గ్రామంలో శనివారం నిర్వహించిన మహిళా దినోత్సవంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల నేతృత్వంలో దేశం వేగవంతమైన పురోభివృద్ధి దిశగా దూసుకుపోతోందన్నారు. "మహిళలపై అత్యాచారాలు, అమానుషాలకు పాల్పడేవారికి ఉరిశిక్ష విధించేలా మా ప్రభుత్వం చట్టాలు తీసుకువచ్చింది. బాధిత మహిళలకు సత్వర న్యాయం జరిగేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేశాం. దేశవ్యాప్తంగా మరో 800 కోర్టులను ఏర్పాటు చేయనున్నాం. బీఎన్ఎస్‌లో మహిళలు, చిన్నారుల భద్రత కోసం ఒక ప్రత్యేక అధ్యాయాన్ని జోడించాం" అని ప్రధాని వివరించారు. బాధితులకు సత్వర న్యాయం అందని ద్రాక్ష అనే మాట గతంలో వినిపించేదని, కానీ, నూతన చట్టాల ద్వారా దారుణమైన కేసుల్లో విచారణను 60 రోజుల్లోనే పూర్తి చేయాలని, 45 రోజుల్లోనే తీర్పులు వెలువరించాలని స్పష్టంగా పేర్కొన్నట్టు తెలిపారు. కొత్త చట్టాల ద్వారా దేశంలో ఎక్కడైనా 'ఈ-ఎఫ్ఐఆర్' నమోదు చేసే సౌలభ్యం అందుబాటులోకి వచ్చిందని, లైంగిక వేధింపులు ఎదుర్కొనే మహిళలు.. జీరో ఎఫ్ఐఆర్‌లను ఎక్కడైనా నమోదు చేయొచ్చని తెలిపారు. అత్యాచార బాధితుల వాంగ్మూలాలను ఆడియో, వీడియో మాధ్యమాల్లో కూడా నమోదు చేయొచ్చని చెప్పారు.

ప్రపంచంలోనే అధిక సంపన్నుడిని!

ప్రపంచంలోనే తాను అధిక సంపన్నుడినని ప్రధాని మోదీ చమత్కరించారు. "ఔను! ప్రపంచంలోనే నేను అధిక సంపన్నుడిని. అయితే.. ధనం రూపంలో సంపన్నుడిని కాదు. కోట్లాది మంది తల్లులు, సోదరీమణులు, కుమార్తెల ఆశీస్సుల కారణంగా నేను అధిక సంపన్నుడిని. వారి ఆశీర్వాదాలే నాకు ఎనలేని శక్తి. అదే మూలధనం, అదే రక్షణ కవచం" అని ప్రధాని వ్యాఖ్యానించారు. ముస్లిం మహిళల జీవితాలను రక్షించేందుకు ట్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా కఠిన చట్టం తీసుకువచ్చామన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, 90 లక్షల స్వయం సహాయక బృందాల్లో 10 కోట్ల మందికిపైగా మహిళలు ఉన్నారని, వారంతా ఆర్థికంగా సాధికారత పొందారని మోదీ తెలిపారు. 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమం ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.

మహిళలకు మోదీ సోషల్ మీడియా!

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ తన సోషల్ మీడియా నిర్వహణను పలు రంగాల్లో ప్రముఖులైన మహిళలకు అప్పగించారు. వీరిలో చెస్, సైన్స్, గ్రామీణ పారిశ్రామిక వేత్తలు, ఆర్థికరంగంలో కీలకంగా వ్యవహరిస్తున్నవారు ఉన్నారు. వీరంతా తమ తమ రంగాల్లో ఏవిధంగా ఉన్నతస్థాయికి చేరిందీ పేర్కొన్నారు. దేశంలో 'నారీ శక్తి' తోడ్పాటును వివరించారు.

ప్రధానికి మహిళా భద్రత

నవ్‌సారిలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని మోదీకి భద్రతగా మహిళా పోలీసులను నియమించారు. సుమారు 2500 మంది మహిళా పోలీసులు ఆయనకు భద్రత కల్పించారు. ఈ కార్యక్రమంలో లక్షన్నర మహిళలు పాల్గొన్నప్పటికీ ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మహిళా పోలీసులు కట్టుదిట్టంగా వ్యవహరించారు. మోదీ పర్యటనలో ఆయన భద్రతను పూర్తిగా మహిళా అధికారులకే అప్పగించడం ఇదే తొలిసారని ఉన్నతాధికారులు తెలిపారు.

పాక్, చైనాల కుమ్మక్కు నూరు శాతం నిజం

» సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది



న్యూఢిల్లీ, మార్చి 8: పాకిస్థాన్, చైనాలు నూరు శాతం కుమ్మక్కయ్యాయని, ఈ వాస్తవాన్ని భారత్ గుర్తించక తప్పదని సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది అభిప్రాయపడ్డారు. ఈ కారణంగా పశ్చిమం, ఉత్తరం..రెండు దిక్కులా దాడిని ఎదుర్కోవాల్సిన ముప్పు ఏర్పడిందని తెలిపారు. ఇక్కడ ఒక ఆంగ్ల న్యూస్ ఛానల్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పాక్ వద్ద ఉన్న ఆయుధాలన్నీ చైనాలో తయారైనవేనని అన్నారు. సీమాంతర ఉగ్రవాదం గురించి మాట్లాడుతూ పొరుగుదేశం నుంచి ఉగ్రవాదుల రాక ఏమీ తగ్గలేదని చెప్పారు. వారి రాక పెరగనుందని, పరిస్థితులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. "గత ఏడాది పట్టుబడిన ఉగ్రవాదుల్లో 60% మంది పాకిస్తాన్ మూలాలు ఉన్నవారే. అందువల్ల పొరుగు దేశం నుంచి ఇంకా ముప్పు తొలగిపోలేదు" అని ఆయన వివరించారు. దేశంలో ప్రస్తుతం 'యుద్ధమూ లేదు... శాంతీ లేదు' అన్నట్లుగా పరిస్థితి ఉందని అన్నారు.

కులభూషణ్ కిడ్నాప్ సూత్రధారి ముఫ్తీ షా మిర్ హత్య

న్యూఢిల్లీ, మార్చి 8: భారత నేవీ మాజీ అధికారి, వ్యాపారవేత్త కులభూషణ్ జాదవ్‌ను ఇరాన్ నుంచి పాకిస్థాన్ ఐఎస్ఐ కిడ్నాప్ చేయడంలో కీలకంగా సహకరించిన ముస్లిం 'స్కాలర్' ముఫ్తీ షా మిర్ దారుణహత్యకు గురయ్యాడు. బలూచిస్థాన్‌లోని టర్బట్‌లో గుర్తుతెలియని దుండగులు ఆయనపై కాల్పులు జరిపారు. మసీదులో ప్రార్థనల అనంతరం బయటకు వస్తున్న సమయంలో మోటార్ సైకిళ్లపై వచ్చిన దుండగులు దాడి చేశారని పోలీసులు వెల్లడించారు. తీవ్ర గాయాలైన ముఫ్తీ షా మిర్‌ను స్థానిక ఆస్పత్రిలో చేర్పగా.. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. ముఫ్తీ షా గతంలో రెండు హత్యాయత్నాల నుంచి బయటపడ్డాడు. బలూచిస్థాన్‌లోని టర్బట్ నివాసి అయిన మిర్.. ఐఎస్ఐ ఆదేశాల మేరకు పనిచేస్తుంటాడు.

మనం తగ్గొద్దు..!

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



(మొదటి పేజీ తరువాయి)

ఆల్ ఇండియా డ్రగ్స్ కంట్రోల్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ (ఏఐడీసీఓసీ) గౌరవ డైరెక్టర్ జనరల్‌గా, ఏఐడీసీఓసీ ట్రైనింగ్ అకాడమీ డైరెక్టర్ జనరల్‌గా సేవలు అందిస్తున్నారు. అమెరికా ప్రతీకార పన్నుల ప్రకటన నేపథ్యంలో మన వైఖరి ఎలా ఉండాలి? మన అడుగులు ఏ దిశగా పడాలి? అనే అంశాలపై 'ఆంధ్రజ్యోతి'తో ఉదయ్ భాస్కర్ తన అభిప్రాయాలు పంచుకున్నారు.

ప్రతీకార సుంకాలకు సంబంధించి మన దేశం ట్రంప్ బెదిరింపులకు లొంగుతోందా?

జవాబు: దురదృష్టవశాత్తు అవుననే చెప్పాలి. ఫార్మా ఎగుమతుల్లో 126 బిలియన్ డాలర్లతో జర్మనీ మొదటి స్థానంలో ఉంది. మనం 27 బిలియన్ డాలర్లతో 11వ స్థానంలో ఉన్నాం. అమెరికాను పక్కన పెడితే మొదటి ఐదు స్థానాల్లో ఉన్నవన్నీ ఐరోపా దేశాలే. అవేవీ ట్రంప్ బెదిరింపులకు తలొగ్గలేదు. మనమే ఒక అడుగు ముందుకేసి తలొగ్గుతున్నాం. మన ప్రభుత్వం అమెరికా దిగుమతులపై సుంకాలను పూర్తిగా ఎత్తివేసేలా అడుగులు వేస్తోంది.

ఫార్మాలో అమెరికాకు మన అవసరం ఏమిటి?

జవాబు: చాలా ఉంది. అమెరికాకు అవసరమైన జనరిక్ మందుల్లో 30 శాతం మందులను మనమే ఎగుమతి చేస్తున్నాం. మరే దేశమూ ఇవ్వలేనంత చౌకగా, నాణ్యతతో మనం అందిస్తున్నాం. ఇంత తక్కువకు అమెరికా స్వయంగా ఉత్పత్తి చేయలేదు. మన దేశ ఫార్మా ఎగుమతులపై అధిక సుంకాలు విధిస్తే... అమెరికా ఆరోగ్య రంగం మరింత ఖరీదవుతుంది. ట్రంప్ తన ప్రజలను బలిపెట్టి ప్రతీకారానికి దిగుతాడని నేను అనుకోవడం లేదు. ఆయన పక్కా వ్యాపారవేత్త. ఆయన బెదిరింపులను ఈ కోణంలోనే చూడాలి.

చైనా కూడా బెదిరింపులకు దిగితే పరిస్థితి ఏమిటి?

జవాబు: రసాయనాలు, యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రెడియెంట్స్ (ఏపీఐ)ల కోసం ప్రపంచమంతా చైనాపైనే ఆధారపడి ఉంది. 80వ దశకం వరకూ ఏపీఐ తయారీ రంగంలో మనం బలంగానే ఉన్నాం. ఆ తరువాత మనం లాభాలు ఎక్కువగా ఉన్న ఫార్ములేషన్ వైపు మళ్లాం. ఐరోపా కూడా అంతే. వాటిని చైనా అందిపుచ్చుకుంది. తనను కాదనుకుని ప్రపంచంలో ఏ దేశమూ చేయగలిగింది ఏమీ లేదన్న స్థాయికి చైనా ఎదిగింది. రసాయనాలు, యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రెడియెంట్స్ (ఏపీఐ)ను చైనా ఆపివేస్తే... ప్రపంచ ఫార్మా రంగంపై తీవ్ర ప్రభావం పడుతుంది.

చైనా ప్రభావాన్ని తగ్గించుకోవడమెలా?

జవాబు: కెమికల్ పార్క్‌లను ఏర్పాటు చేయాలి. కాలుష్యం గురించి ఆందోళన అక్కర్లేదు. ఇప్పుడు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. అలాగే ఏపీఐపైనా దృష్టి సారించాలి. ఇదంతా చేయడానికి మనకు 10 నుంచి 15 ఏళ్లు పట్టవచ్చు. అప్పటికైనా... ఓ మేరకు స్వయం సమృద్ధిని సాధించగలుగుతాం. వాటికితోడు మనం ఇప్పుడు రిసెర్చ్, ఇన్నోవేషన్‌పై పెట్టుబడులు పెట్టాలి. ఫార్మా రంగం తనకు వస్తున్న లాభాలను ఇతర రంగాలకు మళ్లిస్తోంది. అలాకాకుండా దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్టి కోణంలో ఆలోచించాలి. ప్రభుత్వం నుంచి వివిధ రూపాల్లో ప్రోత్సాహకాలు అందాలి.

ట్రంప్ వచ్చాక 'యూఎస్ ఎయిడ్' నిలిపివేశారు. దీని ప్రభావం మన ఫార్మాపై ఏమేరకు ఉండొచ్చు?

జవాబు: నిజం చెప్పాలంటే... ప్రతీకార సుంకాల కంటే, యూఎస్ ఎయిడ్ నిలిపివేతవల్లే మన ఫార్మాపై ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. ఆఫ్రికన్ దేశాలకు, తూర్పు ఆసియా, లాటిన్ అమెరికాలోని కొన్ని దేశాలకు ప్రపంచ ఆరోగ్య సంస్థ, వివిధ స్వచ్ఛంద సంస్థలు మందులను అందిస్తున్నాయి. వ్యాక్సిన్లు, ఎయిడ్స్ టీబీ మందులు వంటివి కీలకమైనవి. పేద ప్రజల ప్రాణ రక్షణకు అత్యంత చౌకగా నాణ్యమైన మందులను అందిస్తున్న ఏకైక దేశం భారతదేశం. అమెరికా సాయం ఆగిపోతున్న నేపథ్యంలో కచ్చితంగా ఆ ప్రభావం మన కంపెనీలపై ఉంటుంది. ఇది కేవలం ఆర్థిక, వాణిజ్యపరమైన సమస్య కాదు. ప్రపంచంలోని కోట్లాది మంది నిరుపేదల ప్రాణాలతో అమెరికా ఆడుకుంటోంది. లక్షల సంఖ్యలో ఉన్న ఎయిడ్స్ బాధితులు మందులు అందక మరణం అంచుకు చేరుకుంటారు.

ప్రపంచవ్యాప్తంగా విశాల వాణిజ్య దృక్పథాలకు వీడ్కోలు పలుకుతున్న ధోరణులు కనిపిస్తున్నాయా?

జవాబు: లోకలైజేషన్‌తో వస్తున్న ఇబ్బందులివి. ప్రతి దేశమూ తనదైన శైలిలో ఆయా రంగాల్లో రాణించాలని అనుకుంటోంది. ఆత్మనిర్భర్ నినాదం ఆకర్షణీయమైనది. అయితే నూరు శాతం సాధ్యం కాదన్న కఠిన వాస్తవాన్ని గుర్తుంచుకోవాలి. నేటి వాణిజ్య ప్రపంచంలో సంకుచిత ధోరణులతో సాధించగలిగేది ఏమీ లేదన్నది తెలియకేం కాదు.

తెలుగు రాష్ట్రాల్లో ఫార్మా ఎగుమతుల విలువ ఎంత?

జవాబు: పెద్ద, చిన్న కంపెనీలు అన్నీ కలుపుకొంటే సుమారు వెయ్యి వరకూ ఉన్నాయి. డీజీసీఐఎస్ లెక్కల ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఫార్మా ఎగుమతుల్లో మన రెండు రాష్ట్రాల వాటా 26.82 శాతం. తెలంగాణ 18.92 శాతం... 5,268.59 మిలియన్ డాలర్లతో రెండో స్థానంలో ఉండగా, ఆంధ్రప్రదేశ్ 7.90 శాతం... 2,199.26 మిలియన్ డాలర్లతో 4వ స్థానంలో ఉంది. మన దేశం నుంచి అవుతున్న మొత్తం ఎగుమతుల విలువ 27,846.38 మిలియన్ అమెరికన్ డాలర్లు. ఉద్యోగుల సంఖ్య సుమారుగా రెండు లక్షల వరకూ ఉండవచ్చని అంచనా!

ఆంక్షల ప్రభావం తెలుగు రాష్ట్రాలపై ఎంత?

జవాబు: మన రెండు రాష్ట్రాల నుంచి జరిగే ఎగుమతుల్లో 80 శాతం వాటా పెద్ద కంపెనీలదే. అమెరికాతోపాటు ప్రపంచంలోని వివిధ దేశాలకు ఈ ఔషధాలు వెళ్తున్నాయి. ఈ కంపెనీలపై అమెరికా ఆంక్షల ప్రభావం పెద్దగా ఉంటుందని నేను అనుకోవడం లేదు. మరెక్కడా లేని విధంగా దేశవ్యాప్తంగా 650కుపైగా యూఎస్ఎఫ్‌డీఏ అనుమతి పొందిన ఉత్పత్తి కేంద్రాలు మన దేశంలో ఉన్నాయి. అక్కడ తయారయ్యే మందులు ప్రపంచంలోని ఏ దేశానికైనా వెళ్లగలిగే నాణ్యతను కలిగి ఉన్నాయి.

హంపిలో ఇద్దరు మహిళలపై గ్యాంగ్ రేప్

విదేశీ మహిళ, హోం స్టే నిర్వాహకురాలిపై ముగ్గురు యువకుల దాడి, అత్యాచారం

» అడ్డొచ్చిన ముగ్గురిని తుంగభద్రలోకి తోసేసిన దుండగులు.. ఒక వ్యక్తి మృతి

» ఇద్దరు నిందితుల అరెస్టు

బళ్లారి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): హంపి పర్యటనకు వచ్చిన విదేశీ మహిళ, స్థానికంగా హోం స్టే నిర్వహిస్తున్న మరో మహిళపై ముగ్గురు యువకులు అత్యాచారానికి ఒడిగట్టారు. బరితెగించిన ఆ ముగ్గురిలో ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొప్పళ జిల్లా ఎస్పీ రామ్ ఎల్ అరసిద్ధ తెలిపిన వివరాల మేరకు.. ఇజ్రాయెల్‌కు చెందిన మహిళ(27), హోం స్టే నిర్వాహకురాలు(29), అమెరికాకు చెందిన డేనియల్, మహారాష్ట్రకు చెందిన పంకజ్, ఒడిశాకు చెందిన బిబాష్.. హంపి సమీపంలోని సనాపుర వద్ద తుంగభద్ర నది ఒడ్డున గురువారం సేదదీరుతున్నారు. వీరి వద్దకు ముగ్గురు యువకులు బైక్‌పై వచ్చారు. పెట్రోల్‌కు డబ్బులు కావాలని అడిగారు. విదేశీ మహిళ వారికి రూ. 20 ఇవ్వగా, రూ. 100 కావాలని డిమాండ్ చేశారు. దీనికి నిరాకరించడంతో వాగ్వాదానికి దిగారు. రాళ్లతో, ముష్టిఘాతాలతో దాడి చేశారు. ఇద్దరు మహిళలు మినహా.. మిగిలిన ముగ్గురినీ నీటిలోకి తోసేశారు. అనంతరం హోం స్టే నిర్వాహకురాలిపై ఇద్దరు, విదేశీ మహిళపై ఒకరు అత్యాచారం చేశారు. నీటిలో పడిన ముగ్గురిలో డేనియల్, పంకజ్ ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. బిబాష్ మాత్రం నీటిలో మునిగి మృతిచెందాడు. మృతదేహం శుక్రవారం నీటిపైకి తేలింది. అత్యాచారానికి పాల్పడినవారిలో కొప్పళ జిల్లా గంగావతి తాలూకా సాయి నగర్‌కు చెందిన మల్లేశ్ (22) అలియాస్ హండి మల్లా, చేతన్ సాయి(21)లను అరెస్టు చేశారు. మూడో వ్యక్తి కోసం ప్రత్యేక పోలీసు బలగాలు గాలిస్తున్నాయి. కాగా, అత్యాచార ఘటనపై గంగావతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి ఎఫ్ఐఆర్ నమోదైంది. హోం స్టే నిర్వాహకురాలి బ్యాగ్, అందులో ఉన్న రెండు సెల్‌ఫోన్‌లు, రూ. 9,500 నగదును కూడా ముగ్గురు దుండగులు లాక్కుని వెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటన గురువారం రాత్రి 11.30 ప్రాంతంలో జరిగినట్లు తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షిస్తాం: సిద్దరామయ్య

హంపి సమీపంలో అత్యాచార ఘటనను కర్ణాటక సీఎం సిద్దరామయ్య తీవ్రంగా ఖండించారు. హంపి లాంటి ప్రదేశాల్లో ఇలాంటి దారుణం జరగడం క్షమించరాని నేరమన్నారు. అత్యాచారానికి పాల్పడినవారిని కఠినంగా శిక్షిస్తామని తెలిపారు. ఈ ఘటనపై బెంగళూరులో పోలీస్ ఉన్నతాధికారులతో సీఎం మాట్లాడారు. బాధిత విదేశీ మహిళతో ఫోన్‌లో తనతో మాట్లాడించాలని పోలీసులను ఆదేశించారు. బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తత

» భద్రతా బలగాలతో కుకీ నిరసనకారుల ఘర్షణ

» ఒకరి మృతి, 25 మందికి గాయాలు

ఇంఫాల్/న్యూఢిల్లీ, మార్చి 8: మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కుకీ తెగ నిరసనకారులు, భద్రతా బలగాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు శనివారం నుంచి రాష్ట్రంలో స్వేచ్ఛగా తిరిగేందుకు అనుమతిచ్చారు. అయితే తమకు ప్రత్యేక పరిపాలన కల్పించే డిమాండ్ నెరవేరే వరకు స్వేచ్ఛగా తిరిగేందుకు అనుమతించవద్దంటున్న కుకీలు కాంగ్‌పోక్పి జిల్లాలో పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. ఈ సందర్భంగా నిరసనకారులు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన ఘర్షణలో ఒక వ్యక్తి మరణించగా.. 25 మందికి గాయాలపాలయ్యారు. ఈ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి నుంచి కుకి జో ప్రాంతంలో నిరవధిక బంద్‌కు కుకి జో మండలి పిలుపునిచ్చింది. కేంద్ర మంత్రి ఆదేశాలను నిరసిస్తూ కుకీల ఆధిపత్యం ఉన్న జిల్లాలో నిరసనకు దిగిన వారిని చెదరగొట్టేందుకు పోలీసులు టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. కుకీల ప్రాబల్యం ఉన్న చాలా ప్రాంతాల్లో ఘర్షణలు చోటు చేసుకున్నాయి. నిరసనకారులు వాహనాలపై రాళ్లు రువ్వడమేకాకుండా రోడ్లను తవ్వారు. ఇదిలా ఉండగా.. రాష్ట్రంలో దాదాపు 114 ఆయుధాలు, ఐఈడీలు, గ్రెనేడ్లు, మందుగుండు సామగ్రిని భద్రతా బలగాలు సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు. అలాగే రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొనేందుకు వీలుగా రాష్ట్రంలో నిషేధిత సంస్థలకు చెందిన ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేసినట్టు చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ రాజీనామా తర్వాత మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.